ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-8-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 207 పేజీలు: 10+4 వెల: 6.50

'ఓట్ల చోరీ'పై ఇసి ప్రజాభిప్రాయం
ప్రధాని మోడీ, పుతిన్‌కు చైనా అధ్యక్షుని ఆహ్వానం
5

## శుభాకాంక్షలు



వినాయకచవితి పర్వదినం సందర్భంగా మా పాఠకులు, ప్రకటన కర్తలు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.
**-డా॥ గిరీష్ కుమార్ సంఘీ**
**'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్**

## సెలవు

పండుగ సందర్భంగా బుధవారం 'వార్త' కార్యాలయానికి సెలవు. గురువారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 29వ తేదీ శుక్రవారం.

## 30 నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

### కాళేశ్వరం నివేదికను సభలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

### 30న కేబినెట్ భేటీ.. 'స్థానిక' ఎన్నికలపై కీలక నిర్ణయం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు26:** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఈ నెల 30 నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనుంది. అసెంబ్లీ,శాసనమండలి సమావేశాల నిర్వహణకు ఈ మేరకు గవర్నర్ సమ్మన్లు జారీ చేశారు. 30న ఉదయం 10.30 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. దాదాపు మూడు నుంచి ఐదు రోజుల పాటు ఈ సమావేశాలు కొనసాగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ సమావేశాల్లో కాళేశ్వరం నివేదికపైనే ప్రధానంగా చర్చ జరగనుండటంతో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించింది. అయితే, ఈ నివేదికను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. విచారణ సందర్భంగా, అసెంబ్లీలో నివేదికపై చర్చ జరిపిన తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ప్రభుత్వం తరఫున >>2



# ఇక సాదాబైనామాల క్రమబద్ధీకరణ

## గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హైకోర్టు

### 9 లక్షల దరఖాస్తులకు మోక్షం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

### 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10 దాకా స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనకు హైకోర్టు అనుమతి

### 'భూ భారతి' ద్వారా దరఖాస్తులకు పరిష్కారం: మంత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు26:** రాష్ట్రంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అడ్డంకి తొలగిపోయింది. ఆరేండ్లుగా పెండింగ్‌లో ఉంచిన 9 లక్షల దరఖాస్తులకు మోక్షం లభించింది. సాదాబైనామాల కింద కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణలో నెలకొన్న న్యాయపరమైన చిక్కులు తొలిగాయి. 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించేందుకు హైకోర్టు అనుమతించింది. మంగళవారం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లను క్లియర్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన రిట్ పిటీషన్‌ని డిస్మిస్ చేస్తూ న్యాయస్థానం తీర్పును ఇచ్చింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు 2020 అక్టోబర్ 10న రాష్ట్ర ప్రభుత్వం జివో విడుదల చేసింది. ఈ జివోపై 2020 నవంబర్‌లో ఉన్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. చట్టంలో అవకాశం లేకుండా ఎలా క్రమబద్ధీ కరిస్తారని ప్రశ్నించింది. కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణ అంశం పొందుపర్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ వివరణతో సంతృప్తి చెందిన ధర్మాసనం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అంగీకరిస్తూ కేసు విచారణను ముగించింది. కాగా, భూభారతి చట్టం ద్వారా సాదాబైనామాల దరఖాస్తులకు పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. సాదాబైనామాలపై ఉన్న స్టేను రాష్ట్ర హైకోర్టు మంగళవారం నాడు తొలగించిందని ఈ తీర్పు లక్షలాది మంది పేద ప్రజల కలలను సాకారం చేస్తుందన్నారు. సాదాబైనామాల విషయంలో గత ప్రభుత్వం పేద ప్రజలను నమ్మించి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి దరఖాస్తుల >>2

## వాన్‌పిక్‌కు హైకోర్టులో చుక్కెదురు



**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాత వార్త:** ఎపి మాజీ సిఎం వై.ఎస్ జగన్ అక్రమాస్తుల కేసు నిందితుల జాబితాలో వున్న వాన్‌పిక్ సంస్థకు తెలంగాణ హైకోర్టులో మరోసారి చుక్కెదురయ్యింది. ఈ కేసుకు సంబంధించి సిబిఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో తమ సంస్థ పేరును తొలగించాలని వాన్‌పిక్ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. ఈ కేసు ను నాంపల్లి సిబిఐ కోర్టు విచారణలో వుంది. 2022 జూలై నెలలో వాన్‌పిక్ ప్రాజెక్టు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. అయితే >>2

## దేశంలో ఎక్కడా లేని భూ సమస్యలు తెలంగాణలోనే..

### నాగారం భూములపై హైకోర్టు విచారణలో జస్టిస్ కె. లక్ష్మణ్

### నిషేధిత జాబితాలో ఉండగా పట్టాలెలా ఇచ్చారని ప్రశ్నించిన పిటిషనర్

### అవి పట్టా భూములేనన్న ప్రభుత్వ న్యాయవాది

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** మహేశ్వరం మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వివాదాస్పద భూముల విషయంపై మంగళవారంనాడు హైకోర్టులో విచారణ జరిగింది. బిర్ల మహేశ్ అనే పిటిషనర్ దాఖలు చేసిన కేసులో ఈ భూములపై ప్రభుత్వ స్పందనను న్యాయస్థానం పరిశీలించింది. నాగారంలోని సర్వే నంబర్ 194లో 383 ఎకరాలు, 195లో 370 ఎకరాలు ఉన్నాయని హైకోర్టుకు ప్రభుత్వ న్యాయవాది మురళీధర్ రెడ్డి తెలిపారు. వీటిలో కేవలం 95.24 ఎకరాలు మాత్రమే నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన భూములన్నీ పట్టా భూములు అని స్పష్టం చేశారు. నిషేధిత భూములపై ఇప్పటివరకు ఎలాంటి లావాదేవీలు జరగలేదని కోర్టుకు వెల్లడించారు. నాగారంలో 700 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని, 2019 వరకు నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ 2018లోనే వీటికి పట్టాలిచ్చారని మహేశ్వరం మండలం అమీర్‌పేటకు చెందిన బిర్ల మహేశ్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు నిషేధిత జాబితాలో ఉన్న భూములకు పట్టాలెలా ఇచ్చారో సమాధానం చెప్పాలని రెవెన్యూ శాఖకు నోటీసులు జారీ చేసింది. పిటీషనర్లు లేవనెత్తిన అభ్యంతరాల్లో ఏమాత్రం వాస్తవం లేదని, అవి పట్టా భూములేనని మంగళవారం >>2




## సెప్టెంబరు 2న ఓటర్ల తుది జాబితా

### స్థానిక ఎన్నికలకు ఇసి సమాయత్తం

### పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా.. విడుదలకు నోటిఫికేషన్

### హైకోర్టు ఆదేశంతో సెప్టెంబరు 30 లోగా స్థానిక ఎన్నికల నిర్వహణకు ఇసి కసరత్తు


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిపై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని జిల్లా పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది. ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరు నాడే.. అంటే ఆగస్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫొటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణ చేస్తారని ఎన్నికల సంఘం తెలిపింది. సెప్టెంబర్ 2న జిల్లా పంచాయతీ అధికారి వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తారు. గతంలో గడువు ముగిసినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. వాస్తవంగా 2024, జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. దీంతో ఏడాదిన్నరగా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో పై విధంగా >>2



## వరల్డ్ చాంపియన్ చికితకు సిఎం అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు26:** కెనడాలో జరుగుతున్న ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత తానిపర్తికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఆర్చరీ అండర్ 21 కేటగిరీ ఫైనల్లో కొరియాకు చెందిన పార్క్ యెరిన్‌పై విజయం సాధించి >>2

# వర్సిటీలో డ్రగ్స్ దందా!



### బండారం రట్టు చేసిన 'ఈగల్' పోలీసులు

### ఇద్దరు విద్యార్థులు సహా నలుగురి అరెస్టు

### పలువురు స్టూడెంట్లకు పాజిటివ్.. 50 మందిపైగా వాడినట్లు గుర్తింపు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో పేరొందిన మహేంద్ర యూనివర్శిటీలో కొనసాగుతున్న డ్రగ్స్ బండారాన్ని ఈగల్ (పూర్వపు టి.నాబ్) పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా గంజాయితో పాటు ఓజి వెడ్‌ను, ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డిజి సందీప్ శాండిల్యా మంగళవారం మీడియాకు వెల్లడించారు. విద్యా సంస్థల్లో కొనసాగుతున్న డ్రగ్స్ రాకెట్‌పై ఉక్కుపాదం మోపుతున్న ఈగల్ పోలీసులు మరో బడా విద్యా సంస్థ మహేంద్ర యూనివర్శిటీలో విద్యార్థులతో పాటు నైజీరియన్ స్మగ్లర్, ఇంకొందరు కలిసి నిర్వహిస్తున్న దందాను బట్టబయలు చేశారు. పేట్ బషీరాబాద్‌లో వెలుగుచూసిన మల్నాడు రెస్టారెంట్ డ్రగ్స్ రాకెట్ కేసును విచారిస్తున్న సమయంలో ఈగల్ పోలీసులకు మహేంద్ర యూనివర్శిటీలోనూ డ్రగ్స్ దందాలు సాగుతున్న విషయం వెలుగు చూసింది. దీంతో కొన్ని రోజులుగా ఈ యూనివర్శిటీలో సాగుతున్న డ్రగ్స్ దందాపై రహస్యంగా నిఘా వుంచగా ఇది నిజమని తేలింది. ఈ వర్శిటీలో చదువుతున్న కొందరు విద్యార్థులు చదువు పట్ల నిర్లక్ష్యం వహించి డ్రగ్స్‌బారిన పడినట్లు తేలింది. ఈ దందాలో వర్శిటీలో చదువుతున్న మణిపూర్ రాష్ట్రానికి చెందిన నెవెల్లె తొంగ్‌బ్రాం (21) తో పాటు ఇదే వర్శిటీలో చదువుతున్న ఢిల్లీకి చెందిన మహమ్మద్ అస్వర్ జావెద్ ఖాన్ (21), జీడిమెట్లకు చెందిన అంబటి గణేష్ (24), ఇదే ప్రాంతానికి చెందిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బూస శివకుమార్ (26)లను సోమవారం రాత్రి ఈగల్ పోలీసులు పక్కా ఆధారాలతో అరెస్టు చేశారు. ఈ నలుగురికి నైజీరియాకు చెందిన నిక్ అనే బడా డ్రగ్స్ స్మగ్లర్ గంజాయితో పాటు కావలసిన అన్ని రకాల డ్రగ్స్‌ను సరఫరా చేసేవాడు. ఇతను పంపే డ్రగ్స్‌ను మహేంద్ర యూనివర్శిటీకి చెందిన నెవెల్లె తొంగ్‌బ్రాం, మహమ్మద్ అస్వర్ జావెద్ ఖాన్‌లు చిన్న ప్యాకెట్లుగా మార్చి ఇతర విద్యార్థులకు తమకు నమ్మకంగా వుండే ఇతరులకు అమ్ముతున్నారు. కాగా నెక్‌కు కర్నాటకతో పాటు ఢిల్లీ సహా ఇతర ప్రాంతాలలో ఏజెంట్లు వున్నారు. తన కస్టమర్లకు నెక్ కొరియర్ కంపెనీల ద్వారా పార్శిల్‌లో డ్రగ్స్‌ను పంపుతుంటాడు. ఇదే విధంగా మహేంద్ర యూనివర్శిటీ విద్యార్థులు నెక్ అతని ఏజెంట్లను నుంచి గంజాయితో పాటు ఎండిఎంఎ సహా ఇతర డ్రగ్స్‌ను కొంటున్నారు. డ్రగ్స్‌కొనే క్రమంలో విద్యార్థులు దీని తాలూకు డబ్బులను >>2



నిందితుడు ఖయ్యూం

## పోక్సో కేసులో దోషికి 51 యేళ్ల జైలు



### నల్లగొండ జిల్లాకోర్టు సంచలన తీర్పు

### రూ. 85 వేలు జరిమానా, బాధితురాలికి రూ. 7 లక్షల పరిహారం

**నల్గొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త:** తిప్పర్తిపోక్సో కేసులో నల్గొండ జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. దోషికి 51 ఏళ్ల కఠిన కారాగార శిక్షను విధించింది. అంతేకాదు.. 85 వేలు జరిమానా విధిస్తూ బాధితురాలికి 7 లక్షల పరిహారం అందించాలని నల్గొండ జిల్లా కోర్టు ఆదేశించింది. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడు ఖయ్యూంకి ఈ కఠిన కారాగార శిక్షను కోర్టు విధించింది. క్రైమ్ నం.242/2021, తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. (S.C. నం.94/2022)లో, తిప్పర్తి గ్రామం, మండలానికి చెందిన నిందితుడు ఖయ్యూంను ఎస్సీ ఎస్టీ కోర్ట్ జడ్జి రోజా రమణి దోషిగా తేల్చారు. అత్యాచారానికి 20 సంవత్సరాల కారాగార శిక్ష, ఫోక్సో చట్టం కింద మరో 20 సంవత్సరాల కారాగార శిక్ష, ఎస్సీ/ఎస్టీ (సంబంధితసెక్షన్) చట్టం కింద 10 సంవత్సరాల కారాగార శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. వీటితో పాటు.. ఐపీసీ సెక్షన్ 506 కింద ఒక సంవత్సరం కారాగార శిక్షను కూడా విధించారు. బాధితురాలు.. 16 ఏళ్ల బాలిక (ఎస్టి కమ్యూనిటీ). నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో బలమైన సాక్ష్యాధారాలను తిప్పర్తి ఎస్ఐ శంకర్ దాఖలు చేశారు. జడ్జి >>2





జీతభత్యాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కోల్‌కతాలో ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

## దోషికి 51 యేళ్ల జైలు

>> రోజా రమణి ఈ తరహా తీర్పును వెలువరించడం ఈ నెలలో(ఆగస్ట 2025) ఇది రెండోసారి. బాలికను అత్యాచారం చంపేసిన వ్యక్తికి నల్గొండ పోక్సో కోర్టు ఉరి శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. 2013లో ఈ ఘటన జరిగింది. నల్గొండ హైదర్‌ఖాన్ గూడలోని ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న 11 ఏండ్ల బాలికపై మాన్యం చెల్కకు చెందిన మహ్మద్ ముక్రం అత్యాచారం చేశాడు. రేప్ చేసిన విషయం ఎక్కడ బయటపడుతుందో అన్న భయంతో బాలిక మెడకు చున్నీ బిగించి హత్య చేశాడు. తర్వాత డెడ్‌బాడీని డ్రైనేజీలో పడేశాడు. ఈ ఘటన 2013, ఏప్రిల్ 28న జరిగింది. బాలిక కనిపించకపోవడంతో పేరెంట్స్ నల్గొండ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశాక విచారించిన పోలీసులు.. 2015లో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.పదేండ్ల పాటు సుదీర్ఘ వాదనలు, వాయిదాలు కొనసాగాయి. పోలీసులు సమర్పించిన ప్రూఫ్స్!!తో సెక్షన్ 376ఏ, 302, 201 , లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం 2012లోని సెక్షన్ 6 కింద నిందితుడు ముక్రంను పోక్సో కోర్టు దోషిగా తేల్చింది. దీంతో నిందితుడు ముక్రంకు ఉరిశిక్ష విధిస్తూ పోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి జస్టిస్ రోజా రమణి తీర్పు వెలువరించారు. దీంతో పాటు రూ.1.10 లక్షల జరిమానా విధించారు. బాలిక ఫ్యామిలీకి రూ.10 లక్షలు పరిహారం అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

## ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని ముఖ్యమంత్రి విఘ్నేశ్వరుడుని ప్రార్థించారు. వాడ వాడల వెలిసే గణేష్ మండపాలలో భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు.ఈగణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నదని చెప్పారు.

## రాష్ట్ర ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.అన్ని విఘ్నాలను తొలగించి ప్రజలకు శుభాలను చేకూర్చే ఆదిదేవునిగా విఘ్నేశ్వరుడు హిందూ మత సంప్రదాయంలో ప్రత్యేక పూజలు అందుకుంటారని తెలిపారు.దేశ ప్రజల సామాజిక జీవన విధానంలో గణనాధుని నవరాత్రి వేడుకలు.,పల్లె నుండి పట్టణం దాకా ప్రజల సాంస్కృతిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తున్నదని అన్నారు.వినాయక చవితి పర్వదినం నుండి ప్రారంభం అయ్యే గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా,ప్రజల్లో మతసామరస్యం, దైవభక్తి, సమష్టి తత్వం మరింతగా బలపడాలని ఆకాంక్షించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం కలిసివచ్చి, రైతన్నల కుటుంబాల్లో సుఖ శాంతులు వెల్లి విరిసేలా దీవించాలని గణనాథుని ప్రార్థించారు.

## 2న ఓటర్ల తుది జాబితా

>>కోర్టు తీర్పు వెలువరించింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందింది. అనంతరం కేంద్రానికి పంపింది. దీనిపై కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఈ బిల్లును అమోదించాలంటూ తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ఆందోళనలు చేపట్టిన విషయం విదితమే. ఇంకోవైపు ఈ బిల్లు ఆమోదం కోసం అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీతోపాటు బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలు ఒకదానిపై ఒకటి విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నాయి.

## వర్సిటీలో డ్రగ్స్ దందా!

>> నెక్ అతని ఏ జెంట్లకు ఫోన్ లేదా డిజిటల్ పే ద్వారా ముందుగానే అందజేస్తున్నారు. కొన్నిసార్లు ఈ చెల్లింపులు వేలాది రూపాయల్లో వుంటున్నాయని ఈగల్ పో లీసులు గుర్తించారు. మహేంద్ర యూనివర్శిటీ విద్యార్థుల్లో డ్రగ్స్ బారినపడ్డ వారిని, స్మగ్లర్లుగా మారిన వారిని గుర్తించేందుకు ఈగల్ పోలీసులు భారీ కసరత్తులే చేయాల్సి వచ్చింది. కాగా పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్ల నుంచి 1.15 కిలోల గంజాయి, 47 గ్రాముల ఓజి వెడ్‌ను, 28 చిన్నపాటి పాలి థిన్ కవర్లను, చిన్నపాటి తూకం యంత్రాన్ని జప్తు చేశారు. నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ యూనివర్శిటీలో 50 మందికి పైగా విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలుగా మారినట్లు తేలగా ఇందులో కొందరికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా తేలింది. ఈ ఘటనపై ఈగల్ పోలీసులు మహేంద్ర యూనివర్శిటీ అధికారులతో భేటీ అయి విద్యార్థుల విషయంలో జాగ్రత్తగా వుండాలని హెచ్చరిం చారు. ఇంతకు ముం దు ఈగల్ పోలీసుల దాడుల్లో ఉస్మానియా మెడికల్ కాలేజితో పాటు కుందన్‌బాగ్‌లోని కులినరి అకాడమి అనే విద్యా సంస్థ, సిబిఐటి, ఐఐటి బాసర, జోగిపేట్‌లోని జెఎన్‌టియు, మెడిసిటీ మెడికల్ కాలేజి, ఇక్ఫాయ్, ఉస్మానియా యూనివర్శిటీలలో డ్రగ్స్ దందాలు రట్టవడం తెలిసిందే. మహేం ద్ర యూనివర్శిటీలో డ్రగ్స్ దందాను రట్టుచేసిన ఈగల్ పోలీసులను డైరక్టర్ సందీప్ శాండిల్యా అభినందించారు.

## చికితకు సిఎం అభినందనలు

>> స్వర్ణం చేజిక్కించుకొని చికిత వరల్డ్ చాంపియన్‌గా నిలవడం దేశానికే గర్వకారణమని సిఎం తెలిపారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, లక్ష్యాన్ని సాధించాలన్న చికిత తానిపర్తి సంకల్పం యువతీ, యువకులకు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆటుపోట్లను తట్టుకుంటూ గ్రామీణ ప్రాంతం నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆర్చరీలో రాణించిన చికిత తానిపర్తి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సిఎం ఆకాంక్షించారు. చిన్ననాటి నుంచి చికిత తానిపర్తిలోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు సిఎం అభినందనలు తెలియజేశారు.

## వారం - వర్జ్యం

27-08-2025, బుధవారం (వినాయక చవితి)
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చవితి మ.3.47
హస్త ఉ.6.04
వర్జ్యం : మ.2.57-4.44
దు.ఉ.11.45-12.35
శుభసమయం: ఉ.9.15-10.00,సా.4.45-5.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలుఎదురైనా అధిగమిస్తారు. శుభవార్తలు.

**వృషభం:** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండండి.

**మిథునం:**కుటుంబసభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. ఇంటాబయటా ప్రోత్సాహం.

**కర్కాటకం :**అనుకోని అతిథులనుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**సింహం:** ఒకరికి అప్పు ఇవ్వడం, మీరు మీరొకరి వద్ద అప్పుచేయడం రెండూ వద్దు.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**తుల :**వస్తు భద్రత పట్ల విశేషమైన జాగ్రత్తలు తీసుకోవడం చెప్పదగిన సూచన.

**వృశ్చికం:** ఇంటర్వ్యూలలో అతి కష్టంమీద ఉత్తీర్ణులవుతారు. వస్తువులు కొనుగోలు.

**ధనుస్సు:** నాణ్యత లేని వస్తువులు మీకు అంటగట్టే ప్రయత్నాలు జరుగుతాయి. జాగ్రత్త అవసరం.

**మకరం:** అనేకాంశాలలో అనుభవం మిమ్ములను ముందుకు నడుపుతుంది.

**కుంభం:** సంతాన పురోభివృద్ధి ఆనందం కలిగిస్తుంది. ఒకరికి మీరు సహాయంచేస్తారు.

**మీనం :** కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ప్రయాణాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

28-08-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
పంచమి సా.5.58
చిత్త ఉ.8.44
వర్జ్యం : మ.3.00-4.48
దు.ఉ.10.05-10.55, 2) మ.3.05-3.55
శుభసమయం : ఉ.8.15-9.00,
సా.4.15-4.55
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** దూరపుబంధువుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**వృషభం:** ఆర్థికపరిస్థితి సంతృప్తి కరంగా ఉంటుంది. మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి.

**మిథునం:**జీవితభాగస్వామి సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కర్కాటకం :** స్థలాలు, భూములు కొనుగోలు వ్యవహారాలు పురోభివృద్ధిలో ఉంటాయి.

**సింహం:**అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్త్రాలు కొనుగోలు.

**కన్య :** కార్యాలయంలో పై అధికారులకు వివరణ ఇచ్చుకోవలసి వస్తుంది.

**తుల :** మీ వైరివర్గం మిమ్ములను బాధించకపోవడం ఊరట కలిగిస్తుంది.

**వృశ్చికం:** పుకారులకు ప్రాధాన్యత నివ్వడం వలన నిజానిజాలు తెలుసు కోవడంలో వైఫల్యంచెందుతారు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు వాయిదా వేసుకొని సులువుగా జరిగే కార్యక్రమాలను మాత్రమే చేయండి.

**మకరం:** కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రలు చేస్తారు. మిత్రుల కలయిక.

**కుంభం:**వృత్తి ఉద్యోగాలపరంగా అదనపు బాధ్యతలు నిర్వహించవలసి వస్తుంది.

**మీనం :** నమ్మి ఎవరికి పనిని అప్పగించవద్దు. మీ పనిని మీరే చేసుకోండి. వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు
# కీలక వ్యాఖ్యలు
### బిల్లులను ఆపే అధికారం ఆయనకుంటే.. మనీ బిల్లులను సైతం ఆపేస్తారు!



**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులను ఆపే అధికారం గవర్నర్‌కు ఉంటే.. మనీ బిల్లులను ఆపే అధికారం కూడా గవర్నర్‌కు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ అంశం కొంత సమస్యాత్మకమేనని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. బిల్లులకు గవర్నర్లు ఆమోదం ఇవ్వకుండా వీటో చేస్తే.. వారు మనీ బిల్లులను కూడా అడ్డుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. సుప్రీం ధర్మాసనం అభిప్రాయంతో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే ఏకీభవించారు. బిల్లుల ఆమోదం అంశంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. బిల్లులను 3 నెలల గడువులోగా గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదించాలంటూ గతంలో జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై దుమారం రేగింది. దీంతో రాష్ట్రపతి దౌపది ముర్ము 12 సందేహాలను లేవనెత్తారు. రాజ్యాంగంలో లేని అధికారాలపై సుప్రీంకోర్టు తీర్పులు ఎలా ఇవ్వగలదని అపెక్స్ కోర్టుకు 12 ప్రశ్నలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీజెఐ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, పీఎస్ నరసింహ, ఏఎస్ చందూర్‌కర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం నాడు విచారణ జరుపుతోంది.

## లిక్కర్ కుంభకోణం: 12 మంది నిందితులకు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, ఆగస్టు 26.ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో 12 మంది నిందితులకు సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. ఈ మేరకు ఏసీబీ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రిమాండ్ పొడిగించిన నేపథ్యంలో 12 మంది నిందితులను వివిధ జైళ్లకు పోలీసులు తరలిస్తున్నారు. ఈ కేసులో వైసీపీ ఎంపీ పి. మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు. మిగిలిన 9 మంది నిందితులను విజయవాడ జైలుకు పంపించారుజమరో ఇద్దరు నిందితులను గుంటూరు జైలుకు పోలీసులు తరలించారు. ఇక ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు రాజ్ కసిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనపై నమోదైన కేసును ఆయన ఖండించారు. కస్టోడియల్ విచారణ అని సిట్ తనను అరెస్ట్ చేసిందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో తన పాత్ర ఎక్కడా లేదని పేర్కొన్నారు. తన తప్పు ఎక్కడా లేక పోయినా.. ఆధారాలు సృష్టించారని రాజ్ కసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కానీ.. ప్రస్తుతం కానీ ఇప్పటి వరకు తనపై ఒక్క కేసు కూడా లేదని గుర్తు చేశారు. ఈ ఒక్క లిక్కర్ కేసులో తప్పించి.. ఇప్పటి వరకు తాను అరెస్ట్ కాలేదన్నారు. అయితే హైదరాబాద్, శంషాబాద్‌లోని విల్లాలో లభ్యమైన రూ. కోట్లు తనవైతే.. వాటిపై తన వేలి ముద్రలు ఉంటాయని వివరించారు. అయినా అంత సొమ్ము ఒకే వ్యక్తి వద్ద ఉంటుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఈ మద్యం కుంభకోణంలో సిట్ విచారించిన 300 మందిలో ఏ ఒక్కరూ తనకు తెలియదన్నారు.



హిమాచల్ ప్రదేశ్‌లోని కులులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తోన్న బియాస్ నది

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైన మారం పవిత్రకు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైన.. సూర్యాపేట జిల్లా,పెన్ పహాడ్ ఉన్నత పాఠశాలకు చెందిన మారం పవిత్రకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. సాంకేతికత, వినూత్న పద్ధతులతో..బోధనలో తనదైన శైలిని రూపొందించుకుని.. ఆమె ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.

# అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

>> కోర్టుకు స్పష్టం చేశారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఒకవేళ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించింది. పూర్తి వివరాలతో మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఐదు వారాలకు వాయిదా వేసింది. కాగా, సమావేశాల నిర్వహణ కోసం అసెంబ్లీ సిబ్బందికి ఇప్పటికే సంబంధిత ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ సమావేశాల్లోనే పీసీ ఘోష్ నివేదికపై చర్చ జరగనుంది.రాష్ట్ర కేబినెట్ ఇటీవలే ఈ రిపోర్టును ఆమోదించి మీడియాకు సంక్షిప్తంగా నివేదికలోని అంశాలను వెల్లడించింది.కాగా.. పూర్తి స్థాయిలో రూపొందించబడిన రిపోర్టు మొత్తం 600 పేజీలకు పైగా ఉంది. అసెంబ్లీ సభ్యులకు ఈ రిపోర్టును అందజేసి అన్ని పార్టీల అభిప్రాయాలను సవివరంగా తెలుసుకొని, తర్వాత పూర్తి స్థాయిలో చర్చలు నిర్వహించడం లక్ష్యంగా ఉంది.చర్చల అనంతరం కాళేశ్వరం కమిషన్ రిపోర్టు సంబంధించి తుది నిర్ణయాలు తీసుకో వడం, తద్వారా తదుపరి చర్యలకు అడుగులు ఎలా ముందుకు వేయాలో ప్రభుత్వం నిర్ణయించుకోనుంది. ఇదిలా ఉండగా, సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన 30న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ భేటీలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు,సిఎస్ రామకృష్ణారావు పాల్గొనను న్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కేబినెట్‌లో చర్చించాల్సిన పలు అంశాలపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు,ప్రభుత్వ కార్యదర్శులు అజెండా అంశాలను జిఏడికి పంపాలని సిఎస్ మంగళవారం సర్క్యూలర్ జారీ చేశారు. కేబినెట్‌లో ప్రధాన అజెండాగా పీసీ ఘోష్ నివేదికను చర్చించనున్నారు. అనంతరం ఆ రిపోర్టును అసెంబ్లీ సమావేశాల తొలిరోజే సభలో ప్రవేశపెట్టబోతున్నట్లు సమాచారం. కాగా ఈ కేబినెట్ సమావేశం లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కూడా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**అసెంబ్లీలో యూరియా కొరతపై చర్చ:** రాష్ట్రంలో రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికార, ప్రతిపక్ష నాయకులు వాదోపవాదనలో చేసుకుంటున్నారు. యూరియా కోసం రైతులు పడే కష్టాల గురించి అసెంబ్లీలో చర్చించే అవకాశం ఉంది. ఇటీవల కురిసిన జోరు వర్షాలకు సాగుపనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అంతకుముందే నాటేసుకున్న రైతులు ఎరువు కోసం దుకాణాల వద్ద ఎదురుచూస్తున్నారు. అరకొరగా వస్తున్న యూరియా పూర్తిస్థాయిలో అందడం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**వర్షాలపై చర్చ:** రాష్ట్రంలో కురిసిన,కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు సైతం నష్టాల పాలయ్యారు. వర్షాకాలంలో ప్రభుత్వం చేపట్టాల్సిన సహాయక చర్యలపై చర్చించే అవకాశం ఉంది.

**మాగంటి గోపీనాథ్‌కు సంతాపం:** జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జూన్ 8 మృతి చెందారు. ఈ మేరకు అసెంబ్లీలో ఆయనకు సంతాపం ప్రకటించనున్నారు.

## కౌలు రైతులకూ రుణాలు
### బ్యాంకులకు ఆర్‌బిఐ మార్గదర్శకాలు

**హైదరాబాద్, అగస్టు 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కౌలు రైతులకు రుణాలు మంజూరు కానున్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అధిక జీఎస్‌డీపీ ఉన్న జిల్లాలకు ప్రాధాన్య రంగాల రుణాల (పీఎస్ఎల్) పంపిణీలో అధిక ప్రాధాన్యమివ్వాలని రిజర్వు బ్యాంకు పేర్కొంది. ఈ రుణాలు మంజూరుకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు చెందిన 196 జిల్లాలు ఈ జాబితాలో చోటు దక్కించుకోగా, అందులో తమిళనాడులో నుంచి అత్యధికంగా 34, హరియాణాలో 17, ఆంధ్రప్రదేశ్‌లో 15 జిల్లాలు, పంజాబ్‌లలో 15, తెలంగాణలో 7 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో జనగామ, హన్మకొండ, సూర్యాపేట, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్‌లకు పాధాన్యమివ్వాలని పేర్కొంది. పీఎస్ఎల్ అతి తక్కువగా ఉన్న 196 జిల్లాలను ప్రకటించగా వీటిలో తెలంగాణ నుంచి ఆదిలాబాద్, ఏపీలోని అల్లూరి సీతారామరాజు ఉన్నాయి. ఇక పీఎస్ఎల్ మంజూరుకు అనుసరించాల్సిన నిబంధనలపై అన్ని బ్యాంకులకు రిజర్వు బ్యాంకు తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. సన్న, చిన్నకారు రైతులకు పంట రుణాలను పీఎస్ఎల్ కింద ఇవ్వాల్సి ఉంటుంది. వ్యవసాయ కార్మికులకు, రాతపూర్వక ఒప్పందం లేకుండా నోటిమాటగా భూమి యజమాని నుంచి పొలం కౌలుకు తీసుకుని సాగుచేసే రైతులకూ, పంటను పంచుకునే ఒప్పందంతో సాగు చేసే వారికి కూడా సన్న, చిన్నకారు రైతులకు ఇచ్చినట్లే క్రాప్ లోన్ ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే వ్యవసాయం, అనుబంధ రంగాల్లో స్టార్టప్ కంపెనీ పెడితే రూ.50 కోట్లు, వ్యవసాయ శుద్ధి పరిశ్రమకు రూ.100 కోట్ల వరకు రుణం ఇవ్వాలని పేర్కొంది. వ్యవసాయ బోర్లకు, పొలంలో సోలార్ విద్యుత్ పెట్టుకుంటే పీఎస్ఎల్‌లో రుణం ఇవ్వాలి. ఎలాంటి భూమి లేని వ్యక్తి అయినా వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనులు చేస్తుంటే అటువంటి వారికి రూ.2.50 లక్షల రుణం కల్పించాలని వెల్లడించింది. వీరితో పాటు, 13 రకాలకు చెందిన వారిని బలహీనవర్గాలుగా గుర్తించి వారికి పీఎస్ఎల్ లోన్స్ ఇవ్వాలని స్పష్టం చేసింది. సన్న, చిన్నకారు రైతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వృత్తి కార్మికులు, ఎస్సీలు, ఎస్టీలు, స్వయం సహాయక సంఘాలు, వడ్డీ వ్యాపారులిచ్చిన అప్పుల వలలో చిక్కుకున్నవారు, ట్రాన్స్‌జెండర్లు, మైనారిటీలు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పు తీసుకుంటే అతడిని ఆదుకునేందుకు రూ.లక్ష రుణం కల్పించాలని నిర్దేశించింది. అలాగే ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన బ్యాంకు ఖాతా ఉన్నవారికి ఓవర్‌డ్రాఫ్ట్ పేరుతో లోన్ సదుపాయం కల్పించాల్సి ఉంటుంది. మారుమూల ప్రాంతాలైన గ్రామాలలో సోలార్ విద్యుత్ ప్లాంటు పెట్టేవారికి రూ.35 కోట్ల వరకు, ఇంటిపై సోలార్ విద్యుత్ పెట్టుకుంటే రూ.10 లక్షల వరకు లోన్ ఇవ్వాలని బ్యాంకులకు విడుదల చేసిన మార్గదర్శకాల్లో రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది.

## వాన్‌పిక్‌కు హైకోర్టులో చుక్కెదురు


>> దీనిని సిబిఐ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఈ కేసులో తమ వాదనలను పరిగణలోకి తీసుకోకుండా వాన్‌పిక్ ప్రాజెక్టు పిటిషన్‌ను అనుమతించ రాదని సిబిఐ కోరింది. సిబిఐ వాదనలను పరిగణలోకి తీసుకున్న సుప్రీం కోర్టు వాన్‌పిక్ పిటిషన్‌ను మరోసారి విచారించాలని హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో వాన్‌పిక్ ప్రాజెక్టుపై మంగళవారం మరో సారి వాదనలు విన్న హైకోర్టు ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## భూ సమస్యలు తెలంగాణలోనే..

>> జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మాత్రమే ప్రభుత్వ భూముల సమస్య ఉందని జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. అధికారులు చెబుతున్న వివరాలకు,వాస్తవాలకు పొంతనలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. నిషేధిత భూములకు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పట్టాలు ఇచ్చారంటూ ఆరోపించారు. రెండేళ్ల వయసున్న వాళ్ల పేరు మీద పట్టా భూమి ఉన్నట్లు వివరాలున్నాయని చెప్పారు. ఈ క్రమంలో పట్టాలు మంజూరు చేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోర్టును కోరారు. పరిస్థితిని పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి ఈ కేసులో ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేశారు.

# క్రమబద్ధీకరణ

>> స్వీకరించారని కానీ 2020 ఆర్ఓఆర్ చట్టంలో ఈ దరఖాస్తుల పరిష్కారానికి మార్గం చూపించలేదని విమర్శించారు. ఫలితంగా 9.26 లక్షల దరఖాస్తులు పరిష్కారం కాకుండా పోయాయని దీనిపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు.సాదా బైనామాల దరఖాస్తులను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలన్న ఆలోచనతో తమ ప్రభుత్వం నిరంతరం హైకోర్టులో కేసుకు ముగింపు లభించేలా కృషి చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆలోచన మేరకు ఈ సమస్యకు పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం భూభారతి చట్టంలో స్పష్టమైన నిబంధనలను పొందుపరిచిందని తెలిపారు. సాదా బైనామాల దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంగళవారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన గ్రౌండ్ వర్క్ పూర్తి చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం అక్రమంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బంగాళాఖాతంలో కలిపేశామని, దేశంలోని 18 రాష్ట్రాలలో అధ్యయనం చేసి భూభారతి 2025 చట్టాన్ని రూపొందించామన్నారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతన్నల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలపారు. ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపించే తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు.



లక్నోలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డి, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్.



గుజరాత్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం గ్రీన్ మొబిలిటీ ఇనిషియేటివ్‌ల ప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధాని మోదీ. గుజరాత్ సిఎం భూపేంద్ర పటేల్ తదితరులు

## వినాయకుడి ఆశీస్సులతో మనందరి జీవితాల్లో వెలుగులు రావాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** వినాయకచవితి పండగ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శుభాకాంక్షలుతెలిపారు. అన్ని రకాల విఘ్నాలను తొలగించి సరైన మార్గంలో మనల్ని నడిపించే విఘ్నేశ్వరుడు, ఓర్పునకు, విద్యకు, శ్రద్ధాసక్తులకు.. ప్రకృతికి, పర్యావరణ పరిరక్షణకు, విజయానికి ప్రతీక. భక్తి శ్రద్ధలతో పూజించి.. వినాయకుడి ఆశీస్సులతో మనందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు రావాలని, ఆటంకాలన్నీ తొలగిపోయి అందరూ.. ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని అన్నారు.

## రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వినాయక చవితి పర్వదినాన ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. వినాయక ఉత్సవాలు జరిగే తొమ్మిది రోజుల పాటు మండపాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షి ంచారు. వినాయక మండపాల వద్ద విద్యుత్ విషయంలో ప్రమాదాలు జరగకుండా భక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నగరం లో వినాయక ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న సంక్షేమం, అభి వృద్ధి మరింత ముందుకుసాగాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

### సాహితి ఇన్‌ఫ్రా గోల్‌మాల్ కేసు..

## మాజీ డైరెక్టర్ పూర్ణచందర్‌రావు అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** ప్రీలాంచ్ పేరుతో అమాయకులను నిండా ముంచి 800 కోట్ల రూపాయలను దండుకుని బోర్డు తిప్పేసిన సాహితి ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ కంపెనీ గోల్‌మాల్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) మరొక నిందితుడిని మంగళవా రం అరెస్టు చేసింది. ఈ కంపెనీలో డైరెక్టర్‌గా గతంలో పనిచేసిన పూర్ణచందర్ రావును అరెస్టు చేసిన ఈడీ అధికారులు నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన న్యాయ మూర్తి నిందితుడికి 14 రోజుల రిమాండు విధించారు. అనంతరం అతన్ని చంచల్ గూడ జైలుకు తరలించారు. కాగా ఈ కేసును సిసిఎస్ పోలీసులు విచా రిస్తుండడం తెలిసిందే. ఈ కంపెనీ ఎండి బూదాటి సత్యనారాయణ సహా ఇతర నిందితులను ఇంతకు ముందే సిసిఎస్ పోలీసులు అరెస్టుట చేయగా ఈడీ కూడా కొందరిని అరెస్టు చేసింది. ఈ కంపెనీ ఆస్తులను సిసిఎస్ పోలీసులు జప్తు చేయగా మనీలాండరింగ్ కోణంలో ఇడి విచారిస్తోంది.

## ఎపిలో తెలంగాణ ఎమ్మెల్యే కారు స్టిక్కర్ కలకలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 26:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న వాహనం హల్‌చల్ చేసింది. ఏపీ రిజిస్ట్రేషన్‌తో ఉన్న స్కార్పియో వాహనంపై తెలంగాణ ఎమ్మెల్యే, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్టిక్కర్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఏపీ 40 బివై 4567 అనే ఫ్యాన్సీ నెంబర్‌తో తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. కారులో హాకీ స్టిక్స్ కూడా గుర్తించినట్లు చెన్నేకొత్తపల్లి పోలీసులు వెల్లడించారు. వినాయక చవితి సందర్భంగా పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ కమిటీ మీటింగ్‌కు గడ్డం ప్రసాద్ కుమార్ స్టిక్కర్ ఉన్న స్కార్పియో వాహనంలో ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కారుకు బ్లాక్ ఫిల్మ్‌తోపాటు ఎమ్మెల్యే స్టిక్కర్ ఉండటంతో అనుమానం వచ్చి తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. కారు కూడా తెలంగాణకు చెందినదిగా నిందితులు చెప్తున్నట్లు తెలిపారు. కానీ కారు రిజిస్ట్రేషన్ నెంబర్ మాత్రం ఏపీకి చెందినదిగా గుర్తించినట్లు వెల్లడించారు. కారును సేవాలాల్ నాయక్ అనే వ్యక్తి వాడుతున్నట్టు చెప్పుకొచ్చారు. కార్‌లోని హాకీ స్టిక్స్‌తో బెదిరింపులకు పాల్పడుతున్నట్టు పోలీసులు స్పష్టం చేశారు. కారు సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఏపీలో తెలంగాణ ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న కారు తిరగడంతో.. ఈ కేసుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే వారికి ఆ స్టిక్కర్ ఎక్కడ నుంచి వచ్చింది, ఎన్ని రోజులుగా ఆ స్టిక్కర్‌తో కారుని నడుపుతున్నారు.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## బీహార్ రాజకీయాల్లో రేవంత్‌రెడ్డి జోక్యం ఏమిటి? : ప్రశాంత్ కిశోర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 26:** రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ రాజకీయాల్లో రేవంత్ జోక్యం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. "అసలు రేవంత్ రెడ్డి ఎవరు? బీహార్‌లో ఆయనకు ఏం పని?" అని ప్రశ్నించారు. బీహార్‌తో రేవంత్ రెడ్డికి ఉన్న సంబంధం ఏమిటని, ఆయన స్థాయి ఏమిటని ప్రశాంత్ కిశోర్ ప్రశ్నించారు. ఒకవైపు బీహార్ ప్రజలను అవమానించేలా మాట్లాడి, మరోవైపు అదే బీహార్‌కు ఓట్లు అడగడానికి ఎలా వస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వైఖరిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీహార్‌ను అవమానించే నాయకులను కాంగ్రెస్ కలిగి ఉందని, ఇది రాహుల్ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## పార్టీ సమావేశంలా ఉన్న ఉస్మానియా వర్సిటీ సదస్సు

### బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

**హైదరాబాద్, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ పర్యటించడం పూర్తిగా ఒక పొలిటికల్ డ్రామా అని, అక్కడ సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు చేసే స్పీచ్ ఇస్తూ, ఒక రాజకీయ డ్రామాగా మార్చారని ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సిఎం సమావేశం విద్యార్థులకు, యువకులకు, ఉస్మానియా యూనివర్సిటీకి ఏమి ఒరగలేదన్నారు. ఆరు గ్యారెంటీలు అన్న విషయానికి అదనంగా ఏడో గ్యారెంటీ - ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా నిరసన చేసే హక్కు" అని రేవంత్ రెడ్డి అన్నారు. కానీ వాస్తవం ఏమిటంటే యూనివర్సిటీలో మీటింగ్ పెట్టిన రోజు విద్యార్థులను హాస్టల్‌లలోనే నిర్బంధించారు. వేలాది మంది పోలీసులను మోహరించారు. బయటికి వస్తే కేసులు పెట్టి, అరెస్టులు చేశారు. అలాంటి వాతావరణంలో నిరసన హక్కు గురించి మాట్లాడటం మాయమాటలే. 20 సంవత్సరాల తర్వాత ఒక ముఖ్యమంత్రి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చినా, ఎలాంటి నిధులు కేటాయించలేదు.

విద్యార్థులు ఆశించిన వరాలు రాలేదు. అక్కడ పాల్గొన్నవారు నిజమైన విద్యార్థులు కాదు - కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, కొంతమంది పూర్వ విద్యార్థులు మాత్రమే అన్నారు. ఆ మీటింగ్ పూర్తిగా కాంగ్రెస్ మీటింగ్‌లా జరిగిందన్నారు. 2008లో రేవంత్ రెడ్డి టిడిపి నాయకుడిగా ఉస్మానియాకు వచ్చినప్పుడు అర్బన్ నక్సలైట్లు ఆయనపై దాడి చేశారు. ఆ సమయంలో మాలాంటి విద్యార్థులే మిమ్మల్ని రక్షి ంచి సురక్షి తంగా బయటకు పంపామన్నారు. 2016లో నిరుద్యోగ గర్జన సమయంలో కూడా విద్యార్థులే మీకు అండగా నిలబడ్డారు. కానీ చివరికి విద్యార్థులకు బహుమతిగా కేసులు మాత్రమే వచ్చాయి. ఆ కేసుల చార్జ్ షీట్‌లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంలో ఉస్మానియాతో సంబంధం లేని వ్యక్తులను - ప్రొఫెసర్ హర గోపాల్, డాక్టర్ కాశిం వంటి వారిని - పొగడ్తల్లో

# 4,454 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

### గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా 880 మందికి ప్రమోషన్లు

### పిఎస్‌హెచ్‌ఎంలుగా 811 మందికి.. ఎస్‌ఎలుగా 2,763 మందికి కూడా..

### పాఠశాల విద్యశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. 4,454 మంది ఉపాధ్యాయులకి పదోన్నతులు లభించాయి. వాతిరలో 880 మంది గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్మాష్టర్లుగా పదోన్నతులు పొందగా.. 811 మంది పిఎస్‌హెచ్‌ఎంలుగా, 2,763 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. పదోన్నతులు పొందిన వారు సర్వీస్ నిబంధనల ప్రకారం 15 రోజుల్లోగా పదోన్నతి పొందిన పాఠశాలలో చేరాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల పదోన్నతులపై ఉన్న స్టేను హైకోర్టు ఈ నెల 20 ఎత్తివేయడంతో పదోన్నతుల ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది. సీనియారిటీ విషయమై కొందరు టీచర్లు న్యాయస్థానంలో కేసు దాఖలు చేయడంతో హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. ఈ నెల 20(బుధవారం) స్టే ఎత్తివేయడంతో పాఠశాల విద్యాశాఖ అధికారులు పదోన్నతుల కోసం రీషెడ్యూల్‌ను జారీ చేశారు. దీంతో ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ)గా పనిచేస్తున్న 880 మందికి గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్మాష్టర్లుగా పదోన్నతులు పొందారు.

మల్టీ జోన్-1లో 490 మందికి, మల్టీ జోన్-2లో 390 మందికి... మొత్తం 880 మందికి జీహెచ్‌ఎంలుగా పదోన్న తులు లభించాయి. 2,763 మంది ఎస్‌టీజీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, మరో 811 మంది ఎస్‌జీటీలకు ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయ (పీఎస హెచ్‌ఎం)లుగా పదోన్నతి పొం దారు. మొత్తంగా 4454 మంది ఉపాధ్యా యులు పదోన్నతులు పొందారు. ఉపాధ్యాయ ప్రమోషన్ల నిర్వహణ కోసం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం పదోన్నతి పొందిన అభ్యర్థులు 1996 రాష్ట్ర, సబార్డినేట్ సర్వీసెస్ రూల్స్‌లోని నియమం (11) (బి) ప్రకారం, పదోన్నతి ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుండి (15) రోజులలోపు వారి కొత్తగా పదోన్నతి పొందిన పోస్టులలో చేరాలని పాఠశాల విద్యా డైరక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతి కౌన్సెలింగ్ కాలానుగుణంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఖాళీలు, అర్హత కలిగిన అభ్యర్థులుంటే పదోన్నతులు, బదలీలు చేపట్టనున్నట్టు తెలిపారు.

# త్వరలో రూ.33 కోట్ల చేనేత రుణాల మాఫీ

### దేశానికి ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దుతాం..

### మహిళల ఉచిత ప్రయాణాలకు రూ. 6,680 కోట్లు చెల్లించాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### సిరిసిల్లలో నేతన్న పొదుపు, నేతన్న బీమా పథకాల పంపిణీకి హాజరైన మంత్రి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 26, ప్రభాతవార్త:** దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించిన నేతన్న పొదుపు, నేతన్న బీమా పథకాల పంపిణీ కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ మహేష్ బిగితేలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్ల కాలంలో ఉన్న బకాయిలను ప్రజా ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. నేత కార్మికుల కోరిక మేరకు లక్ష రూపాయల రుణ మాఫీ వర్తింప చేస్తున్నామని, 33 కోట్ల చేనేత రుణాలను రాబోయే కేబినెట్ సమావేశంలో మాఫీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2500 మెట్రిక్ టన్నుల నూలు 100 సొసైటీలకు సరఫరా చేయడం జరిగిందని వెల్లడించారు.

మహిళలకు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఉచిత ప్రయాణానికి 6,680 కోట్ల రూపా యలు చెల్లించిందని, మహిళలకు 200 కోట్ల జిరో టికెట్లు జారీ చేశామని, మనల్ని చూసి పక్క రాష్ట్రాలు కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయని అన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని, పేద ప్రజలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. దేశానికే తెలంగాణ మోడల్‌గా నిలిచిందన్నారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, మహిళలకు 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామన్నారు. వస్త్ర పరిశ్రమలు ఆధునిక సాంకేతికతను పెంచేందుకు హ్యాండ్లూమ్ యూనివర్సిటీ (ఐ.ఐ.ఐహెచ్.టి) ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు.




మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ చేనేత పవర్ రూం కార్మికులను ఆదుకోవాలని ఉద్దేశంతో సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారని అన్నారు. ప్రభుత్వం ఆర్థిక స్థితిగతులను బాగు చేస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ధార్మిక కార్మిక క్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. నేత కార్మికుల కష్టాలు తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని అన్నారు. వస్త్ర పరిశ్రమలో 352 కోట్ల రూపాయల బకాయిలను రేవంత్ సర్కార్ చెల్లించిందని అన్నారు. చేనేత కార్మికులకు పని కల్పించాలనే లక్ష్యంతో 270 కోట్ల రూపాయల విలువ గల బట్ట ఉత్పత్తి ఆర్డర్లను ప్రభుత్వం అందించిందని వెల్లడించారు.

# నడి వయసులో వివాహేతర సంబంధం

### అడ్డువచ్చిన భర్తను ప్రియుడితో కలిసి హతం

### నిర్మల్‌లో దారుణం.. నిందితులను కటకటాల్లో నెట్టిన పోలీసులు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** వివాహేతర సంబంధాల కారణంగా భర్తలను చంపుతున్న భార్యల ఉదంతాలు ఆగడం లేదు. ఈ క్రమంలోనే నిర్మల్ జిల్లాలో నడివయస్సులో వున్న ఓ మహిళ ప్రియుడి మోజులో పడి 50 ఏళ్ల భర్తను దారుణంగా హత్య చేసింది. అనంతరం భర్త మూర్ఛ వా ్యధితో చనిపోయినట్లు కుటుంబ సభ్యులను నమ్మించేందుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయి చివరకు ప్రియుడితో పాటు కటకటాల పాలయ్యింది. వివరాలు ఇలావున్నాయి. నిర్మల్ జిల్లా సోన్ మండలం వెల్మల్ గ్రామానికి చెందిన హరిచరణ్ (50) నాగలక్ష్మీ (45) దంపతులు. వీరికి కుమారుడు కృష్ణ (27)తో పాటు మరో ఇద్దరు పిల్లలున్నారు. అయితే నాగలక్ష్మీ ఇదే గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తితో కొంతకాలంగా అక్రమ సంబంధం కొనసాగిస్తున్న విషయాన్ని గమనించిన భర్త హరిచరణ్ భార్యను తీవ్రంగా మందలించాడు.

దీంతో ఒక పథకం ప్రకారం భర్త నిద్రపోతున్న సమయం లో ప్రియుడు మహేష్‌తో కలిసి టవల్‌తో గొంతుకు ఉరివేసి హత్య చేసింది. అనంతరం భర్త శవాన్ని బాత్ రూంలో పడవేసి మూర్ఛ వ్యాధి కారణంగా చనిపోయినట్లు కుటుంబ సభ్యులను నమ్మించింది. అయితే దుబాయ్‌లో వున్న వీరి కుమారుడు కృష్ణ తండ్రి చనిపోయిన విషయం తెలియగానే వెంటనే రాగా అప్పటికే తండ్రి అంత్యక్రియలు ముగియడంతో తల్లిపై అనుమానం చెందాడు. తల్లి ప్రవర్తనపై అనుమానించిన కృష్ణ దీనిపై కుటుం బ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు హరిచరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించగా అతనిది హత్యగా తేలింది. మూర్ఛవ్యాధితో చనిపోయినట్లు భార్య నాగలక్ష్మీ చెప్పడం అబద్ధమని రూఢీ అయ్యింది. దీంతో పోలీసులు తమదైన శైలిలో వి చారించగా నాగలక్ష్మీ తన నేరాన్ని అంగీకరించింది. దీని తరువాత నాగలక్ష్మీని ఆమె ప్రియుడు మహేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ హత్య ఆలస్యంగా వెలుగులోకి రాగా నిందితులను తాజాగా అరెస్టు చేశారు.

# మోడల్ స్కూళ్లలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

### నేరుగా స్కూల్స్‌లోనే అడ్మిషన్లు

### పాఠశాల విద్యా డైరెక్టర్ నవీన్‌నికోలస్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న మోడల్ స్కూల్స్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లను చేపట్టాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్స్, కాలేజీల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి మోడల్ స్కూల్స్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ల కోసం ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్షను నిర్వహించారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ దాదాపు 48 వేలకు పైగా సీట్లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో 48,630 సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇంటర్ సెకండ్ ఇయర్లో అత్యధికంగా 13,256 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 12,668 సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 6వ తరగతిలో సంబంధించి 7,543 సీట్లు, 7వ తరగతిలో 5,192 సీట్లు, 8వ తరగతిలో 3,936 సీట్లు, 9వ తరగతిలో 2,884 సీట్లు, 10వ తరగతిలో 3.151 సీట్లను భర్తీ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు.

# కాంగ్రెస్ ఓటు చోరీ నినాదం ప్రజలను మభ్యపెట్టడానికే

### మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** ప్రస్తుతం ఓటు చోరీ అనే అంశం ప్రచారం జరుగుతుందని, కానీ ఓటు చోరీ అనేది కేవలం ఒక నినాదం మాత్రమే అని మాజీ మంత్రి మర్రిశశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఓటు చోరీ అంటూ ప్రజలను మభ్యపెట్టడానికి, మోసగించడానికి ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. గత సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చార్ సౌ పార్ అంటూ దేశాన్ని ఉత్సాహపరిచే ప్రయత్నం చేశారు. అదే సమయంలో మరోవైపు ఒక కొత్త నెరేటివ్ మొదలైంది. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రిజర్వేషన్లు తీసేస్తారు, రాజ్యాంగాన్ని రక్షి ంచాలి" అంటూ ప్రచారం మొదలుపెట్టారు. ఇప్పుడ బీహార్ ఎన్నికల్లో ఓట్ చోరీ అంటూ మళ్లీ అదే తరహా ప్రయత్నం చేస్తున్నారుని, గత 35 సంవత్సరాల ఎన్నికల లెక్కలు పరిశీలించినా, 2024 లో కాంగ్రెస్ పార్టీ గాని, ఇండీ కూటమి గాని ఇంత పెద్ద సంఖ్యలో ఎప్పుడూ ఓట్లు సాధించలేదు. అయినప్పటికీ ఓటు




చోరీ అంటూ బిజెపిపై ఆరోపణలు చేయడం చాలా తప్పు, దీన్ని తీవ్రంగా ఖండించాలన్నారు. 2018లో తెలంగాణ రాష్ట్ర ఓటర్ లిస్ట్‌లో ఇంచుమించుగా 2 కోట్ల 56 లక్షల మంది ఉన్నారు. ఆ సమయంలో మేము ఎన్నికల సంఘానికి 68 లక్షల వ్యత్యాసాలు ఉన్నాయని నిర్ధారణతో చూపించాము. వాటిలో ముఖ్యంగా 30 లక్షల డూప్లికేట్ ఓట్లు, 12 లక్షలు - తెలంగాణలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన దూప్లికేట్లు, 18 లక్షలు - ఆంధ్రప్రదేశ్‌కు సంబంధమున్న దూప్లికేట్లు, ఒకే ఇంటిలో అనేక మంది ఓటర్లుగా నమోదు, ఇంటి నెంబర్ లేకుండా పేర్లు నమోదు.. ఒకే వ్యక్తి పేరు అనేక రకాలుగా నమోదు కావడం.... ఇలా కలిపి దాదాపు 60 లక్షల వ్యత్యాసాలు/తప్పులు ఉన్నాయని గుర్తించాం. 2025 జనవరిలో విడుదలైన ఓటర్ లిస్ట్ ప్రకారం బీహార్‌లో మొత్తం 7 కోట్ల 89 లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 77,895 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో 65 లక్షల ఓట్లు తగ్గాయని కొంతమంది కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఈ 65 లక్షల తగ్గుదల అనేది కాంగ్రెస్ నాయకులు చెప్పిన అంచనా మాత్రమే అన్నారు. మొత్తం ఓటర్లలో ఇది 1శాతం కన్నా తక్కువ. ఎన్నికల లిస్టు రివిజన్‌లో ఇలాంటి సవరణలు సహజమైనవి. ఆగస్టు 1న విడుదలైన డ్రాఫ్ట్ జాబితాపై సెప్టెంబర్ 1 వరకు క్లెయిమ్స్ ఆబ్జెక్షన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా సగటున ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో దాదాపు 100 ఓట్ల వ్యత్యాసం మాత్రమే ఉండొచ్చు. ఈ గడువు ఒక నెల సరిపో తుంది. కాబట్టి దీన్ని పెద్ద సమస్యగా చూపించడం తగదు. అయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు దీన్ని రాజకీయంగా వాడుకుంటున్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ చేస్తున్న 'ఓటు అధికార్ యాత్ర'

## పార్టీలో ఫుట్‌బాల్‌లా ఆడుకుంటున్నారు!

### బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** పార్టీలో తనను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారంటూ బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి వినూత్నంగా నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి కానుకగా ఫుట్‌బాల్ ఇచ్చి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ వ్యవహారాలపై కొండా విశ్వేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తివారీని కలిస్తే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కలవమని చెబుతున్నారని, ఆయనను కలిస్తే అభయ్ పాటిల్ కలవమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరిని సంప్రదిస్తే మరొకరి పేరు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, జిల్లా అధ్యక్షుల తీరు, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయ లోపంపై ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

## స్వాతి హత్య కేసును సుమోటోగా స్వీకరించిన జాతీయ మహిళా కమిషన్

### మూడురోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని డిజిపికి లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** బోడుప్పల్ పరిధి మేడిపల్లిలో భర్త చేతిలో అతికిరాతకంగా హత్యకు గురైన స్వాతి కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ కేసుకు సంబంధించిన సమగ్ర నివేదికను మూడు రోజుల్లో అందించాలని డిజిపిని ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం డిజిపికి జితేందర్‌కు లేఖ రాసింది. గర్భవతి అయిన భార్యను అతికిరాతకంగా హత్యచేసి, ఆపై శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికి ప్రతాపసింగారం వద్ద గల మూసీనదిలో పడేసిన విషయం తెలిసిందే. డిఆర్‌ఎఫ్ బలగాలు ఎంత గాలించిన శరీరభాగాలు లభ్యం కాకపోవడంతో సోమవారం రాత్రి వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడలో స్వాతి కుటుంబీకులు ఆమె మొండెంకు అంత్యక్రియలను నిర్వహించారు. శరీరభాగాల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని డిఆర్‌ఎఫ్ సిబ్బంది పేర్కొన్నారు.

## రాష్ట్రానికి తక్షణం 8,100 టన్నుల యూరియా

### మరో 3 జిల్లాలకు కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో యూరియా కొరత తీవ్ర సంక్షోభాన్ని సృష్టిస్తోంది. రైతులు పంటలకు కీలకమైన ఈ ఎరువు కోసం గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడుతున్నారు. డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం డోలాయమానంలో పడింది. మరోపక్క సరఫరా తక్కువ కావడంతో ధరలు పెరిగి బ్లాక్ మార్కెట్లకు తరలివెళ్తోందనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. రాష్ట్రంలో యూరియా కొరత మరింత జటిలం కావడంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య ఆరోపణలు చోటు చేసుకుంటుండగా, ఆయా జిల్లాల్లో అన్నదాతలు నిరసనలతో రోడ్డెక్కుతున్నారు.

ఈ నేపథ్యంలోనే తాజాగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. యూరియా కొరత తీవ్రంగా ఉన్న నాలుగు జిల్లాలకు తక్షణం సరఫరా చేసేలా కేటాయింపులు చేసింది. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ తో పాటు మరో 2 రాష్ట్రాలకు గాను మొత్తం 30,491 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రాష్ట్రాల జాబితాలో బీహార్‌కు 2,700, ఆంధ్రప్రదేశ్‌కు 10,800, తెలంగాణకు 8,100, ఒడిశాకు 8,891 టన్నుల యూరియాను యుద్ధప్రాతిపదికన వెళ్లనుంది. ఈ పరిణామంతో యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కాస్త ఉపశమనం లభించనుంది.

తెలంగాణ ప్రభుత్వం
**శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం యాదగిరి గుట్ట**

ఆర్.సి నం. B5/1907/2025 తేదీ: 26.08.2025

**బహిరంగ ప్రకటన**

శ్రీ ఎం.వెంకటేశ్వర్లు S/o శ్రీ ఎం.రామస్వామి గారు తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి భువనగిరి జిల్లాలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం యాదగిరిగుట్ట (V) & (M) పేరున ఇ.నం. 2-2-1167/11/A/3, తిలక్‌నగర్, అంబర్‌పేట, హైదరాబాద్‌లో ఉన్నఆస్తిని విరాళం ఇవ్వాలనుకుంటున్నారని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. పైన పేర్కొన్న ఉద్దేశించిన విరాళ లావాదేవీకి సంబంధించి ఎవరికైనా అభ్యంతరం, దావా, ఆసక్తి, వివాదం ఉంటే, అతను/ఆమె/వారు ఈ ప్రచురణ తేదీ నుండి ఏడు (7) రోజులలోపు వారి అభ్యంతరాలు/వాదనలు/వివాదాల వివరాలను రుజువు చేసే డాక్యుమెంటరీ రుజువుతో క్రింద సంతకం చేసిన వ్యక్తిని సంప్రదించవచ్చు. అలా చేయకపోతే, షెడ్యూల్ ఆస్తికి సంబంధించి మూడవ పక్షం వాదనలు/అభ్యంతరాలు/వివాదాలు లేనట్లుగా పైన పేర్కొన్న యజమానితో విరాళ లావాదేవీని పూర్తి చేయడానికి మేము ముందుకు వెళ్తాము మరియు ఆ తర్వాత ఎటువంటి వాదనలు/అభ్యంతరాలు/వివాదాలు స్వీకరించబడవు.

**ఆస్తి షెడ్యూల్**

ఇ.నెం: 2-2-1167/11/A/3 నెంబరు గల ఇల్లు 152 చదరపు గజాలు లేదా 110.9 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది, G.H.M.C. పరిధిలోని తిలక్‌నగర్ అంబర్‌పేట్ హైదరాబాద్‌లో ఉంది, అంబర్‌పేట్ మండలం హైదరాబాద్ జిల్లా. మరియు దీని సరిహద్దులు: **ఉత్తరం** :: 30' అడుగుల వెడల్పు గల రోడ్డు. **దక్షిణం** :: పొరుగువారి ఇల్లు. **తూర్పు** :: 30' అడుగుల వెడల్పు గల రోడ్డు. **పడమర** :: పొరుగువారి ఇల్లు.

సం/- S. వెంకట రావు, కార్యనిర్వాహక అధికారి,
సంప్రదింపు నంబర్: 9491000642, 8333994007,8333994021
DIPR.No.7171-PP/CL/Advt/1/2025-26, తేది: 26.08.2025

पावरग्रिड POWERGRID

**ప్రకటన**

1. దక్షిణ ప్రాంతంలోని "పరివర్తన సామర్థ్యం పెంపుదల" కింద 2019-24 సంవత్సరానికి ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌ను రద్దు చేయడానికి మరియు 2024-29 సంవత్సరానికి ట్రాన్స్‌మిషన్ టారిఫ్‌ను నిర్ణయించడానికి పిటీషన్-1: 03నం.ల ఆస్తులు విద్యుత్ చట్టం, 2003 యొక్క సెక్షన్ 62తో పాటు సెక్షన్ 79(1) (డి) మరియు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (వ్యాపార నిర్వహణ) నిబంధనలు, 2023 యొక్క రెగ్యులేషన్ 15(1) (ఎ) మరియు రెగ్యులేషన్ 23 కింద సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టారిఫ్ నిబంధనలు మరియు షరతులు) నిబంధనలు, 2019 మరియు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టారిఫ్ నిబంధనలు మరియు షరతులు) నిబంధనలు, 2024తో పాటు చదవబడతాయి.
2. పైన పేర్కొనబడిన ప్రసార విధానం వలన వీరు లబ్ధిదారులు : (a) TNPDCL (b) TSNPDCL (c) KSEB (d) TSSPDCL (e) గోవా యొక్క విద్యుచ్ఛక్తి విభాగం (f) పుదుచ్చేరి యొక్క విద్యుచ్ఛక్తి విభాగం (g) APEDCL (h) APSPDCL (i) CESC (j) MESCOM (k) BESCOM (l) GESCOM (m) HESCOM (n) APCPDCL & (o) CTUIL.
3. టారిఫ్ వివరాలు

a) 2019-24 బ్లాక్ — రూ. లక్షల్లో

| పిటీషన్ నెం. | ఆస్తి వివరణ | DOCO/ ECOD | 31.03.2024 నాటికి పూర్తి చేసేందుకు వ్యయం | 2019-20 | 2020-21 | 2021-22 | 2022-23 | 2023-24 |
|---|---|---|---|---|---|---|---|---|
| పిటీషన్-1 | ఆస్తి - 1 | 15.12.2023 | ట్రాయింగ్ ఆఫ్ ఆధారపడిన నిర్ణయించబడిన AFC | - | - | - | - | 47.74 |
| | ఆస్తి - 2 | 24.03.2024 | ట్రాయింగ్ ఆఫ్ ఆధారపడిన నిర్ణయించబడిన AFC | - | - | - | - | 47.79 |
| | ఆస్తి - 3 | 11.01.2024 | ట్రాయింగ్ ఆఫ్ ఆధారపడిన నిర్ణయించబడిన AFC | - | - | - | - | 592.72 |

b) 2024-29 బ్లాక్ — (రూ. లక్షల్లో)

| పిటీషన్ నెం. | ఆస్తి వివరణ | 31.03.2029 నాటికి పూర్తి చేసేందుకు వ్యయం | | 2024-25 | 2025-26 | 2026-27 | 2027-28 | 2028-29 |
|---|---|---|---|---|---|---|---|---|
| పిటీషన్-1 | కంబైన్డ్ ఆస్తి | 16427.40 | AFC | 3398.74 | 1395.11 | 77.68 | - | - |

4. టారిఫ్ నిర్ణయ నిర్ధారణ కొరకు తయారు చేయబడిన దరఖాస్తు యొక్క ఒక కాపీ, దరఖాస్తుదారుని వెబ్‌సైట్ పై www.powergrid.in వద్ద ఉంచబడినది.
5. టారిఫ్ నిర్ణయ నిర్ధారణ ప్రతిపాదనలపై దరఖాస్తులోని ఏవైనా సూచనలు మరియు అభ్యంతరాలు వుంటే ఏ వ్యక్తి అయినా లబ్ధిదారుడు అయినా సెక్రటరీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్, 6వ, 7వ మరియు 8వ అంతస్తులు, టవర్ బి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజీ నగర్, న్యూఢిల్లీ-110029 (లేదా కమిషన్ యొక్క కార్యాలయము వున్న ఇతర చిరునామాకు) దరఖాస్తుదారునికి ఒక కాపీతో దాని కార్పొరేట్ కార్యాలయం చిరునామా వద్దకు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోపుగా పంపవలెను.

ప్రదేశం : గురుగ్రామ్ సం/-
తేది : 27.08.2025 GM (కమర్షియల్)

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ)
కార్పొరేట్ కార్యాలయం : "సౌదామిని", ప్లాట్ నం.2, సెక్టార్-29, గురుగ్రామ్, హర్యానా -122001
రిజిస్టర్డ్ కార్యాలయం : బి-9, కుతబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరాయ్, న్యూఢిల్లీ -110016
వెబ్‌సైట్ : www.powergrid.in, CIN: L40101DL1989GOI038121
మహారత్న PSU

వార్త

జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం మాత్రమే. ఏ సమస్యలూ లేని జీవితం ఉండదు.

-వాల్టర్ స్కాట్

# తపాల సేవలకు మంగళం!

అనుకోకుండా ఇప్పుడు తపాల శాఖ మళ్లీ రోడ్డెక్కుతోంది. విమానం ఎక్కలేని తపాలా సంచులు తపాల కార్యాలయాల్లోనూ, విమానాశ్రయాల్లోనూ పడిగాపులు పడి ఎదురుచూస్తున్నాయి. అమెరికాకు పోస్టల్ సేవలను భారత ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపి వేసింది. ఆగస్టు 29 నుంచి 100 డాలర్లకుపైగా విలువున్న బహుమతులు, లేఖలు, డాక్యుమెంట్లపై సేవలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన మేరకు అధిక సుంకాలు వడ్డిస్తాయి. జులై 20న అమెరికా జారీ చేసి కార్య నిర్వాహక ఉత్తర్వు మేరకు అంతర్జాతీయ పోస్టల్ నెట్‌వర్క్, అమెరికా కస్టమ్స్ సరిహద్దు రక్షణ (సిబిసి) విభాగాలు ఆమోదించిన క్వాలిఫైడ్ పార్టీల ద్వారా వస్తువులను రవాణా చేసే సంస్థలే సుంకాలు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాలి. ఈ సుంకాల వసూళ్ల ప్రక్రియపై పూర్తిస్థాయి స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో అమెరికా విమానయాన సంస్థలు భారత్‌వైపు నుంచి తపాల పార్శిళ్లు, లేఖలను స్వీకరించలేదు. ఇప్పుడొచ్చిన తంటా అంతా ట్రంప్ విధానంపై స్పష్టత లేనందునే. ఇదిలా ఉంటే స్వదేశంలో తపాలాశాఖలో సంస్కరణలు కూడా సామాన్య ప్రజలకు అర్థంకాకుండా ఉన్నాయి. నిత్యం తపాలా సేవలు నానాటికీ తీసికట్టు నాగంబొట్లు అన్న చందాన మారి పోస్టాఫీసులవైపు చూసేవారే తక్కువయ్యారు. కేవలం రికార్డుల్లో నమోదవ్వాల్సిన రిజిష్టర్డ్ పోస్టులు, లీగల్ నోటీసులు, రిజస్టర్ పార్శిల్స్ కోసం మాత్రమే న్యాయవాది కార్యాయాలు, వివిధ ప్రభుత్వ సంస్థలు మాత్రమే అటువైపు తొంగిచూస్తాయి. అయినా ప్రస్తుత కాలంలో సర్వర్ డౌన్ అన్న పేరిట సర్వీసులు సక్రమంగా అందించలేకపోతుండటం విచారకరం. తాజాగా ఈ మెయిల్, వాట్సాప్‌లు ఫోన్లలోనే అందుబాటులోకి రావడం, యుపిఐ చెల్లింపు సదుపాయం ఉండడంతో మనీ ఆర్డర్ల సేవలు కూడా మటుమాయమయ్యాయి. డబ్బుల చేరవేత, పుస్తకాల అందచేత, వంటి వారికి ప్రత్యామ్నాయ మార్గాలు రావడంతో పోస్టాఫీసు సందర్శకులు చాలా తగ్గిపోయారు. ఈ రీత్యా తపాల సంస్థ తన రూపురేఖలు మార్చుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. ఇకపై ఉత్తరాల పెట్టెలు కనిపించవు. అయితే ఆ శాఖ వివరణలో పోస్టాఫీసుల వద్ద బాగా ప్రాముఖ్యత గలసెంటర్లలో మాత్రమే పోస్టుబాక్స్‌లుంటాయి. ప్రైవేట్ కొరియర్లకు ఛార్జీలు ఎక్కువైనా, రక్షణ చేరవేతలో తపాలా శాఖ వారి సేవలలో పోల్చి చూస్తే కాస్త బెటర్ అనే పరిస్థితి ఉన్నందున జనం దృష్టి అటువైపు పడింది. తాజాగా డిజిటలైజేషన్ అందిపుచ్చుకోవాలనే తపనలో వడివడి అడుగులు లేయడానికి బదులు తప్పటడుగులు వేస్తోందని జనం నుంచి విమర్శ కూడా ఉంది. కారణం పోస్టల్ సర్వీసుల పునర్వ్యవస్థీకరణ జరిగినా ఎలక్ట్రానిక్స్ వ్యవస్థలో సరైన సదుపాయం లేక రిజిస్టర్డ్ సర్వీసులు కూడా సక్రమంగా చేయలేకపోతున్నాయి. ఒకవేళ ఈసర్వీసుల ఆధునికత కోసం కొత్తగా యువతకు ఉద్యోగాలు ఆస్కారం లభించినా సర్వీసులు మెరుగుపరుచుకోలేకపోతోంది. అక్నాలెడ్జిమెంటు జతపడే రిజిస్టర్ కవర్లు, పార్శిల్స్ పద్ధతి దాదాపు ఎత్తివేసినట్లే. దాదాపు ఈ సర్వీసులు కొత్త రూపం సంతరించుకుంటున్నాయనే చెప్పాలి. దేశ వ్యాప్తంగా ఎక్కడనుంచి ఎక్కడికి వెళ్లాలన్నా ఎంతో భద్రతగా చెక్కులు, డ్రాఫ్టులు, అతిముఖ్యమైన డాక్యుమెంట్లను చేరవేసే సర్వీసుగా రిజిస్టర్ పోస్టులుండేవి. దానికి అనుబంధంగా వచ్చిన 'స్పీడ్‌పోస్టు'ను కూడా ఇప్పుడు రిజిస్టర్ పోస్టును తోసిరాజని దాని స్థానంలో కూర్చోంది. ముద్రణా పుస్తకాలు, పత్రాలను చేరవేసే బుక్‌పోస్టుకు గతేడాది మంగళం పాడారు. సాధారణ పోస్టుకన్నా అత్యవసరంగా చేర్చేందుకని కొన్ని దశాబ్దాల నాడు ప్రవేశపెట్టిన ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఎప్పుడో ఆగిపోయింది. తంతితపాల కలిసి ఉన్నప్పుడు టెలిగ్రామ్‌లంటేనే 'మోర్స్'కీ చప్పుడు వినపడితేనే సమాచారం ఇటు నుంచి అటు చేరేవే కాదు. ఎలక్ట్రానిక్ విప్లవం వచ్చాక తంతితపాలా శాఖలో ఆధునిక సేవలు మొదలయ్యాయనుకున్నా తపాలా సిబ్బంది వాటిని చేరుకోలేకపోతున్నారనే అపప్రథ ఉండేది. తంతి శాఖ ఎప్పుడో విడిపోయింది. వినియోగదారునికి సరైన సేవలందించలేక చతికిలపడిపోయింది. దాంతో వారి వేగాన్ని ప్రైవేట్‌సంస్థలు అందుకొని వేగాతివేగంగా సర్వీసు ప్రొవైడర్లుగా మారి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నా. అప్పట్లో బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ సర్వీసుల్లో దొంగ కనెక్షన్లు, టెలిఫోన్ వైర్ల దొంగతనం విచ్చలవిడిగా జరిగినా నష్టాలు వచ్చేవికావు. కానీ యాజమాన్య నిర్వహణ లోపంలో టెలిఫోన్ సేవలు చేజార్చుకున్నారు. అలా తంతి తపాలాలు శాశ్వతంగా దూరమయ్యాయి. తపాలా కార్యక్రమాల విస్తరణ, అభివృద్ధి, ప్రక్షాళన, ప్రజలకు మరింత అందుబాటులో ఉంచే విధంగా పునరేకీకరణ లాంటి ప్రయత్నాలలో మళ్లీ ఇప్పుడు పోస్టాపీసులను భూస్థాపితం చేసిన సంవత్సరంగా చెప్పుకోవచ్చు. తపాలా బట్వాడా కోసం నియమిత సిబ్బందిని కూడా తగ్గిస్తున్నారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న తపాలా శాఖకు కొత్తరూపం రావడం మంచిదే. అయినా గతంలో అందరికీ అందుబాటులో ఉన్నాయనుకున్న సౌకర్యాల కుదింపు వినియోగదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. బ్రిటిష్ వారి కాలంలో గవర్నర్ జనరల్ వారెన్ హాస్టింగ్ 1776 మార్చిలో తంతితపాలా శాఖ ఏర్పడింది. అప్పట్నించి అంచెలంచెలుగా దినదిన ప్రవర్ధమానమై విస్తరించింది. పొదుపు ఖాతాలకు తపాలా శాఖ పెట్టిందిపేరు. డిజిటల్ ఎలక్ట్రానిక్ సాంకేతికతతో విస్తరించే ప్రతి సంస్కరణను ఆహ్వానించాల్సిందే. తపాలా సేవలలో ఎన్నో అద్భుతాలు వింటుంటాము. ఇన్ని వైభవాలున్న తపాలా సేవలు అధునాతన సంస్కరణలతో ద్విగుణీకృతం కావాల్సి ఉంది.

అదృష్టం తనంతా తానుగా వచ్చి తలుపు తడుతుందని అందరూ చెప్తుంటారు. అది అవకాశం రూపంలో ఉంటుంది. దాన్ని వెంటాడు. సొంతం చేసుకో!



జాన్ వాట్సన్

ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా ఎప్పటికీ అతనిని విడువని నీడలాగా ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.



గౌతమబుద్ధుడు

## ప్రజావాక్కు



### ప్రయోజనం శూన్యం

ఏ వ్యక్తినైనా నిశితంగా పరిశీలించకుండా భ్రమలో పడి చాలా 'మంచివాడు' అనే ముద్ర వేసినచో, నిజరూపంలో ఆ క్షణం నుండే మంచివాడుగా నటించడం మొదలెడతాడు. మానవ పుట్టుకతో బంధాలు కలుస్తాయి, గిట్టడంతో జ్ఞాపకాలు మిగులుతాయి. మంచి చెడులు కలిగి ఉన్న మనిషి జీవితంలో సిరి సంపదలకంటే పరువు ప్రతిష్టలు శాశ్వతంగా నిలుస్తాయి. ఎదురుచూడని ఇంటికి పిలవకుండా వెళ్ళినా, విలువ లేని చోట మాట్లాడినా, గౌరవం లేని చోట నిలబడినా, ప్రేమలేని చోట ఆశపడినా, నిర్లక్ష్యం ఉన్నచోటఎదురు చూచినా, బంధాలకంటే డబ్బుకు విలువ ఇచ్చేవారితో ఎంతప్రేమగాఉన్నా, నీవెనుక ఒకటి ముందు ఒకటిమాట్లాడేవారికిదగ్గరలోఉన్నా, ప్రయోజనం శూన్యం.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### వినాయక ఉత్సవాలు ఆరంభం

బొంబాయి లాంటి మహానగరాల్లో ప్రజల్ని ఒకటిగా చేయడానికి మన బలాన్ని, బలగాన్ని బ్రిటిష్ వారికి చూపడానికి బాలగంగాధర్ తిలక్ ఈ గణేష్ ఉత్సవాలను ఎంచుకున్నారు. అంతకు ముందురోజుల్లో గ్రామాలలో ఎవరి ఇంటి గణేశుని వారే ఆ ఊరు కోనేటి నుండి కొంత మట్టిని తెచ్చుకుని మట్టి ప్రతిమను తయారుచేసి పిండి వంటలు పెట్టి నవరాత్రులు గడిచాక వాటిని ఆ చెరువులో నిమజ్జనం చేసేవారు. నవరాత్రులు వర్షాలు పడేవి. వర్షాలు వల్ల వచ్చిన నీరు చెరువులో నిలవడానికి చెరువులో మట్టిని ఇంటికి ఇంత అని తీసేవారు. వర్షాలు పడడం తగ్గాక అదే మట్టిని ఆ చెరువులోనే నిమజ్జనం చేయడం వల్ల, నీరు పైకి వచ్చి పొలాలకు సేద్యం చేయడానికి వ్యవసాయం చేయడానికి ఉపయోగపడేది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### నోటిఫికేషన్స్ పేపర్‌లో వేయాలి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రకటనను అన్ని ప్రధాన వార్తా పత్రికల్లోవేయాలి. ప్రస్తుతం ఉద్యోగ నియామకాలు అంతర్గతంగాఎప్పుడో జరిగిపోతున్నాయి. ఉద్యోగ నియామ కాలు, ప్రకటనలు నిరుద్యోగులకు, ప్రజలకు తెలియకుండా జరిగిపోతున్నాయి. విద్యార్థులకు అడ్మిషన్స్ సంబంధిత నోటిఫికేషన్స్ కూడా ప్రధాన పత్రికల్లో వేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

### రాజకీయ నైతికత

మొన్నటి సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడి, ఆనక మరింత లోతు పరిశీలనకై జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపబడ్డ రాజ్యాంగం 130 వ సవరణ బిల్లు ప్రత్యేకమైనది. రాజకీయాల్లో, ముఖ్యంగా పాలనలో పై స్థాయిలో నైతికత ప్రోది చెయ్యడానికి ఉద్దేశించబడింది. దాని ప్రకారం ప్రధాన మంత్రి గానీ, కేంద్ర, రాష్ట్ర మంత్రులు గానీ, ముఖ్యమంత్రి గానీ ఏదైనా క్రిమినల్ కేసులో, అదీ ఐదేళ్లకు పైగా శిక్షార్హమైన కేసులో అరెస్ట్ అయ్యి ముప్ఫై రోజులు జైలు లేదా కస్టడీ జీవితం గడిపితే వారిని వెంటనే తొలగించాలి అని. అంటే 31 వ రోజుకి ఆటోమేటిక్‌గా పదవి కోల్పోతారు. ఒక వేళ తర్వాత బెయిల్ పొందితే మళ్లీ పదవి చేపట్టవచ్చు. అది వేరే విషయం. ఈ చట్టం స్ఫూర్తి వినడానికి ఎంతో బాగుంది.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పనుల జాతర పల ప్రదంగా కొనసాగుతుంది. ఇందులో రెండు భాగాలున్నాయి. ఒకటి గ్రామీణప్రాంతమౌలిక వసతులు మెరుగుపరచడం. రెండు ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి ప్రయత్నం చేయడం. ఇందులో భాగంగా గొర్రెల పాకలు గాని పశువుల కొట్టాలు గాని పండ్ల తోటల పెంపకం గాని చేయడం వల్ల తెలంగాణలో గొర్రెల సంఖ్య పెంచడానికి సాధ్యం అవుతుంది. ఒకప్పుడు వేరే రాష్ట్రాల నుండి గొర్రెలను దిగుమతి చేసుకునేవారు. ఇప్పుడు దానిని స్థిరీకరించి మొదటి స్థానానికి చేరాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థ స్థిరీకరణ జరుగుతుంది.

- భారత అవినాశ్, జనగామ

### జనరిక్ మందులపై అవగాహన అవసరం

ఈ రోజు పెరుగుతున్న వైద్య వ్యయాల నేపథ్యంలో జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరం. ప్రత్యేకించి ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఇది ఎంతో ఉపయుక్తం. వాణిజ్య బ్రాండ్ మందుల ధరలు అధికంగా ఉండటం వల్ల పేద ప్రజలకు చికిత్స అందడం కష్టమవుతోంది. జనరిక్ మందులు తక్కువ ధరలో, అదే నాణ్యతతో, అనుమతించబడిన ప్రమాణాలతో తయారవుతాయి. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, జన ఔషధి కేంద్రాల ద్వారా వీటిని విస్తృతంగా అందుబాటులోకి తేవాలి. వీటిపై ప్రజల్లో అవగాహన పెంచాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# శిక్షణ లేకనే నిరుద్యోగులకు కష్టాలు!

**మన విద్యా విధానం లోపాలను బయటపెడుతోంది. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ అందించకపోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోంది. విద్యార్థులు కూడా తాము నేర్చుకుంటున్న దాన్ని వృత్తిలో ఎలా ఉపయోగించుకోవాలో అన్వయించుకోలేకపోతున్నారు. దీని వలన విద్యాకాలం తర్వాత కూడా వారు తిరిగి కోచింగ్ సెంటర్లకు లేదా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లకు వెళ్లాల్సి వస్తోంది. మన విద్యా విధానం చాలా వరకు పుస్తకాలకే పరిమితమైపోయింది. కోర్సులు రూపకల్పనలో ఉద్యోగ అవకాశాలను పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు మార్కులు తెచ్చుకున్నా, వృత్తిపరమైన అవకాశాలుదొరకడం లేదు. పాత సిలబస్ ఆధారంగా బోధించడం వల్ల కొత్త టెక్నాలజీలు, పరిశ్రమలో జరుగుతున్న మార్పులు విద్యార్థులకు తెలియవు. ఇంతకీ, చాలామంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు.**

సోరుపాక అనిల్ కుమార్

విద్య అంటే వెలుగు అని మనం తరతరాలుగా నమ్ముతూ వచ్చాం. చదువుకున్నవాడికి ఉద్యోగం వస్తుంది, గౌరవం వస్తుంది, కుటుంబానికి సంతోషం వస్తుందని ప్రతి ఇంటిలోనూ తల్లిదండ్రులు కలలు కంటారు. కానీ ఈ కాలంలో ఆ కలలు చాలావరకు చీకటిలో కలిసిపోతున్నాయి. చదువుకున్నా కూడా ఉద్యోగం దొరకని పరిస్థితి ప్రతి ఇంటి గడపను తట్టిపోతుంది. ఒకవైపుడిగ్రీలు, పీజీలు, ఎంబీఏలు, ఇంజినీరింగ్, మెడిసిన్, పీహెచ్.డీలు పూర్తిచేసిన యువత ఉత్సాహంగా బయటకు వస్తుంటే, మరోవైపు వారికి తగిన అవకాశాలు లేక నిరుద్యోగుల బాటలో నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ఈసమస్య వ్యక్తిగతంగా ఒకరి జీవితాన్ని మాత్రమేకాదు, మొత్తం దేశ ఆర్థికవ్యవస్థను, సమాజాన్ని కూడా కుదిపేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం లక్షలాది మంది యువత రాత్రింబవళ్లు కష్టపడతారు. కాని, సంవత్సరాల తరబడి కొత్త నోటిఫికేషన్లు రావడం లేదు. వచ్చినా కూడా కోర్టు కేసులు, సాంకేతిక లోపాలు, అవినీతి కారణంగా ఆ నియామకాలు ఆగిపోతున్నాయి. పరీక్షలు రాసిన యువత ఫలితాల కోసం నెలల తరబడి ఎదురు చూస్తుంటారు. కొందరికి వయసు పైబడిపోతుంది, మరికొందరు నిరుత్సాహంతో అవకాశాలు వదులుకుంటారు. ప్రభుత్వంలో ఖాళీలున్నా కూడా వాటిని భర్తీ చేయడంలో స్పష్టత లేకపోవడం మరో సమస్య. కొన్నిసార్లు రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు నోటిఫికేషన్లు ఇస్తూ ప్రజలను మోసం చేస్తాయి. పరీక్షలు పూర్తవ్వగానే కొత్త కేసులు రావడంతో ఆ నియామకాలు స్తంభించిపోతాయి. ఈ పరిస్థితి యువత జీవితాలను మాత్రమేకాదు, సమాజంలోని సామర్థ్యాన్ని కూడా వృథాచేస్తుంది. నిరుద్యోగం పెరగడంతో సామాజిక సమస్యలు కూడా ఉధృతమవుతాయి. ప్రభుత్వ నియామకాలు సమయానికి జరిగిఉంటే, వేలాది కుటుంబాలు ఆర్థికంగా బలపడేవి. కానీ ఆలస్యం వల్ల భవిష్యత్తు పాడవుతోందనే అసహనం పెరుగుతోంది. ప్రైవేట్ రంగం యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నా, వాటి నాణ్యత ప్రశ్నార్థకమే. చాలా సంస్థలు ఉద్యోగులను తక్కువ జీతాలతో ఎక్కువ గంటలపాటు పని చేయిస్తాయి. భద్రతా హామీలు లేకుండా కాంట్రాక్టు ఆధారంగా నియమిస్తారు. ఒక ఉద్యోగి తప్పు చేస్తే వెంటనే తొలగిస్తారు. ఎలాంటి రక్షణ ఉండదు. ఆరోగ్య భీమా, పింఛన్ వంటి సదుపాయాలు చాలా అరుదుగా ఉంటాయి. ఇంత తక్కువ జీతాలతో జీవన ఖర్చులు భరించలేక యువత ఋణాల బారిన పడుతున్నారు. కొంతమంది నైపుణ్యానికి తగిన వేతనం పొందక నిరుత్సాహపడుతున్నారు. కార్పొరేట్ కంపెనీలు ఎక్కువ లాభాలు సంపాదించినా ఉద్యోగులకు తగిన వాటా ఇవ్వడం లేదు. అదనంగా, రాత్రి పూటలు, టార్గెట్లు, ఒత్తిడి కారణంగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఉద్యోగ భద్రత లేకపోవడం వలన రేపటికి ఏమవుతుందో అన్న భయం ఎప్పుడూ వెంటాడుతోంది. ఈ దోపిడి పరిస్థితి యువతను మరోసారి ప్రభుత్వ ఉద్యోగాలవైపు తిరిగి పరుగెత్తేలా చేస్తోంది. మన విద్యార్థులు పుస్తక చదువులో మెరుగ్గా ఉన్నా, పరిశ్రమలకు కావాల్సిన ప్రాక్టికల్ నైపుణ్యాలు చాలావరకు లోపిస్తున్నాయి. యంత్రాలు, టెక్నాలజీ, ప్రాజెక్టు అనుభవం లాంటివి చాలా మందికి ఉండవు. ఫలితంగా, ఉద్యోగ ఇంటర్వ్యూలలో వెనుకబడిపోతున్నారు. ఇంజనీరింగ్ లేదా డిగ్రీ పూర్తిచేసినప్పటికీ, వర్క్‌ప్లేస్‌లో అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్,



టీమ్‌వర్క్, ప్రాబ్లమ్ సాల్వింగ్ సామర్థ్యాలు తక్కువగా ఉంటాయి. కొన్ని సంస్థలు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగులను తయారు చేసుకుంటున్నా, అంతవరకు యువతకు అవకాశాలు దొరకడం లేదు. నైపుణ్యలోటు వల్ల చాలా సార్లు బాహ్య రాష్ట్రాల నుండి లేదా విదేశాల నుండి నిపుణులను కంపెనీలు తీసుకువస్తున్నాయి. ఇది మన విద్యా విధానం లోపాలను బయటపెడుతోంది. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ అందించకపోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోంది. విద్యార్థులు కూడా తాము నేర్చుకుంటున్న దాన్ని వృత్తిలో ఎలా ఉపయోగించుకోవాలో అన్వయించుకోలేకపోతున్నారు. దీని వలన విద్యాకాలం తర్వాత కూడా వారు తిరిగి కోచింగ్ సెంటర్లకు లేదా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లకు వెళ్లాల్సి వస్తోంది. మన విద్యా విధానం చాలా వరకు పుస్తకాలకే పరిమితమైపోయింది. కోర్సులు రూపకల్పనలో ఉద్యోగ అవకాశాలను పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు మార్కులు తెచ్చుకున్నా, వృత్తిపరమైన అవకాశాలుదొరకడం లేదు. పాత సిలబస్ ఆధారంగా బోధించడం వల్ల కొత్త టెక్నాలజీలు, పరిశ్రమలో జరుగుతున్న మార్పులు విద్యార్థులకు తెలియవు. ఇంతకీ, చాలా మంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కొన్నిసార్లు నిరుపయోగమైన కోర్సులు కూడా నడుస్తూనే ఉన్నాయి. విద్యార్థులకు వృత్తి శిక్షణ, స్టార్టప్ ప్రోత్సాహం, పరిశ్రమలతో అనుసంధానం వంటి అంశాలు చాలా తక్కువ స్థాయిలో మాత్రమే అమలవుతున్నాయి. ఫలితంగా, విద్య పూర్తి చేసినా వారి చేతిలో సరైన పనులు ఉండడం లేదు. మరోవైపు, ప్రభుత్వ విధానాలు కూడా సమయానికి మార్పులు చేయకపోవడం వల్ల ఈ లోపాలు కొనసాగుతున్నాయి. ఒక కోర్సు చదివిన విద్యార్థి ఆ రంగంలో పని దొరకక, వేరే రంగాల్లో తక్కువ వేతనాలతో పని చేయాల్సి వస్తోంది. ఇది విద్యార్థులలో నిరాశను పెంచుతుంది. ప్రభుత్వం ఏ దేశానికైనా ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారం. కానీ, మన రాష్ట్రంలో, దేశంలో వేల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు సంవత్సరాల తరబడి భర్తీ చేయకుండా ఉంచడం వలన నిరుద్యోగులలో ఆందోళన పెరిగింది. పాఠశాలలలో ఉపాధ్యాయుల కొరత, ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత, కార్యాలయాల్లో సిబ్బంది కొరత వల్ల ప్రజా సేవలు దెబ్బతిన్నాయి. ఖాళీలు ఉన్నా వాటిని భర్తీ చేయకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల నాణ్యత తగ్గి, నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి దొరకడం లేదు. పారదర్శకమైన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఉండకపోవడం, పరీక్షలలో ఆలస్యం, కోర్టు కేసులు, అవినీతి కారణంగా విద్యార్థుల జీవితాలు ఇబ్బందులకు గురవుతున్నాయి. ప్రభుత్వం ఖాళీల సంఖ్యను స్పష్టంగా ప్రకటించి, సమయానికి నోటిఫికేషన్లు విడుదల చేసి, పారదర్శకంగా నియామకాలు జరపాలి. అనేకమంది ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, ఇతరకోర్సులు చదివి ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. కానీ అక్కడ జీతాలు తక్కువగా, పని గంటలు ఎక్కువగా ఉండటం, ఉద్యోగ భద్రత లేకపోవడం ప్రధాన సమస్య. చాలా కంపెనీలు ఫ్రెషర్స్‌కు కేవలం కొన్ని వేల రూపాయలే ఇస్తాయి. ఇది వారికష్టానికి సరిపోదు. అందువల్ల చాలామంది నిరుత్సాహానికిలోనై, నిరుద్యోగుల్లాగే తిరుగుతున్నారు. ప్రైవేట్‌రంగంకూడా ఉద్యోగులను కేవలం శ్రమ శక్తిగా కాకుండా మానవ వనరులుగా చూడాలి. వారి నైపుణ్యాలకు తగ్గజీతాలు ఇవ్వాలి. సెక్యూరిటీ, పీఎఫ్, ఇన్సూరెన్స్, ప్రమోషన్ అవకాశాలు కల్పించాలి. నేటి నిరుద్యోగ సమస్యలో పెద్ద కారణం మన విద్యావ్యవస్థ. హెల్త్‌కేర్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ మార్కెటింగ్ వంటి రంగాల్లో ఉద్యోగాలు పెరుగుతున్నాయి. కానీ మన కాలేజీల్లో ఆ కోర్సులు చాలాపరిమితంగా ఉన్నాయి. అందువల్ల విద్యా వ్యవస్థను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్చాలి. యువత కేవలం ఉద్యోగాలకోసం కాకుండాస్వయం ఉపాధి, స్టార్టప్‌లు, నైపుణ్యాభివృద్ధి వైపుదృష్టి సారించాలి. యువతలో చాలా మంది కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడుతున్నారు. కానీ వాస్తవానికి ప్రతిఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం దొరకదు. కాబట్టి యువత తనఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి. కొత్త తరహా ఉపాధిఅవకాశాలను అన్వేషించాలి. ●

# మట్టి గణపతే మన పర్యావరణ హితుడు

డాక్టర్ మోటె చిరంజీవి

వినాయక చవితి సందర్భంగా ఇళ్లల్లో కొలువుదీర్చే గణపయ్యలను ముఖ్యంగా విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు మట్టితో చేసిన విగ్రహాలనే కొలువుదీర్చి పూజలు చేస్తున్నారు. అందువల్ల వివిధ రాష్ట్రాలలో, జిల్లాలో, వివిధ ప్రాంతాల్లో కళాకారులు మట్టితో చిన్న విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వినాయక చవితి పండుగకు అతి తక్కువ సమయం ఉండటంతో వ్యాపారులు మట్టితో తయారు చేసిన విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. మట్టితో తయారు చేసే విగ్రహాలకు మంచి డిమాండ్ కూడా ఉంది. మట్టికి, మనిషికి విడదీయరాని బంధం ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ మనుగడ ప్రకృతితో ముడిపడి వుంది. ప్రకృతి ఆరాధనతో మొదలైన పూజలు ఇప్పుడు విగ్రహ ఆరాధన వరకు వచ్చాయి. సాధారణంగామిగతా దేవతామూర్తుల విగ్రహాలను కళాకారులు రాయితో మలుచుతారు. అయితే వినాయక చవితి ఉత్సవాల అనంతరం స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేయాల్సి వున్నందున కళాకారులు సులువుగా విగ్రహాలను తయారు చేసేందుకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో గణపయ్య విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇటీవల కాలంలో విగ్రహాల ఏర్పాటు సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. వేల సంఖ్యల్లో పెద్ద విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు సంభవించే ప్రమాదముందని విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన ఎత్తయిన విగ్రహాలు నీటిలో కరిగి దానినుంచి వెలువడే వ్యర్థాలతో ఆయా చెరువులు పూర్తిగా కలుషితం కావడం ఎంతో దారుణం. ఆ నీటిలో ఆవాసాన్ని ఏర్పరచుకున్న చేపలు, చిన్న చిన్న జీవులు, ఆ చెరువు నీటిని తాగేందుకు దిగివచ్చే పక్షులు, ఇలా ఆ నీటితో ప్రత్యక్షంగా సంబంధమున్న జీవుల మనుగడ ప్రశ్నార్థంగా మారుతుంది. దేశ వ్యాప్తంగా ప్రతిష్ఠించిన విగ్రహాలలో దాదాపు ప్లాస్టర్ పారిస్ విగ్రహాల సంఖ్య అధికంగా ఉంది. ఉత్సవాల అనంతరం ఎంతో అట్టహాసంగా సాగిన నిమజ్జనం తర్వాత ఆయా చెరువుల్లో చెత్తను వెలికి తీయడం పెద్ద పని. దాని ప్రకారం గత



ఏడాది కంటే ఈ ఏడాది విగ్రహాల కంటే వ్యర్థాలు బాగా పెరిగినట్టుగా చెబుతున్నారు. నిమజ్జనం చేసిన విగ్రహాలతో పాటు పూజలో వినియోగించిన సామగ్రిని కూడా చెరువు లోనే వేస్తారు భక్తులు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అనగా పీఓపీ విగ్రహాల వల్ల నీటి కాలుష్యం, ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం, జలచరాలకు హాని, మట్టి ఆరోగ్యం దెబ్బతినడం వంటి పర్యావరణ నష్టాలు ఉన్నాయి. పర్యావరణానికి హాని కలిగించే ఈ పదార్థాన్ని వాడకుండా, సంప్రదాయ మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని అధికారులు, పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. మట్టి గణపతిని పూజించటంలో యోగశాస్త్ర రహస్యాలు కూడా ఉన్నాయి. మానవ శరీరంలో ఉండే షట్చక్రాల్లో మొదటిది మూలాధార చక్రం. ఇది వెన్నుపూస ప్రారంభంలో ఉంటుంది. యోగశాస్త్రం ప్రకారంమూలాధార చక్రానికి అధిష్ఠాన దేవత గణపతి. మూలాధారం పృథ్వీతత్తం కలిగి ఉంటుంది. పృథ్వి అంటే భూమి. కాబట్టి, భూమికి సంకేతంగా మట్టితో విగ్రహం చేసి, మూలాధారానికి అధిదేవుడైన గణపతికి అర్చించాలి. దీనివల్ల గణపతి అనుగ్రహం సత్వరమే కలు గుతుంది. ఇలా మట్టి వినాయకున్ని నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు కలుషితం కావు. పర్యావరణానికి ఎంతో మేలు చేసినట్టవుతుంది. భగవంతుని పూజకు భక్తి ప్రధానం. భక్తి లేకుండా బంగారు విగ్రహాన్ని పూజించినా ఫలితం ఉండదు. త్రికరణ శుద్ధితో, భక్తి శ్రద్ధలతో చిన్న వినాయకుని పూజించినా ఫలితం ఉంటుంది. అంతేకాని ఆర్భాటాలకు, గొప్పలకు పోయి పెద్దపెద్ద విగ్రహాలను పెట్టి తరువాత వాటిని నిమజ్జనం చేసేటప్పుడు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పెద్ద విగ్రహాల తయారీలో వాడే వస్తువులు నీటిలో కరిగిపోవు. నీటి కాలుష్యానికి కారణమయ్యే అనేక రకాల కృత్రిమ రంగులు, కెమికల్స్ వీటిలో ఉంటాయి. వినాయక చవితిని సింపుల్‌గా చేసు కోవడం వల్ల నష్టమేమీ లేదు. ఎంత భక్తిగా దేవుని పూజి స్తున్నామో ముఖ్యం గానీ, ఎంత ఆడంబరంగా చేస్తున్నా మన్నది ముఖ్యం కాదు. మనచుట్టూ ఉండే ప్రకృతే దైవ స్వరూపం. కనిపించే ప్రకృతిని నాశనం చేస్తూ కనబడని దేవుని పూజిస్తే ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రకృతిని దైవంగా భావిస్తూ మట్టి గణపతి పూజిద్దాం. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. ●

# చిన్నారులపై సోషల్ మీడియా విధ్వంసాన్ని ఆపేదెలా?

సంపతి రమేష్ మహారాజ్

నేటి ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాలు, ఓటిపి వెబ్ సిరీస్ వినియోగం విపరీతంగా పెరుగుతుంది. ఇవీ పిల్లల మనస్తత్వంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. హింసాత్మక ఘటనలకు దారి తీస్తున్నాయి. ఇటీవల కూకట్‌పల్లిలో జరిగిన బాలిక హత్యకేసులో మైనర్ బాలుడు క్రైమ్ వెబ్ సిరీస్‌తో ప్రేరణ పొందినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేయడం ఆన్లైన్ వేదికలలో తెలుసుకొని చేశాడు. చోరీని బాలిక చూడడంతో ఆమెను కిరాతకంగా చంపాడు. బెంగళూరులో ఓ బాలుడు (14) వెబ్ సిరీస్ చూసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరీస్‌లోని ఓ క్యారెక్టర్ బొమ్మను కూడా తన గదిలో గీశాడు. కొందరు యువకులు ఒక బైక్ పై ఎనిమిది మంది ఎక్కి నడపడం వంటి సాహసాలకు ఒడిగడుతున్నారు. పిల్లల్లో ఇలాంటి విపరీత ప్రవర్తనకు స్మార్ట్ ఫోన్ వినియోగం, ఓటీటీ వెబ్ సిరీస్లు ప్రధాన కారణమని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. చిన్నారులు ఎదుగుతున్న దశలో సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్‌లకు బానిసవడం వలన వారిలో విపరీత ప్రవర్తన, దూకుడు స్వభావం పెచ్చురిల్లుతుంది. పగ, శత్రుత్వం, దాడులకు ఉసిగొలుపుతున్నాయి. తద్వారా నేరాల బారిన పడుతున్నారు. కొన్నిసార్లు ఇవి శాంతిభద్రత సమస్యలుగా మారుతున్నాయి. సామాజిక మాధ్యమాలు తరచూ వీక్షించడం వలన పిలల్లో ఓపిక, సహనం, ఆలోచన శక్తి నశిస్తుంది. విద్య విషయాలలో వెనకబడుతున్నారు. విలువలు పతనమవుతున్నాయి. పిల్లలు పెద్దలపట్ల గౌరవం మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నారు. ప్రస్తుతం వాట్సప్, ఫేస్బుక్, ఎక్స్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, వంటి ఆన్లైన్ వేదికలు సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ సంబంధిత విషయాల తెలుసుకోవడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. మారుమూల ప్రాంతాల అణచివేయబడిన వర్గాల గొంతును వినిపిస్తున్నాయి. సామాజిక చైతన్యానికి ఊపిరిలూదుతున్నాయి. వీటి ద్వారానే కొన్నిసార్లు ప్రభుత్వం, అధికారుల స్పందన కూడా ఉంటుంది. ఒకప్పుడు పెద్దలకే పరిమితమైన ఈ ఆన్లైన్ వేదికలు ఇప్పుడు పిల్లల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆటపాటలతో సాగే బాల్యం మొబైల్ స్క్రీన్‌ఇరుక్కుపోయింది. వీటినుంచి పిల్లల్ని కట్టడి చేయడం తల్లిదండ్రులకు తలనొప్పిగా మారింది. సామాజిక మాధ్యమాలను నియంత్రించకపోతే భవిష్యత్తు భావి పౌర సమాజం అంధకారమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈ నేపథ్యంలో పలు దేశాలు సామాజిక మాధ్యమాలనుంచి పిల్లలను దూరంగా చేయాలని ఆలోచిస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తున్నారు. గత ఏడాది ఆస్ట్రేలియా ప్రభుత్వం తమ దేశంలో 16 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించడంపై నిషేధం విధించింది. ఇప్పుడు ఫ్రాన్స్ కూడా అదే బాటలో నడిచే ప్రయత్నం చేస్తుంది. ఇటీవల తూర్పు ఫ్రాన్స్‌లోని నోజెంట్ పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థి దాడి ఘటన తర్వాత 15 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియాను నిషేధించే యోచనలో ప్రభుత్వం ఉందని ఫ్రాన్స్ ప్రధాని పేర్కొన్నారు. ఈ విషయంలో ఈయూ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని లేదా తామే అమలు చేస్తామని ప్రకటించాడు. ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకున్న రెండో దేశంగా ఫ్రాన్స్ నిలిచే అవకాశం ఉంది. చిన్నారులు, యువతపై సామాజిక మాధ్యమాల దుష్ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఫ్రాన్స్ ప్రభుత్వం నిర్ణయంపై చర్చ జరుగుతుంది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా సామాజిక మాధ్యమాల నియంత్రణపై ప్రపంచ దేశాలు ఆలోచిస్తున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా బాల జనాభా గల భారత దేశంలో బాలల్ని సామాజిక మాధ్యమాల వ్యసనం నుంచి దూరం చేయాలి. ప్రభుత్వ పరంగా చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలి. 2023లో కర్ణాటక హైకోర్టు పాఠశాల పిల్లలు సామాజిక మాధ్యమాలకు అధికంగా వ్యసనం కావడం పట్ల ఆందోళనల వ్యక్తం చేసింది. ఈ మేరకు కోర్టు వీటిని వినియోగించడానికి 21సంవత్సరాల వయోపరిమితిని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంలో కొన్ని షరతులను విధించింది. 18సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు ఆన్లైన్ డేటాను నిర్వహించడానికి కంపెనీలు తల్లిదండ్రుల సమ్మతి తీసుకోవాలని చెప్పింది. బాలల లక్ష్యంగా ఉండే ప్రకటనలపై పరిమితులు విధించింది. పిల్లల్లో నేర ప్రవృత్తి పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలను డిజిటల్ పరికరాలకు దూరం చేయడం ముఖ్యమైన అంశం. అప్పుడప్పుడు విద్యా అవసరాలకు వినియోగిస్తున్నప్పుడు ఏం చూస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలి. వారిలో విపరీత పోకడలను సరిదిద్దాలి. ఇంట్లో కుటుంబ సభ్యులు వారానికి ఒకసారి ఫోన్ హాలిడే పెట్టుకోవాలి. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్నంద్ గావ్ జిల్లా గహీరాబేడీ గ్రామ పంచాయతీలో పిల్లలు ఫోన్ గేములు ఆడితే తల్లిదండ్రులకు రూ.3,000 జరిమానా విధిస్తామని ఆంక్షలు పెట్టారు. దీంతో ఆ గ్రామంలో చాలావరకు మార్పు కనిపించింది. ఇలాంటి కట్టడి ప్రతిగ్రామంలోరావాలి. ఆన్లైన్ మనీ గేమ్‌తో యువత ఆర్థికంగా నష్టపోతుంది. ఈ క్రమంలో ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన ఆన్లైన్ గేమ్ నియంత్రణ బిల్లు2025 ను ఆమోదించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు కుటుంబ బంధుత్వాలు, విలువల గురించి బోధించాలి. పిల్లలతో కలిసి ఆడుకోనివ్వాలి. ●

# ‘ఓట్ల చోరీ’పై ప్రజాభిప్రాయం

## ● ఇసి కీలక నిర్ణయం ● ఐదు ప్రశ్నలను సంధిస్తున్న ఇసి ● గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని విపక్షాల ఆరోపణ




**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఎ సర్కార్ ఎన్నికల సంఘంతో కుమ్మక్కై బీహార్ ప్రజల ఓట్లను దొంగిలించే ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము చేపట్టిన బీహార్ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన వివిధ అంశాలపై తమ అభిప్రాయం తెలపాలని రాష్ట్ర ప్రజలను కోరేందుకు పోల్‌ప్యానల్ అయిదు ప్రశ్నలను సిద్ధం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

– ఓటర్ల జాబితాలను సవరించి, విస్తృతంగా పరిశీలించాలా?

– చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలా?

– రెండు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల పేర్లను ఒకదగ్గరి నుంచి తొలగించాలా?

– ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన ఓటర్లను జాబితా నుంచి మినహాయించాలా?

– విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజలు ఓటు హక్కును తిరస్కరించాలా?

ఈ ప్రశ్నల ఆధారంగా బీహార్ వ్యాప్తంగా సర్వే చేసి ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడానికి ఎన్నికలకమిషన్ ఈచర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీహార్‌లో ఓటరు జాబితా నుంచి దాదాపు 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఇసి ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని, ప్రాణాలతో ఉన్న వారిని చనిపోయినట్లుగా పేర్కొంటూ వారిని జాబితా నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నాయి. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని డిమాండ్‌చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టులో పిటి షన్లు వేశాయి. వీటిపై విచారణచేపట్టిన న్యాయ స్థానం ఎస్‌ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను వెల్లడించాలని ఇసికి సూచించింది.



# జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాలు

**శ్రీనగర్, ఆగస్టు 26:** జమ్మూ కాశ్మీర్‌లో కురిసిన అతివృష్టి, వరదలు, కొండచరియల విరిగిపడటం తీవ్ర విషాదానికి దారితీసింది. దోడా జిల్లాలో మేఘవిస్ఫోటం, వరదల కారణంగా కనీసం ఐదుగురు ప్రాణాలుకోల్పోగా, అనేక ఇళ్లు, రహదారులు ధ్వంసమయ్యాయి. అర్ధక్వారిలోని వైష్ణోదేవి ఆలయం మార్గంలో జరిగిన భారీ కొండచరియ ప్రమాదంలో పలువురు భక్తులు గాయపడి, మరికొందరు మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. దోడా జిల్లాలో ఒక ఇల్లు కూలిపోవడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయారు. ప్రధాన నదులు ఉప్పొంగి పోతుండటంతో ప్రజలు నది తీరాలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. జోజిలా పాస్‌వద్ద కురిసిన భారీ మంచుకారణంగా శ్రీనగర్‌లేహ్ హైవే నిలిచిపోయింది. అలాగే, వందే భారత్ ఎక్స్‌ప్రెస్, శ్రీశక్తి ఎక్స్‌ప్రెస్, హేమకుంట్ ఎక్స్‌ప్రెస్‌తో సహా అనేక రైళ్లు రద్దు చేశారు.

# గాంధీ కుటుంబమే నా దైవం

## కర్ణాటక డి.సిఎం డికె శివకుమార్

**బెంగళూరు, ఆగస్టు 26:** బిజెపిని విమర్శించేందుకే నేను ఆ పాటపాడాను. కానీ కొందరు దీని ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని అనుకుంటున్నాను. ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారు. నేను ఎవరి మనోభావాలు దెబ్బతీయాలని అనుకోవడం లేదు. ఈ వ్యవహారంతో ఎవరైనా బాధపడిఉంటే అందుకు చింతిస్తున్నాను. నేను క్షమాపణలు చెప్తాను. అయితే అవి రాజకీయ ఒత్తిడివల్ల చెప్పే క్షమాపణలు కాదుఅని డికె వెల్లడించారు. అలాగే గాంధీ కుటుంబం కాంగ్రెస్ పార్టీపై తనకున్న నిబద్ధత తిరుగులేనిదని వ్యాఖ్యానించారు. నేను కాంగ్రెస్ వ్యక్తిగానే జన్మించా. అలాగే మరణిస్తా. గాంధీ కుటుంబం నాకు దైవంతో సమానం. నేను వారి భక్తుడిని అని స్పష్టంచేశారు.

# చైనా విద్యార్థులకు యుఎస్‌లో గేట్లు ఎత్తేస్తాం

## డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో గందరగోళం



**వాషింగ్టన్, ఆగస్టు 26:** చైనా విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ద్వంద్వ వైఖరి ఆశ్చర్యపరుస్తోంది. ఓ వైపు టారిఫ్‌లపై బీజింగ్‌కు వార్నింగ్ ఇస్తూ వాణిజ్య యుద్ధానికి కాలు దువ్వుతూనే.. చైనా విద్యార్థులకు అమెరికా తలుపులు తెరుస్తున్నారు. ఏకంగా ఆరు లక్షల మంది చైనీస్ విద్యార్థులను అగ్రరాజ్యానికి ఆహ్వానిస్తున్నారు. ట్రంప్ తీరు సొంత పార్టీ నేతలను అసహనానికి గురిచేస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులు, విదేశీ విద్యార్థుల విషయంలో కఠిన నిబంధలను అమలుచేస్తోన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా చైనాలో కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారు, పరిశోధన రంగంలో ఉన్న వారికి వీసాలు రద్దు చేస్తామని బహిరంగంగానే హెచ్చరికలు చేశారు. భారత్ సహా ఇతర దేశాల విద్యార్థుల వీసాల ప్రక్రియను కూడా కఠినతరం చేశారు. ఈ క్రమంలోనే తాజాగా చైనా విషయంలో ట్రంప్ యూటర్న్ తీసుకోవడం గమనార్హం.

తాజాగా వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ‘చైనీస్ విద్యార్థులను అమెరికాలోకి మేం అనుమతించబోమంటూ వచ్చిన వార్తలను విన్నాం. కానీ, మేం వారికి మన విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించాలనుకుంటున్నాం. మనకు అది చాలా ముఖ్యం కూడా. 6 లక్షల మంది చైనా విద్యార్థులు అమెరికాకు వచ్చేందుకు అనుమతిస్తాం. ఆ దేశంతో సంబంధాలు మెరుగుపరుచుకోవాలనుకుంటున్నాం’అని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా వర్సిటీల్లో దాదాపు 2.70 లక్షల మంది చైనీస్ విద్యార్థులు చదువుకుంటున్నారు. ట్రంప్ తాజా ప్రకటన రాజకీయ వివాదానికి దారితీసింది.

ఆయన నిర్ణయాన్ని సొంత పార్టీ నేతలు, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) మద్దతుదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చైనా విద్యార్థులకు అవకాశం కల్పించడం అంటే.. ‘అమెరికా ఫస్ట్’ అజెండాకు ద్రోహం చేసినట్టేనని మండిపడుతున్నారు. అమెరికా విద్యార్థులకు రావాల్సిన అవకాశాలను చైనీయులకు ఎలా కల్పిస్తారని ప్రశ్నిస్తున్నారు. అయితే, ట్రంప్ నిర్ణయాన్ని అధ్యక్షుడి యంత్రాంగం సమర్థించింది. ‘చైనీస్ విద్యార్థులను అనుమతించకపోతే.. అమెరికాలో 15 శాతం యూనివర్సిటీలకు పని లేకుండా పోతుంది. ఆర్థిక విధానాలను పరిగణనలోకి తీసుకునే ట్రంప్ హేతుబద్ధంగా వ్యవహరించారు’ అని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

## పాకిస్థాన్‌కు సిడిఎస్ పరోక్ష హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. అది ఇప్పటికీ కొనసాగుతోంది. త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీవార్ కాలేజీలో ప్రారంభమైన ‘రణ్ సంవాద్’ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్తాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, భారత్ ఎల్లప్పుడూ శాంతివైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్లం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు అని అన్నారు.

గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనావేసేవారు. కానీ ఇప్పుడు ఆపరేషన్ల వేగం,



కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి అని ఆయన తెలిపారు. వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం సశస్త్ర, సురక్షిత్, ఆత్మనిర్భర్‌గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ రణ్‌సంవాద్ సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించారు.



# ప్రధాని మోడీ, పుతిన్‌కు చైనా అధ్యక్షుని ఆహ్వానం

## ఎస్‌సిఒ సమ్మిట్‌కు రావాలని పిలుపు

**బీజింగ్, ఆగస్టు 26:** ఆగస్టు చివరలో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకారం సదస్సు(ఎస్‌సిఒ)లో పాల్గొనేందుకు భారత ప్రధాని మోడీ చైనా వెళ్తున్నారు. ఈ సదస్సు సందర్భంగా మోడీతోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా ఆహ్వానించనున్నారట. అమెరికా టారిఫ్‌ల వేళ.. గ్లోబల్ సౌత్ దేశాలకు (వర్ధమాన దేశాలు) సంఘీభావంగా శక్తివంతమైన ప్రదర్శనలో భాగంగానే ఈ చర్య ఉండనుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

మోడీ, పుతిన్‌తోపాటు మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల నేతలకు ఈ ఎస్‌సిఒ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు ఒకటి మధ్య తియాంజిన్ వేదికగా ఈ సదస్సు జరగనుంది. ప్రధాని మోడీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. తర్వాత చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఈ తర్వాత 2020లో లడ్డాఖ్ సరిహద్దుల్లో భారత్–చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోడీ భేటీ అయిన సంగతి తెలిసిందే.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతోన్న వేళ.. మోడీ చైనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సుంకాలను డ్రాగన్ ఖండించింది. వాణిజ్య, సుంకాల యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తామని ప్రకటించింది.

మరోపక్క ఢిల్లీలోని రష్యా రాయబారి మాట్లాడుతూ.. భారత్, చైనాతో కలిపి త్వరలో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని భావిస్తున్నట్లు మీడియాతో వెల్లడించారు. ఆ సదస్సు వేళ ఈ ముగ్గురు నేత మధ్య సమావేశం జరగొచ్చని తెలుస్తోంది.

కాగా.. ‘చైనా, ఇరాన్,రష్యా.. ఇప్పుడు భారత్‌పై వాషింగ్టన్ తీసుకుంటున్న చర్యలు ఎలాంటి ప్రభావం చూపలేదు. ఈ తరుణంలో అమెరికా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ క్రమం ఎలా ఉండనుందో తెలియజేసేందుకు జిన్‌పింగ్ ఈ సదస్సును ఉపయోగించుకోవాలని అనుకుంటున్నారు’ అని చైనాగ్లోబల్‌సౌత్ ప్రాజెక్టు ఎడిటర్ ఇన్ చీఫ్ ఎరిక్ ఒలాండర్ అభిప్రాయపడ్డారు. ఎస్‌సిఒ చరిత్రలో ఇదే భారీ సమావేశంగా నిలుస్తుందని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయమంత్రి ఇప్పటికే వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

# సంక్షిప్తంగా..

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రంసింఘేకు బెయిలు

**కొలంబో, ఆగస్టు 26:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్‌విక్రమ్‌సింఘేకు మంగళవారం కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై రణిల్‌విక్రమ్‌సింఘేను ఈ నెల 22న అరెస్టు చేసిన విషయం విదితమే. ఓవైపు రణిల్ మద్దతుదారులు కోర్టు ఆవరణలో గుమిగూడిన సందర్భంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య మంగళవారం మధ్యాహ్నం కోర్టుకు ఆయనకు అనారోగ్య కారణాలరీత్యాత బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 22న విక్రమ్‌సింఘేను కస్టడీలోకి తీసుకోగానే ఆయనను జైలులోని ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కొలంబో నేషనల్ హాస్పిటల్‌లోని ఐసియులో ఉంచి అప్పటి నుంచి చికిత్స అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధికారులు స్థానిక మీడియాతో మాట్లాడుతూ 76 యేళ్ల వయసున్న రణిల్‌కు హైబిపి, మధుమేహానికి సంబంధించి చికిత్స అందిస్తున్నామన్నారు.

## శ్రీదేవి ఆస్తి కబ్జా అయిందని కోర్టును ఆశ్రయించిన బోనీ కపూర్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** ఒకప్పటి బాలీవుడ్ అగ్ర హీరోయిన్ దివంగత శ్రీదేవి ఆస్తిని చెన్నై నగరానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆక్ర మించుకున్నారని ఆరోపిస్తూ ఆమె భర్త బోనీ కపూర్ చెన్నై హైకోర్టును ఆశ్రయించారు. 1988 ఏప్రిల్‌లో శ్రీదేవి మద్రాసులో సంబంధ మొదలియార్ అనే వ్యక్తి దగ్గర ఒక స్థిరాస్తిని కొన్నారు. మొదలియార్‌కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు వున్నారు. అందరి సంతకాలు చేసిన తరువాత తన భార్య శ్రీదేవి ఈ ఆస్తిని కొన్నదని ఆయన హైకోర్టుకు తెలిపారు. అయితే ఈ ఆస్తిలో తమకూ వాటా వుందని చెబుతూ మొదలియార్ రెండవ భార్య కుమారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేసి చట్టవిరుద్ధంగా హక్కులు పొందారని బోనీ కపూర్ తెలిపారు. చట్ట విరుద్ధంగా తన భా ర్య ఆస్తిని మరొకరికి రావడంలో అధికారుల పాత్ర వుందని బోనీ కపూర్ ఆవేదన చెందారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి ఆనంద్ ఈ కేసును నాలుగు వారాల్లో తేల్చాలని తాంబరం తహసీల్దార్‌ను ఆదేశించారు.

## పాక్ గూఢచారి మోతీరాంకు భారీ నెట్‌వర్క్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** సిఆర్‌పిఎఫ్‌లో ఎఎస్‌ఐగా పనిచేస్తూ పాక్ గూఢ చార సంస్థ ఐఎస్‌ఐతో జతకట్టి అరెస్టయిన మోతీరాంకు అ టు పాక్ ఇటు భారత్‌లో భారీ నెట్‌వర్క్ వున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) గుర్తించింది. మోతీరాం జాట్ భారత సైన్యంతో పాటు పారా మిలటరీ బలగం, ప్రభుత్వ విభాగాల్లో కీలక హోదాలో వున్న పలువురు టచ్‌లో వున్నట్లు ఎన్‌ఐఎ గుర్తించింది. వీరిలో నలుగురు మిలటరీ అధికారులు, మరో ఇద్దరు పారా మిలటరీ అధికారులు మిగతా వారు ప్రభుత్వ విభాగాలకు చెందిన వారుగా ఎన్‌ఐఎ గుర్తించింది. మోతీరాం జాట్‌ను గత మే నెల 27వ తేదీన ఎన్‌ఐఎ అరెస్టు చేయడం తెలిసిందే. జాట్‌ను అరెస్టు చేసిన తరువాత ఈ కేసు విచారణను ఎన్‌ఐఎ చేబట్టడం విదితమే. దీని తరువాత అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న ఎన్‌ఐఎ అందులోని నంబర్లను విశ్లేషించగా 15 మందితో అతను తరచూ మాట్లాడుతున్నట్లు తేలింది. ఇందులో అనేక కాల్స్ ఇంటర్నెట్‌విగా వున్నాయి. జాట్ పాకిస్తాన్‌లోని లాహోర్‌కు చెందిన సలీం అనే ఆపరేటర్‌తో తరచూ సంభాషించేవాడని ఎన్‌ఐఎ తేల్చింది.

## భారీ వరదలతో మనాలిలో కొట్టుకుపోయిన రోడ్లు, హోటళ్లు



**మనాలీ, ఆగస్టు 26:** హిమాచల్ ప్రదేశ్‌పై మళ్లీ ప్రకృతి తన ప్రకోపాన్ని చూపించింది. తీవ్ర స్థాయి వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వరదలు వల్ల కిరాట్పూర్, మనాలీ జాతీయ రహదారిపై నష్టం జరిగింది. దీంతో మండీ, మనాలీలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల బియాస్ నది ఉప్పొంగుతున్నది. దాని ఉప నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఎమర్జెన్సీ చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారి పలు ప్రదేశాల్లో బ్లాక్ అయింది. మనాలీ సమీపంలో ఉన్న బిందు ఢంక్ వద్ద బియాస్ నది వరద నీటికి జాతీయ హైవే కొట్టుకుపోయింది. దీంతో పాపులర్ టూరిస్టు కేంద్రానికి రాకపోకలు తెగిపోయాయి. మనాలీలో నది సమీపంలో ఉన్న ఓ హోటల్ ఆ వరదలో కొట్టుకు పోయింది. మండి, కులు ప్రాంతాల్లో డేంజర్ మార్క్ దాటి నది ప్రవహిస్తున్నది. లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బహంగ్, అలూ గ్రౌండ్ ప్రాంతాల నుంచి జనాలను తరలిస్తున్నారు. మరో 24 గంటలపాటు నది సమీపానికి వెళ్లవద్దు అని టూరి స్టులకు అధికారులు వార్నింగ్ ఇచ్చారు.

# అమెరికా టారిఫ్‌ల ప్రభావం తగ్గొచ్చు

## భారత్, యుఎస్ వాణిజ్య చర్చలు సఫలం అయ్యే అవకాశం

## ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆశాభావం



**ముంబై, ఆగస్టు 26:** భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ప్రతినిధుల చర్చలు సఫలం కాగలవన్న ఆశాభావాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యక్తం చేశారు. రష్యా నుంచి పెద్ద ఎత్తున ముడి చమురు కొనుగోళ్లకుగాను దేశీయ ఎగుమతులపై 25 శాతం జరిమానాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం నుంచే ఇవి అమల్లోకి రానున్నాయి. దీంతో అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై సుంకాల భారం 50 శాతానికి చేరబోతున్నది. ఇప్పటికే ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం ఆలస్యానికిగాను వేసిన 25 శాతం టారిఫ్‌లు అమల్లో ఉన్నాయి మరి. ఈ క్రమంలోనే ఇరు దేశాల నడుమ వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ఆకాంక్షను సోమవారం ఇక్కడ ఫిక్కి, ఐబీఏ (ఫిబక్) నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ కనబర్చారు. వాణిజ్య చర్చలు సఫలమైతే భారత ఆర్థిక వ్యవస్థపై టారిఫ్‌ల ప్రభావం తగ్గొచ్చన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. అమెరికా టారిఫ్‌లు భారత్‌పై 50 శాతానికి పెరిగితే వస్త్ర, రొయ్యల ఎగుమతులు ఖరీదెక్కనున్నాయి. ఇదే జరిగితే దేశంలో ఆయా రంగాలపై ఆధారపడ్డ వ్యాపారాలు, పరిశ్రమలు, ఉద్యోగులు, రైతులు ఇబ్బందుల్లో పడ్డట్టేనన్న ఆందోళనలు కనిపిస్తున్నాయి.

**ద్రవ్య విధానంపై..**

దేశంలో ద్రవ్యోల్బణం, జిడిపి వృద్ధిరేటు రెండింటిపైనా ఆర్బీఐ దృష్టి పెడుతుందని, వాటికి అనుగుణంగానే తమ ద్రవ్య విధానం కొనసాగుతుందని ఈ సందర్భంగా మల్హోత్రా స్పష్టం చేశారు. ఈ ఏడాది మొదలు ద్రవ్య సమీక్షల్లో కీలక వడ్డీరేటైన రెపో రేటును ఆర్బీఐ క్రమేణా తగ్గిస్తూ వస్తున్న సంగతి విదితమే. ఇప్పటిదాకా 4 ద్రవ్య సమీక్షలు జరుగగా.. మూడింటిలో 1 శాతం రెపో రేటు దిగింది. ఈ నెల సమీక్షలో మాత్రం యథాతథంగానే ఉంచింది. ఈ నేపథ్యంలో ఇక రాబోయే ద్రవ్య సమీక్షల్లో కేవలం జిడిపి బలోపేతంపైనేగాక, ధరల అదుపు కోణంలోనూ ఆలోచించి నిర్ణయాలుంటాయని ఆర్బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. అమెరికా టారిఫ్‌లు, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులకుతోడు ద్రవ్యోల్బణం అంశాలూ ఆర్బీఐ ముందు కీలకంగా ఉన్నాయంటున్నారు.

**పెట్టుబడులకు కలిసి..**

వృద్ధి లక్ష్యాలను ఆర్బీఐ విస్మరించట్లేదన్న మల్హోత్రా.. టారిఫ్‌లు, భౌగోళికరాజకీయ ఆందోళనల నుంచి సవాళ్లు ఎదురవుతున్న దృష్ట్యా కార్పొరేట్లు, బ్యాంకులు కలిసి పెట్టుబడులకు ఊతమివ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశ ఆర్థికాభివృద్ధికున్న అవకాశాలను వదులుకోలేమని, ఆర్థిక విస్తరణకున్న అన్ని మార్గాలనూ మరింత పెంచుకోవాలని సూచించారు. అందుకే బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు, కార్పొరేట్ల పనితీరు అత్యుత్తమంగా కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆయా రంగాల్లో పెట్టుబడులకు దన్నుగా నిలవాలని చెప్పారు.

**క్రెడిట్ డిమాండ్ తగ్గింది: శెట్టి**

కార్పొరేట్ల నుంచి రుణాల డిమాండ్ తగ్గిందని ప్రభుత్వ రంగ ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అన్నారు. నేడు మెజారిటీ కార్పొరేట్ సంస్థలు ప్రైవేట్ క్రెడిట్ పట్ల ఆసక్తి చూపిస్తున్నాయని, నిధుల సమీకరణ కోసం క్యాపిటల్ మార్కెట్లలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు. దీంతో దేశ వృద్ధి లక్ష్యాల సాధన కోసం పెద్ద ఎత్తున వచ్చే పెట్టుబడులకు దన్నుగా నిలవడానికి బ్యాంకులు చూస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే బ్యాంకులపైనున్న కొన్ని రకాల ఆంక్షలు తొలగిపోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అయితే ఇందుకు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా సానుకూలంగా స్పందించారు.

**ఎఐతో బ్యాంకింగ్‌కు కొత్త రూపు**

భారతీయ బ్యాంకింగ్ రంగం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లేదా ఎఐ)తో కొత్తరూపును సంతరించుకోగలదని ఓ నివేదిక అభిప్రాయపడింది. ఉద్యోగాలపై ఏఐ ప్రభావంపట్ల ఆందోళనలు కనిపిస్తున్న వేళ ఇదిప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని దక్కించుకుంటున్నది. కాగా, బ్యాంకులు ఏఐని అందిపుచ్చుకుంటే ఎన్నో లాభాలను పొందగలవని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బిసిజి) ఈ రిపోర్టులో పేర్కొన్నది. గడిచిన దశాబ్ద కాలంలో బ్యాంకులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై చేసే ఖర్చులు ఐదింతలు పెరిగాయని, ఉత్పత్తిలో అందుకు ఒనగూరిన లాభం మాత్రం 1 శాతమేనని గుర్తుచేసింది. అయితే ఎఐతో ఈ తరహా నష్టాలను అధిగమించవచ్చని చెప్పింది. నిజానికి ఇప్పటికే అనేక బ్యాంకులు ఏఐ సాధనాలు వినియోగిస్తున్నాయని తెలిపింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు భారీగా కోత!

## త్వరలో కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు భారీగా కోత పడనుంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలను మరింత కఠిన తరం చేయాలని సంక్షేమ శాఖలు నిర్ణయించాయి. రాష్ట్రం మొత్తం మీద ప్రతీ ఏటా 12.51 లక్షల మంది ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పొందుతున్నారు. ఇందులో 5 లక్షల మంది కొత్త వారు ఉండగా, అన్ని కోర్సులకు కలిపి సంవత్సరానికి 2,350 కోట్ల రూపాయలు చొప్పున ప్రభుత్వానికి ఖర్చవుతోంది. ఇప్పటి వరకు సాంఘిక, గిరిజన సంక్షేమ విద్యార్థులకు ఎంత ర్యాంకు వచ్చినా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. వెనుకబడిన తరగతులకు మాత్రం 10 వేల లోపు ర్యాంకు వస్తేనే ఇంజనీరింగ్‌లో మొత్తం చెల్లిస్తు, ఆపై ర్యాంకులకు 35 వేల రూపాయలను మాత్రమే ఇస్తున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఫీ రియింబర్స్‌మెంట్ భారం భారీగా పెరిగి వాటి నిమిత్తం బకాయిలు ఇప్పటికే దాదాపు 8.10 కోట్ల రూపాయల మేరకు పెరుగు పోయాయి. ఈ నేపథ్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హతల్లో మార్పులు చేసేందుకు సర్కార్ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం దాదాపు 35 శాతం మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కోల్పోయే అవకాశం ఉన్నట్లు అంచనా. ప్రధానంగా డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర సాధారణ, సాంకేతిక కోర్సులకు గాను ఫీజు రియింబర్స్‌మెంట్ అర్హత విషయంలో కొత్తగా మార్గదర్శకాలను రూపొందించే పనిలో అధికారులు ఉన్నారు. ముఖ్యంగా ఒక సంవత్సరంలో 50 శాతం సబ్జెక్టులు పాస్ కావడంతో పాటు, 75 శాతం హాజరు ఉండాలనే నిబంధనలను కొత్తగా అమలు చేయనున్నట్లు సమాచారం. అంతేకాకుండా వివిధ సబ్జెక్టుల్లో నిర్దిష్ట మార్కులను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. డిగ్రీ కోర్సుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ లోపం ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఆటువంటి విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ అమలు చేయకుండా అనర్హులుగా చేసే ఆలోచన చేస్తున్నారు. సాంకేతిక కోర్సులకు సంబంధించిన ప్రధాన సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు తెచ్చుకున్న వారికే ఈ పథకాని వర్తింప చేయనున్నారు.



ఆచార్య రాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య సంజీవ్ సోనావాణే, ఆచార్య వర్సిటీ విసి ఘంటా చక్రపాణి తదితరులు.

# విశ్వవిద్యాలయాల్లో డిజిటల్ ఆవిష్కరణలదే భవిష్యత్తు

## ఘనంగా అంబేద్కర్ వర్సిటీ 44వ వ్యవస్థాపక వేడుకలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అగస్టు 26, ప్రభాతవార్త:** మారుతున్న ఆధునిక సవాళ్లను అధిగమిస్తూ సరికొత్త డిజిటల్ ఆవిష్కరణలతో దూరవిద్యావిధానం అభివృద్ధిలో పయనిస్తుందని యశ్వంతరావు చవాన్ మహారాష్ట్ర విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య సంజీవ్ సోనావాణే అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ 44వ వ్యవస్థాపక వేడుకలను మంగళ వారం విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 'సార్వత్రిక దూర విద్యలో కృత్రిమ మేధ ఆధారిత పరివర్తన పేరుతో నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక దూరవిద్య విధానం ఒక కొత్త యుగంలోకి ప్రవేశించిందని, దీనిలో ఆర్టిఫిషియల్ ఇంటి లిజెన్స్ ఎంతో ఆవశ్యకత సంతరించుకొందన్నారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఇంటికి దూరవిద్యను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. త్వరలో విశ్వవిద్యాలయంలో డిజిటల్ రిసోర్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ మైక్రో క్రెడెన్షియల్ కోర్సులను ప్రారంభించారు. జాతీయ సెమినార్ పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. ఘంటా చక్రపాణి సేకరించిన 1,100ల పుస్తకాలను వర్సిటీ లైబ్రరీకి అందించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో పనిచేసే అనువాదిని సంస్థతో జరిగిన అవగాహన ఒప్పందం మేరకు ఆయా ఒప్పందపత్రాలను సంస్థ సిఇఇ చంద్రశేఖర్ చేతుల మీదుగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి మార్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, డీన్లు, బోధన, బోధ నేతర సిబ్బంది, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు ఆచార్య జి.రాంరెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

# రాష్ట్రంలో పాలన పక్కకుపెట్టి ఢిల్లీ టూర్లు, విదేశాలకు వెళ్లిన ఘనత రేవంత్‌రెడ్డిదే

## బిజెపి అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత 20 నెలల పాలనలో ప్రజాసమస్యలను పట్టించుకోకుండా 50సార్లు ఢిల్లీతోపాటు బీహార్, కలకత్తా, విదేశాల టూర్లకు వెళ్లిన ఘనత కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని బిజెపి అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1978-83 మధ్య ఐదు సంవత్సరాల్లో నలుగురు ముఖ్యమంత్రులు మారినా, ఒక ముఖ్యమంత్రి మాత్రమే 75 సార్లు ఢిల్లీకి వెళ్లాడు. కానీ రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల్లోనే దాదాపు ఆ రికార్డుకు దగ్గరయ్యారన్నారు. ప్రజలు అడుగుతున్నారు... మేము ఎన్నుకున్న ముఖ్యమంత్రి ఎక్కడ? ఎప్పుడూ ఢిల్లీలోనా, బీహార్‌లోనా, లేదంటే విదేశాల్లోనా? అంటూ ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఎప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలనుకుంటే - వారు హైదరాబాద్‌లో ఉండరు, సెక్రటేరియట్‌కి రావడం లేదు, ప్రజలకు అసలు అందుబాటులో ఉండడం లేదు,

ఎప్పుడూ ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి తిరుగుతూనే ఉన్నారు అన్నారు. అందుకే ఆయనకు సరిపోయే బిరుదు ఒకటే -ది బెస్ట్ హాపింగ్ చీఫ్ మినిస్టర్ ఆఫ్ ది కంట్రీ, ఇటీవల సోనియా గాంధీ రేవంత్ రెడ్డికి బాస్కర్ అవార్డు ఇచ్చినట్లే, ఇకపై ఈ హాపింగ్ చీఫ్ మినిస్టర్ అవార్డు కూడా ఆయనకే దక్కుతుందన్నారు. గ్యారెంటీలు అని చెప్పి, హామీలు అని చెప్పి, కొత్త కొత్త స్కీమ్స్ తెస్తామని పదే పదే చెబుతూ ప్రజలను మోసం చేశారన్నారు. ఇటీవల మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వివిధ జిల్లాల పర్యటనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయన వద్దకు వచ్చి పిటిషన్లు, మెమోరాండాలు ఇచ్చారని, ముఖ్యమంత్రికి కనీసం ఒకసారి చెప్పండి.. మా సమస్యలు విని పరిష్కరించేలా హితవు పలకండి అని ప్రజలు వేడుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి హోం మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా, గత 20 నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అనేక ఘోరాలు జరిగాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు పెరిగాయని, మహిళలపై అత్యాచారాలు భయంకరంగా పెరిగాయన్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి, కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే, తెలంగాణ రాష్ట్రం ఈ రోజుకి మరింత అభివృద్ధి చెంది ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలతో పోటీపడే స్థాయిలో నిలిచేది. కానీ ఆ అవకాశాన్ని వినియోగించుకోలేక, ప్రజలను మోసం చేశారన్నారు.

# 29 నుంచి ఎడ్‌సెట్ సెకండ్‌ఫేజ్ కౌన్సెలింగ్

## సెప్టెంబరు 11న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ ఈ నెల 29 నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి అవకాశం కల్పించినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండు రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల లిస్టును సెప్టెంబర్ 4న ప్రకటించనున్నారు. అర్హులైన వారు సెప్టెంబర్ 5, 6 తేదిల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 7న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 11న సీట్ల కేటాయింపు చేస్తారు. సీట్లు పొందిన వారు సెప్టెంబర్ 12 నుంచి 16 వరకు ఆయా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ సూచించారు. రాష్ట్రంలో 14,295 కన్వీనర్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటి కోసం మొదటి విడతలో 17,151 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 9955 మందికి సీట్ల కేటాయింపు చేశారు. ఈ నెల 10న సీట్ల కేటాయింపు చేయగా.. వారు కాలేజీల్లో చేరడానికి విద్యార్థులకు ఈ నెల 20 వరకు అవకాశం కల్పించిన విషయం తెలిసిందే.

# పెండింగ్‌లోని ఎస్టీ ప్రత్యేక నిధుల వినియోగానికి చర్యలు

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖలో మంగళవారం జరిగిన సమా వేశంలో మాట్లాడుతూ ఎస్టీల సంక్షేమం కోసం ఆయా సంవత్సరాలలోనే ఖర్చు కాకుండా మిగిలిపోతున్నాయని చెప్పారు. వాటిని అదే యేడాది సకాలంలో ఖర్చు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామ న్నారు. అలాగే ఎస్టీ ఉద్యోగులకు ఉద్యోగాలలో ప్రమోషన్లు సకాలంలో వచ్చేలా రోస్టర్ విధానాన్ని పటిష్టం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ ఆశించిన విధంగా జరిగేలా చూడాలన్నారు. విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలు వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ దేశంలో అన్ని కార్పొరేషన్లకొంత నిర్వీర్యమైనాయని, ఈ విషయంలో ప్రభుత్వ సహకారం ఆయా కార్పొరేషన్లకు అవసరమన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులతో చర్చించిఇప్పటికే కొన్ని విధాన పరమైన నిర్ణయాలను తీసుకోగలి గామన్నారు. ఇక మీదట ఎస్సీ ఎస్టీ కమీషన్ ఇచ్చే సలహాలు, సూచనలు పాటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్, లక్ష్మినారాయణ, శంకర్, రేణికుంట్ల ప్రవీణ్‌తో పాటు, గిరిజన సంక్షేమ కార్యదర్శి వర్షిణి, అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్‌రెడ్డి, ఎస్టీ గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాలి

## ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులు ఎటు వంటి ఆందోళన చెందవద్దని ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. యూరియా విక్రయించే పి. ఏ.సి.ఎస్., ప్రైవేట్ ఎరువుల డీలర్ షాపుల వద్ద ప్రభుత్వ అధికారిని నియమించి పర్యవేక్షణ చేసేలా బాధ్యతలు అప్ప గించాలని ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎం.ఎల్.సి.లు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు, ఎస్.పి.లు, వ్యవసాయ అధికారులు, సహకార శాఖ అధికారులతో యూరియా సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సీజన్ పూర్తి అయ్యే వరకు యూరియా సరఫరాపై జిల్లా కలెక్టర్ లు, ఎస్.పి.లు ప్రత్యేక దృష్టి సారించి నిశితంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యూరియా సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరిగినా, దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించిన అటువంటి ఎరువుల డీలర్ లపై, నకిలీ విత్తనాలు విక్రయించిన, అధిక రేటుకు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్‌లు, ఎస్.పి.లను ఆయన ఆదేశించారు. యూరియా పంపిణీ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయని వాస్తవంగా కేంద్రం నుండి రావాల్సిన 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా ఇప్పటివరకు 5.72 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా వచ్చిందని ఇంకా సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందని తెలిపారు. పూర్తిగా యూరియా వస్తే రైతులకు ఎటువంటి ఇబ్బంది రాదని తెలిపారు. రైతులు ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్రంతో, కేంద్ర మంత్రులతో మాట్లాడి వెంటనే యూరియా రాష్ట్రానికి వచ్చేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. సమావేశంలో ఎం.ఎల్.సి కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, చిక్కుడు వంశీ కృష్ణ, కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి, తూడి మేఘా రెడ్డి, డి.సి.సి. బి ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# సాంకేతిక సమస్యల్లో రామగుండం ఎరువుల ప్లాంట్

## యూరియా ఉత్పత్తికి బ్రేక్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రానికి అత్యధికంగా యూరియాను సరఫరా చేసే రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్సీఎల్) ప్లాంట్ సాంకేతిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. తరచూ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడి యూరియా ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి, దీని ఫలితంగా రాష్ట్రానికి సకాలంలో, వాటా ప్రకారం రావాల్సిన యూరియా రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ప్లాంట్ 2021 మార్చి 22న యూరియా ఉత్పత్తిని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 20 సార్లు సాంకేతిక సమస్యలు ఏర్పడి నిలిచిపోయింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రెండు సార్లు ప్లాంట్ షట్డౌన్ కాగా, తాజాగా హెచ్టీఆర్ మెషినరీలో సాంకేతిక లోపం కారణంగా ఉత్పత్తి మళ్లీ నిలిచిపోయింది. దీని ప్రభావం యూరియా ఉత్పత్తిపై చూపుతోంది. రామగుండం యూరియా ప్లాంట్లో సాంకేతిక సమస్యలు తలెత్తిన సందర్భంలో పైప్లైన్లలో అమోనియా లీక్ అవుతోంది. దీంతో ప్లాంట్ మొత్తాన్ని రోజుల తరబడి షట్ డౌన్ చేయాల్సి వస్తోంది. మే 8న ప్లాంట్లో ఏర్పడిన లీకేజీ సమస్య కారణంగా జూన్ 15 వరకు 39 రోజులు ప్లాంట్ను షట్డౌన్ చేశారు. మళ్లీ జులై 16న సమస్య ఏర్పడడంతో ఆ రోజు నుంచి ఆగస్ట్ 4 వరకు 20 రోజులు ప్లాంట్ షట్డౌన్ అయింది. అలాగే హీట్ ట్రాన్స్ఫర్మింగ్ రీఫార్మర్ (హెచ్టీఆర్) లో ఈ నెల 14న టెక్నికల్ ఇష్యూతో లీకేజీ ఏర్పడడంతో ప్లాంట్ మరోసారి షట్ డౌన్ అయింది. ఈ మెషీన్లో సాంకేతిక లోపం ఏర్పడితే దానికదే ఆటోమేటిక్గా ట్రిప్ అవుతుంది. ఈ సమస్య ప్లాంట్‌లో నిత్యకృత్యంగా మారింది. ప్రస్తుత 2025-26 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 4 లక్షల టన్నుల యూరియా ఉత్ప త్తిని లక్ష్యంగా పెట్టుకోగా, 2.71 లక్షల టన్నుల ఉ త్పత్తి మాత్రమే చేయగలిగారు. ఈ నెలలో 65 వేల టన్నుల యూరియా ఉత్పత్తిచేసి రవాణా చే యాలని నిర్ణయించుకున్నా, కేవలం 24వేల టన్నుల యూరియాను మాత్రమే సరఫరా చేసింది.

# పెన్షనర్లను మోసం చేసిన ముఖ్యమంత్రి

**ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచాలి**

**9న హైదరాబాద్‌లో పెన్షన్‌దారుల మహాగర్జన**

**ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ**



మంగళవారం జడ్చర్లలో నియోజకవర్గ సన్నాహక సదస్సు మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 26, ప్రభాతవార్త:** వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవ్వకుండా మోసం చేశాడని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నియోజకవర్గ సన్నాహక సదస్సు నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. ఈ నెల ఓటు వేయండి, వచ్చే నెల నుండే పెన్షన్ తీసుకోండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ఓటు వేశాక ముఖ్యమంత్రి అయి పెన్షన్ దారులం దర్నీ ఘోరంగా మోసం చేశాడని విమర్శించాడు. రేవంత్‌రెడ్డి చేసిన మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్‌దారు లకు అన్యాయం చేస్తున్నాయన్నారు. 50లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మాదిగ రిజర్వే షన్ పోరాట సమితి పోరాటం చేస్తుందన్నారు. పెన్షన్లు పెంచకపోతే చలో హైదరాబాద్ సెప్టెంబర్ 9న పెరేడ్‌గ్రౌండ్‌లో లక్ష లాది మందితో మహాగర్జన నిర్వహిస్తు న్నామన్నారు. కార్యక్రమం లో వికలాంగ హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షులు బి.కె నరసింహం, ప్రధాన కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

# మిగిలిపోయిన భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

## ఎస్ఎలుగా పదోన్నతులు కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు: ఆర్‌యుపిపి రాష్ట్ర కార్యవర్గం

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిగిలిపోయిన భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌గా పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలం గాణ (ఆర్‌యుపిపి టిజి) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. భాషా పండితులకు ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) లాంగ్వేజెస్‌గా పదోన్నతులు కల్పించిన ప్రజాప్రభుత్వానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. తమ సంఘం చేసిన ప్రాతినిధ్యం మేరకు అనతి కాలం లోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలుగు, హిందీ, ఉర్దూ తదితర భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పదోన్నతులు కల్పించి నందుకు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్నతీకరించవలసిన 1000 భాషా పండితుల పోస్టులను కూడా ఉన్నతీకరించి.. పదోన్నతులు లభించని భాషాపండితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ముఖ్య మంత్రిని కోరుతున్నామన్నారు. పదోన్నతుల ప్రక్రియలో సహాయసహకారాలు అందించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులందరికీ పండిత పరిషత్ పక్షాన ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పదోన్నతులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. తెలంగాణ రాష్ట్రంలో భాషల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించగా.. ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లోనూ భాషా పండితులకు 500 మందికిపైగా పదో న్నతులు లభించినట్టు వారు తెలిపారు.

# ఈర్లపల్లి తండా రవినాయక్ మృతిపై విచారణ జరిపి నివేదికను ఇవ్వాలి

## మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ఈర్లపల్లి తండాకు చెందిన రవినాయక్ మృతిపై విచారణకు ఆదేశించారు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. రవి నాయక్‌కి సకాలంలో చికిత్స అందకపోవడం వల్లనే మరణించారని పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో మంత్రి విచారణకు ఆదేశించారు. ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, విచారణ జరిపించాలని అధికారులను మంత్రి మంగళవారం ఆదేశించారు. మృతికి కారణాలు ఏమిటో తెల్చి, ఎవరిదైనా నిర్లక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్లు.. డాక్టర్ రాజారావు, డాక్టర్ నాగేందర్‌లతో కమిటీ ఏర్పాటు చేస్తూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా నిర్లక్ష్యం జరిగి ఉంటే వైద్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని జీర్ణించుకోలేని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## సిపిఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** సెప్టెంబర్‌లో జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలో భాగంగా ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉండడం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా జీర్ణించుకోలేకపోతున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. అమిత్ షా గుజరాత్ రాష్ట్ర హోమ్ మంత్రిగా ఉన్నప్పుడు సొరబ్ ఎన్‌కౌంటర్‌కి సంబంధించి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పుతో .. అమిత్‌షా రెండు సంవత్సరాల పాటు గుజరాత్ రాష్ట్రం వెలుపల ఉండవలసి వచ్చిందని గుర్తు చేశారు. అప్పటి తీర్పుపై అమిత్‌షా ఇప్పుడు తన అక్కసు వెళ్లగక్కుతున్నాడని చాడా మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉండి న్యాయ వ్యవస్థ మీద మచ్చ తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే మావోయిస్టులు 20 సంవత్సరాలు ముందుకెళ్తారని అమిత్ షా అనడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ, అమిత్‌షా మావోయిస్టుల అవ శేషాలు లేకుండా చేయాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య మూల సూ త్రాలకు విరుద్ధమన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను నొక్కుతు న్నారని, 100 శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాపై నిందారోపణలు చేసి 9 సంవత్సరాలు జైలులో పెట్టడంతో చనిపోయారని, చివరికి సుప్రీంకోర్టు కూడా సాయిబాబా నిర్దోషి అని తీర్పు ఇవ్వడం పట్ల అమిత్‌షాకు చెంపపెట్టు లాంటిన్నారు చాడ వెంకట్‌రెడ్డి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వం పట్ల దేశంలోని జడ్జీలు స్పందిస్తున్నారని.. ఎన్డీఎ కూటంలో కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆలోచించి మోడీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య రక్షణ వైపు ఉండాలని చాడ వెంకట్‌రెడ్డి సూచించారు.

# రూ.2 వేల కోట్ల రుణం తీసుకున్న సర్కార్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన బహిరంగ వేలంలో తెలంగాణ రాష్ట్ర సర్కారు రూ.2 వేల కోట్లు రుణం సేకరించింది. అందుకు గాను ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను మంగళవారం ఈ వేలం వేయడం ద్వారా సమీకరించింది. ఈ రూ.2 వేల కోట్ల మొత్తానికి గాను మూడు భాగాలుగా సెక్యూరిటీ బాండ్లను సమర్పించింది. ఇందులో 26 ఏండ్ల కాలానికి రూ.500 కోట్లు, 28 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.500 కోట్లు చొప్పున రుణాన్ని సమీకరించింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.54,009 కోట్లు సమీకరించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ నుండి ఇప్పటి వరకూ రూ. 33,900 కోట్లు మేర రుణం తీసుకుంది. దీంతో వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతి పాదించిన రుణ సమీకరణలో 60 శాతం దాటింది.


# యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం తగదు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియాను కేంద్రం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ, రైతు లకు కావాల్సిన యూరియాను అందించడంలో కేంద్రప్రభుత్వం నిరక్ష్యధ్లోరణితో వ్యవహరిస్తుందన్నారు. రైతులు యూరియా కొరకు నెల రోజులుగా రోడ్లపైకి వస్తున్నప్పటికీ బిజెపి నాయకులు కుంటి సాకులు చెబుతూ "కృత్రిమ కొరత" సృష్టించారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్రం నుండి రాష్ట్రానికి కావాల్సి నంత యూరియాను తెప్పించడానికి రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నులు యూరియా కావాల్సి ఉండగా.. 1.5 లక్షల టన్నులను కేంద్రం తగ్గించిందన్నారు. ఇవ్వాల్సిన కోటాను కూడా ఇంత వరకు సకాలంలో సరఫరా చేయకపోవడంతో యూరియా కొరత ఏర్పడిందన్నారు. రైతులంతా సహకార సంఘాలు, షాపుల ముందు పడిగాపులు కాస్తున్నారని..ప్రభుత్వ కార్యాలయాల ముందు, రహదారుల మీద నిరసనలు తెలియజేస్తున్నారని చెప్పారు. నిరసనలు జరుగుతున్న చాలా చోట్ల తొక్కిసలాటలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్రంలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుండైనా రాష్ట్ర అవసరాలకు యూరియాను సరఫరా చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కోరినప్పటికీ.. ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యూరియా కొరతను తీర్చడానికి, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించడానికి ప్రభుత్వ సంస్థలైన హాకా, సహకార సంఘాల ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం నుండి తెప్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులకు కౌన్సెలింగ్

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 26, ప్రభాతవార్త:** ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా బి.ఎస్సీ. (ఆనర్స్) అగ్రికల్చర్, బిఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్, బి.టెక్ (ఫుడ్ టెక్నాలజీ), బి.టెక్( అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) కోర్సులలో సీట్ల భర్తీకి వాక్ ఇన్ కౌన్సిలింగ్ ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ. సీహెచ్ విద్యాసాగర్ ప్రకటించారు. అదేరోజు అనగా 30వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ కోర్సు బి.ఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం వాక్ ఇన్ కౌన్సిలింగ్ జరగ నుందని రిజిస్ట్రార్ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో ఈ రెండు కౌన్సెలింగ్‌లు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్ సైట్‌లో సూచించిన రుసుమును తీసుకొని కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాల కొరకు విశ్వ విద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించగలరని రిజిస్ట్రార్ విద్యాసాగర్ తెలిపారు.



రిజిస్ట్రార్ డా.విద్యాసాగర్


# 'జన ఔషధి' స్టోర్లతో బిసిలకు ఉపాధి

## 1.63 కోట్ల కుటుంబాలకు వైద్య బీమా

## 'ఆరోగ్య రథం'తో సంచార వైద్య సేవలు, ఉచిత పరీక్షలు

### అమరావతిలో నేచురోపతి వర్సిటీ: ఏపి సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** పేదలపై భారం తగ్గేలా,ప్రతి మండలంలో జనరిక్ ఔషధాలు లభ్యమయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూ చిం చారు. జన ఔషధి స్టోర్లు పెట్టేందుకు బీసీ కార్పొరేషన్ నుంచి వచ్చిన ధరఖాస్తులు పరిశీలించి తక్షణమే అనుమ తులు ఇవ్వాలని ఆదేశించారు రాష్ట్రంలో వైద్య సదుపాయాలు మెరుగు, ఆరోగ్య బీమాలో మార్పులు, కొత్త వైద్య కళాశాలల నిర్మాణం, ఉచిత వైద్య పరీక్షలు, యోగా నేచు రోపతి సేవల విస్తరణపై పలు సూచనలు చేశారు. ప్రతి నియోజక వర్గంలో 100 పడకల



ఆస్పత్రి నిర్మించేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. మార్కాపురం,మదనపల్లె,పులివెందుల,ఆదోనిలో నిర్మిస్తున్న వైద్య కళాశాలల పురోగతిపై చర్చించారు. డబ్ల్యూహెచ్ఓ మార్గదర్శకాల ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు మూడు పడకలు ఉండాలని, ఆ లెక్కన రాష్ట్రంలో మరో 12,756 పడకలు అవసరమని పేర్కొన్నారు. యోగా నేచురోపతిని ప్రోత్స హించేలా యోగా ప్రచార పరిషత్ నెలకొల్పామని సీఎం ఆదేశించారు. మూడు రీజనల్ స్టడీ సెంటర్లలో 64 మంది సభ్యులను నియమించేందుకు అనుమతిచ్చారు.

అమరావతిలో నేచురోపతి విశ్వ విద్యాలయం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని చంద్రబాబు సూచించార ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.25 లక్షల వరకు వైద్య భీమా అందించే అంశంపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. ప్రస్తుత విధానంలో 1.43 కోట్ల కుటుంబాలకు మాత్రమే లబ్ధి కలుగుతోందని, దీన్ని 1.63 కోట్ల కుటుంబాలకు వర్తించేలా విస్తరించాలని సూచించారు. వైద్య భీమా అమలైతే 5.02 కోట్ల మందికి ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు.పతి గ్రామంలో 'ఆరోగ్య రథం' ద్వారా సంచార వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. 108 వాహనాల సిబ్బందికి యూనిఫాం అమల్లోకి తేవాలన్నారు.

## ఢిల్లీలో ఘోరం..

## భార్యను కాపురానికి పంపనందుకు మామను పెట్రోల్‌పోసి కాల్చి చంపిన అల్లుడు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోరం వెలుగు చూసింది. తనతో గొడవపడి పుట్టింటికి వెళ్లిన భార్యను కాపురానికి ప ంపనందుకు ఆగ్రహించిన ఓ యువకుడు తన మామపై పెట్రోల్ పోసి కాల్చి చంపాడు. వివరాలు ఇలావున్నాయి. ఢిల్లీలోని ఘాజీపూర్‌కు చెందిన ని షా, సందీప్ దంపతుల మధ్య గొడవ జరగడంతో ఈ నెల 15వ తేదీన నిషా భర్తపై అలిగి పుట్టింటికి వచ్చేసింది. దీని తరువాత కొన్నిరోజుల పాటు సందీప్ అత్తవారింటికి వెళ్లలేదు. సోమవారం నాడు సందీప్ తన భార్యను తీసుకువెళ్లేందుకు అత్తగారింటికి వెళ్లగా మామ రణ్‌వీర్ సింగ్ గొడవపడ్డా డు. ఇదికాస్త పెద్దదిగా మారడంతో సందీప్ ఆగ్రహంతో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను మామపై పోసి నిప్పంటించాడు. దీని తరువాత సందీప్ పారి పోగా కుటుంబసభ్యులు రణ్‌వీర్‌సింగ్‌ను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న సమయంలో రణ్‌వీర్ సింగ్ పోలీసుల కు మరణ వాంగ్మూలం ఇస్తూ తన అల్లుడే తనను హత్య చేసినట్లు చెప్పి కన్నుమూ శాడు. దీనిపై కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు సందీప్‌ను అరెస్టు చేశారు.

# ఆత్మనిర్భరత దిశగా ఐఎన్ఎస్ ఉదయగిరి, హిమగిరి

## రెండు దేశీయ యుద్ధనౌకలను జాతికి అంకితం చేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

### ఈ నౌకలతో భద్రతా వ్యవస్థ బలోపేతం

### మన నావికాదళ సామర్థ్యం మరింత పెరిగింది: రాజ్‌నాథ్





మంగళవారం విశాఖపట్నంలో ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరిని జాతికి అంకితం చేస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**విశాఖపట్నం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్ ఇంకా మిగిలిలేఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సోమవారం ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరి జాతికి అంకితం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయుధాలు, టెక్నాలజీతో కూడిన ఈ నౌకలు, సముద్ర కార్యకలాపాల యొక్క పూర్తిస్పెక్ట్రంలో జాతీయ ప్రయోజనాలను పరిరక్షి ంచే ఇంకా తయారు చేయబడ్డాయని చెప్పారు. నావికాదళ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయి అన్నారు. "ఆత్మనిర్భరత ఇకపై కేవలం నినాదం కాదు అని, అది భూమి వాస్తవికతగా మారుతోంది అని భవిష్యత్ దృక్పథంలో సాయుధ దళాలను బలోపేతం చేస్తామన్నారు. స్వదేశీ ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ కంబాటెంట్‌లను ఒకేసారి ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి అని చెప్పారు. ఈ యుద్ధనౌకలు భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సముద్ర ప్రయోజనాలను కాపాడటమే కాకుండా, మానవతా సహాయం విపత్తు సహాయ కార్యకలా పాలలో కూడా సహాయపడతాయని రక్షణ మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశం యొక్క మహాసాగర్ (ప్రాంతంలోని అందరికీ భద్రత, వృద్ధి కోసం పరస్పర సమగ్ర పురోగతి) విధానాన్ని ఈ కమిషన్ బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. "భారత నావికాదళ సామర్థ్యాన్ని పెంచే ఈ యుద్ధనౌకలు, భారతదేశం తన సముద్ర సరిహద్దులను రక్షి ంచుకోగల పూర్తి సామర్థ్యాన్ని కలిగి ఉందని ఏదైనా పరిస్థితికి వెంటనే స్పందించడానికి సిద్ధంగా ఉందని సందేశాన్ని పంపుతాయి" అని ఆయన అన్నారు.

ఆత్మనిర్భర్ నావికాదళం ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరి ప్రాజెక్ట్ 17 (శివాలిక్ తరగతి) యొక్క సక్సెసర్ క్లాస్ యొక్క లీడ్ షిప్ అయిన ఐఎన్ఎస్ నీలగిరిని అనుసరిస్తాయి అని చెప్పారు. అవి మెరుగైన స్టెల్త్ ఫీచర్లు, తగ్గించబడిన రాడార్ సంతకాలు, అధునాతన నిఘా రాడార్లు ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్‌లు, సూపర్‌సోనిక్ ఉపరితలం నుండి ఉపరితలం క్షి పణులు, ఉపరితలం నుండి గాలికి క్షి పణులు, రాపిడ్ ఫైర్ గన్ సిస్టమ్‌లను కలిగి ఉంటాయి అన్నారు. రెండు నౌకలలో కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ ప్రొపల్షన్ ప్లాంట్లు అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉన్నాయి, ఇవి అధిక వేగం మరియు మెరుగైన ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. భారత నావికాదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరోద్వారా అంతర్గతంగారూపొందించిన 100,101వ యుద్ధనౌకలుగా భారతదేశంలో నిర్మించ బడ్డాయి అని, ఇది స్వదేశీ కంటెంట్ స్వావలంబనను పెంచడానికి నేవీ యొక్క నిరంతర కృషిని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కన్న ఆత్మనిర్భర్ భారత్ కల సాకారం వైపు ఒక పెద్ద ముంద డుగు అని చెప్పారు. ప్రభుత్వ దార్శనికత నిబద్ధతకు నిదర్శనంగా రక్షణ మంత్రి అభివర్ణించారు. "ఐఎన్ఎస్ ఉదయగిరి ఐఎన్ఎస్ హిమగిరి ప్రభుత్వ స్వావలంబనపట్ల దృఢసంకల్పానికి ప్రకాశవంత మైనదిగా అభివర్ణిం చారు. బ్లూ వాటర్ నేవీ మల్టీమిషన్ ఫ్రిగేట్‌లు కీలకమైనకార్యాచరణ సహాయకులు, ఇవి సముద్ర కార్యకలా పాల యొక్క పూర్తి స్పెక్ట్రంలో జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే నావికాదళ సామర్థ్యాన్ని

## టిడిఆర్ బాండ్ల స్కాంలో సీనియర్ ఐఎఎస్ అధికారిణి హస్తం

## ఆమె వేల కోట్లు దోచుకున్నారు..

### వైఎస్సార్సీ నేత భూమన సంచలన ఆరోపణలు



**తిరుపతి,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో సీనియర్ ఐఎఎస్ అధికారిణి ప్రమేయం ఉందని, ఆమె వేలకోట్లు దోచుకున్న అవినీతి అనకొండ అంటూ వైఎస్సార్సీ ఉమ్మడిచిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి సంచలనవ్యాఖ్యలు చేశారు. టిడిఆర్ బాండ్ల విషయంలో ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు, రెండేళ్లుగా తన మనసులో ఉన్న అభిప్రాయాన్ని ఇప్పుడు బయటపెడుతున్నానని భూమన మంగళావారం స్పష్టం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పనిచేసిన సదరు ఐఎఎస్ అధికారిణికి డబ్బుసంపాదించాలనే ఆశయం తప్ప నైతిక విలువలు లేవని ఆరోపణలు చేశారు. ఆమె శాఖకు సంబంధించిన మంత్రులను సైతం ఆమె కనీసం లెక్కచేయలేదని, క్రింది స్థాయి అధికారుల పట్ల తాటకిలా వ్యవహరించారని తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేస్తున్న సమయంలో టిడిఆర్ బాండ్ల ద్వారా భారీగా దోచుకోవాలని ఆమె ప్రణాళిక వేశారని, అయితే తాము దానిని అడ్డుకున్నామని భూమన వెల్లడించారు. ఈ విషయం తట్టుకోలేక సదరు అధికారిణి నెల్లూరు జిల్లా నేతలకు తప్పుడు సమాచారం అందించి, తాను 2వేల కోట్లు దోచుకున్నాననంటూ అబద్ధపు ప్రచారం చేయించారని భూమన గద్గద స్వరంతో ఆరోపించారు. తాను ఒక్కరూపాయి అవినీతికి పాల్పడినట్లు నిరూపించినా ఎలాంటి శిక్షకైనా సిద్ధమని ఆయన సవాల్‌విసిరారు. ఆమె 35ఏళ్ల సర్వీసులో ఎక్కడ పనిచేసినా వందల, వేలకోట్లు రూపాయలు లూటీ చేశారని, ఆమె అవినీతి గురించి సుప్రీం కోర్టుకు కూడా తెలుసని భూమన వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. ఆ ఐఎఎస్ అధికారిణి రోజూ ధరించే చీర 1.50లక్షలు రూపాయలు విలువ చేస్తుందని, వేలరూపాయలు విలువచేసే 11విగ్గులు ఆమె వద్ద ఉన్నాయని వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నీతిగా నిజాయితీగా ఉన్న తనపై కక్షగట్టి కుట్రపూరితంగా అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలో 21 మాస్టర్‌ప్లాన్ రోడ్లువేసి అభివృద్ధిచేశామనేది సత్యమని కరుణాకర్‌రెడ్డి గుర్తుచేశారు.

**బిజెపి భాను ఖండన:**

కాగా భూమన వ్యాఖ్యలను టిటిడి బోర్డుసభ్యుడు, బిజెపిరాష్ట్ర అధికారప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి ఖండించారు. మహిళ ఐఎఎస్ అధికారిణిని విమర్శిస్తూ కరుణాకర్‌రెడ్డి వీడియో విడుదల చేయడం దారుణమన్నారు. టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో ఆమె పాత్ర ఉందంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. కరుణాకర్‌రెడ్డి రాజకీయ నిరుద్యోగిగా మారారని, ఆయన ఎన్నికల్లో ఓటమిపాలైన తరూవాత మానసిక పరిస్థితి సరిగా లేనట్లుందని ఘాటుగా వ్యాఖ్యనించారు. ఆమెపై ఆయన అనుచిత పదజాలంతో విరుచుకుపడటం భాను తీవ్రంగా తప్పుపట్టారు.

## తిరుపతి నుంచి భూమనను తరిమి కొట్టండి

### శ్రీవారి ధనం కోట్లు దోచేశాడు

### దేవలోక్ స్థలాన్ని వెనక్కి తీసుకుంటాం

### టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు ఘాటు వ్యాఖ్యలు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటానికి అంకిత భావంతో, చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, టిటిడిపై దుష్ప్రచారం, బురదజల్లడమే పనిగా పెట్టు కున్న వైఎస్సార్సీ నేత, టిటిడి మాజీఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుపతి నుండి తరిమికొట్టాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో టిటిడి ఛైర్మన్‌గా పని చేసిన భూమన కోట్లాదిరూపాయలు టిటిడి ధనాన్ని దోచేశాడని, పలురకాలుగాకమీషన్లు నొక్కేశారని ఘాటైన వ్యాఖ్యలుచేశారు. ఆధ్యా త్మిక నమూనాల నిర్మాణాలకోసం అలిపిరివద్ద దేవలోక్‌కు స్థలాన్ని కేటాయించారని, తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ఒబెరాయ్ హోటల్‌కు స్థలాన్ని కేటాయించింది గత వైఎస్సా ర్సీనే అని విమర్శించారు. ముంతాజ్‌హోటల్ వ్యవహారంపై భూమన చేసిన వ్యాఖ్యలపై మంగళవారం సాయంత్రం తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు మాట్లాడుతూ భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతిలో ఉండే అర్హత లేదని, ఆయన్ను తిరుపతి నుండి తరిమికొట్టాలన్నారు. ప్రతిరోజూ టిటిడిపై బురదజల్లడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. టిటిడిపై బుదరజల్లితే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. ఆధ్యాత్మిక నమూనాల నిర్మాణాల కోసమే దేవలోక్‌కు స్థలాన్ని కేటాయించారన్నారు. 2024 నవంబర్ 18న టిటిడి బోర్డు సమావేశంలో ఒబెరాయ్‌కు కేటాయించిన స్థలాన్ని వెనక్కుతీసుకోవాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఛైర్మన్ తెలిపారు. భూమికి బదులు భూమి ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఒబెరాయ్ హోటల్‌కు ప్రస్తుతం అలిపిరి జూపార్కురోడ్డులో దక్షిణవైపు స్థలాన్ని కేటాయించామని తెలిపారు. ఉత్తరదిక్కున వద్దని సిఎం చెప్పడమేగాక ఆధ్యాత్మికపుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడేందుకు చూస్తున్నామన్నారు. ఈ విషయంలో భూమన ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నాడని ఆరోపించారు. సిబిఐ విచారణ అని చెప్పడానికి భూమనకు సిగ్గులేదన్నారు. కోట్లురూపాయలు టిటిడి ధనాన్ని నొక్కేసిన ఘనుడు భూమన అని ఆరోపించారు.దేవలోక్ నిర్మాణం కోసం స్థలాన్ని లీజుకు తీసుకున్న అజయ్‌కుమార్‌ను జగన్ తాడేపల్లికి పిలిపించి గన్‌పెట్టి బెదిరించారని మరో సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవలోక్‌కు కేటాయించిన 10 ఎకరాల స్థలాన్నివెనక్కు తీసుకుంటామన్నారు. తిరుమల పవిత్రతకు ఎక్కడా భంగం వాటిల్లకుండా కూటమి ప్రభుత్వం, టిటిడి ధర్మకర్తలమండలి చూస్తుందన్నారు. తిరుమలలో ముంతాజ్ హోటల్ నిర్మాణం సరైంది కాదని సిఎం చంద్రబాబు తెలిపారన్నారు. గత ఏడాదిలో టిటిడిలో అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తున్నామన్నారు.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు

### రెండువర్గాలుగా విడిపోయిన రిటైర్డ్ జడ్జీలు

### ఇది న్యాయవ్యవస్థపై దాడి అంటూ 18 మంది జడ్జీల అభ్యంతరం

### నక్సల్ మద్దతుదారుడిని కాదని స్పష్టం చేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 26:** ఉపరాష్ట్రపతి ఎన్నికల పోరు రాజకీయ, న్యాయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. విపక్షాల ఉమ్మడి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి గతంలో ఇచ్చిన ఒక తీర్పును ఉటంకిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కొత్త వివాదానికి కేంద్ర బిందువుగా మారాయి. ఈ వ్యాఖ్యలపై రిటైర్డ్ న్యాయమూర్తులు రెండు వర్గాలుగా విడిపోయి భిన్న వాదనలు వినిపిస్తుండటంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఇటీవల కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ, 2011లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇచ్చిన సల్వా జుడుం తీర్పు ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజంపై పోరాటాన్ని బలహీనపరిచిందని ఆరోపించారు. ఆ తీర్పు నక్సల్ భావజాలంతో ప్రభావితమై ఇచ్చారని, ఒకవేళ ఆ తీర్పు లేకపోయి ఉంటే 2020 నాటికే దేశంలో నక్సలిజం అంతమై ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం 18 మంది రిటైర్డ్ జడ్జీలు ఒక లేఖ విడుదల చేశారు. ఇందులో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు కురియన్ జోసెఫ్, మదన్ బి. లోకూర్ వంటి ప్రముఖులు ఉన్నారు. షా వ్యాఖ్యలు సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించడమేనని, ఇది న్యాయవ్యవస్థ స్వాతంత్రంపై దాడి అని వారు పేర్కొన్నారు. సాల్వా జుడుం తీర్పు నక్సలిజానికి మద్దతు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కాగా, ఈ వాదనతో 50 మంది రిటైర్డ్ జడ్జీల బృందం విభేదించింది. మంగళవారం వీరు విడుదల చేసిన లేఖలో, 18 మంది జడ్జీల వైఖరిని తప్పుబట్టారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రాజకీయ అభ్యర్థిగా బరిలోకి దిగినప్పుడు, ఆయన గత తీర్పులపై రాజకీయ విమర్శలు రావడం సహజమని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లోకి వచ్చాక న్యాయవ్యవస్థ స్వతంత్రం పేరుతో విమర్శల నుంచి తప్పించుకోలేరని, అలాంటి విమర్శలను అడ్డుకోవడం భావప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమేనని వారు పేర్కొన్నారు. ఈ మొత్తం వివాదంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కూడా స్పందించారు. తాను నక్సల్ మద్దతుదారుడిని కాదని, మావోయిస్టులకు అనుకూలంగా తీర్పు ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. తన తీర్పు నిజంగా నక్సలిజానికి మద్దతిచ్చేలా ఉంటే, ఇన్నేళ్లలో దానిని ఎవరూ ఎందుకు సవాలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలు హుందాగా జరగాలని, వ్యక్తిగత దాడులు సరికాదని ఆయన హితవు పలికారు. కాగా, సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో విపక్షాల అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో తలపడనున్నారు. ఈ నేపథ్యంలో చెలరేగిన ఈ వివాదం ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# ఓట్లు చోరీ చేస్తే ఎన్నేళ్లైనా అధికారంలో ఉండొచ్చు..

### బీహార్‌లో అమిత్‌షాపై రాహుల్‌గాంధీ తీవ్రవిమర్శలు

### రాహుల్, ప్రియాంకతో కలిసి యాత్రలో పాల్గొన్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 26:** ఓట్ల చోరీ ఆరోపణలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొనసాగిస్తున్నారు. ఓట్ల చోరీకి పాల్పడితే ఎన్నేళ్లయినా అధికారంలో ఉండొచ్చని తాజాగా ఆయన బీజేపీ (తీరిశి), కేంద్ర మంత్రి అమిత్‌షాపై విమర్శలు కురిపించారు. దశాబ్దాలపాటు అధికారంలో ఉంటామని బీజేపీ ప్రకటించుకోవడానికి ఓట్ల చోరీతో సంబంధం ఉందని తాజాగా ఆరోపించారు. తమ పార్టీ 40,50 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని అమిత్‌షా చేసిన వ్యాఖ్యల వెనుక అసలు నిజం బయటపడిందన్నారు. ఓటర్ అధికార్ యాత్రఖిలో భాగంగా బిహార్‌లోని మధుబనిలో మంగళవారం నాడు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 40,50 ఏళ్ల అధికారంలో ఉంటుందని అమిత్‌షా చాలాసార్లు చెప్పారు. ఇన్నేళ్ల అధికారంలో ఉంటామనే విషయం ఆయనకు ఎలా తెలుసునని ఆలోచించే వాడిని. దీని వెనుక అసలు నిజం ఏమిటో ఈరోజు దేశ ప్రజలకు తెలిసింది. వాళ్లు (బీజేపీ) ఓట్ల చోరీ చేస్తున్నారు. ఇది గుజరాత్‌లో మొదలైంది. ఆ తర్వాత అది 2014లో జాతీయ స్థాయికి తెచ్చారు. ఆ తర్వాత ఇతర రాష్ట్రాల వరకూ వచ్చింది అని రాహుల్ విమర్శించారు. సాక్ష్యాలు ఉన్నప్పుడు మాత్రమే తాను స్టేట్‌మెంట్లు ఇస్తానని రాహుల్ అన్నారు. తాను అబద్ధాలు చెప్పనని, వాస్తవాలు తన ముందు ఉన్నప్పుడే ఆ విషయాల గురించి మాట్లాడతానని చెప్పారు. బిహార్ యువకులు పెద్దఎత్తున తమ సత్తా చాటుకున్నప్పుడే బీజేపీ నాయకత్వం, ఎన్నికల కమిషన్ ఓట్ల చోరీకి ముందు ఒకటి రెండుసార్లు ఆలోచిస్తాయని అన్నారు. దశల వారీగా పౌరుల హక్కులకు కేంద్ర ప్రభుత్వం గండికొడుతోందని.. మొదట ఓటు, ఆ తర్వాత రేషన్ కార్డు, ఆ తర్వాత భూములు... ఇలా పౌరుల హక్కులను లాక్కుంటోందని, అయితే విపక్షాలు దీనిని ఎంతమాత్రం కొనసాగనీయమని రాహుల్ అన్నారు.

**ప్రియాంక నోట కూడా అదే మాట..**

ఓటర్ అధికార్ యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సైతం ఓట్ల చోరీపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మీ జీవనోపాధికి అవసరమైన గేదెలు కూడా చోరీ చేస్తుందని లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ఆరోపించారని, కానీ ఇప్పుడు మోదీనే మీ ఓటును చోరీ చేస్తున్నారని ప్రియాంక అన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటింగ్ పునాదని, అది ప్రజలకు విలువైన హక్కు అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఉద్యోగాలు, పీఎస్‌యూలను ప్రజల నుంచి దోచుకుందని, ఓట్లు కూడా ఎత్తుకు పోయేందుకు ప్రజలు వెసులుబాటు కలిగిస్తే ఇక ప్రజల ఉనికే ప్రశ్నార్థకమ వుతుందని, ప్రజల హక్కులతో పాటు పౌరసత్వాన్ని కూడా వాళ్లు ఎత్తుకెళ్లిపోతారని విమర్శించారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ బిహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు మద్దతు తెలిపారు. మంగళవారం బిహార్‌కు వెళ్లి ఓటర్ అధికార్ యాత్రలో పాల్గొన్నారు. ఈ యాత్రలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## గంటల్లోనే జలమండలి కార్మికుల సమస్యలకు పరిష్కారం

### జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో జాయింట్ ఆక్షన్ కమిటీ

### జెఎసి, ఐఎన్‌టియుసి తరపున మధుయాష్కి భేటీ

### కార్మికుల ఒటి చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ

### హర్షం వ్యక్తం చేసిన కార్మికులు



**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** జలమండలి కార్మికులకు రావాల్సిన ఓటికి సంబంధించిన నిధులు గంటల వ్యవధిలోనే పరిష్కారం అయింది. టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపి, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూని యన్ గౌరవ అధ్యక్షులు మధుయాష్కి గౌడ్ జలమండలి ఎండి అశోక్ రెడ్డితో సమావేశమై ఓటి సమస్య పరిష్కరించాలని సూచించారు. దీనిపై స్పందించిన ఎండి వెంటనే తగు ఉత్తర్వులు జారీ చేయించారు.ఐఎన్‌టియుసి అనుబంధ జలమండలి ఉద్యోగ సంఘాల తరపున మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐఎన్‌టియుసి నేత మొగుళ్ళ రాజిరెడ్డితో కలిసి మధుయాష్కి గౌడ్ ఈరోజు జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జలమండలి ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా కార్మికుల ఓటి అల వెన్సులు తక్షణమే విడు దల చేయాలని ఎండిని కోరారు దీనిపై స్పందించిన ఎండి అశోక్ రెడ్డి ఫైనాన్స్ విభాగం అధికారులతో వెంటనే మాట్లాడి, జులై వరకు బకాయి ఉన్న ఓటి అలవెన్సులను విడుదల చేయాలని ఆదేశించారు. తరువాత మధుయాష్కి జలమండలి ఫైనాన్స్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతిని కూడా కలిసి కార్మికుల ఓటి అలవెన్సులను వెంటనే విడుదల చేయాలని సూచించారు. దీనికి స్పందించిన పద్మావతి తక్షణమే ఓటి అలవెన్సులు విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో రెండు గంటల వ్యవధిలోనే వేలాది జల మండలి కార్మికుల సమస్య తీరడంతో కార్మి కులందరూ వర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ జలమండలి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు తమకు తెలుసని వాటిని చిత్త శుద్ధితో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షా కాలంలో 24/7 పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కష్టపడుతున్న కార్మికులకు ఓటి అలవెన్స్ అందడంలో ఆలస్యం జరగకూడదు అన్నారు. ఇకనుంచి ప్రతి నెల 10వ తేది లోపు ఓటి అలవెన్సు లిస్టు పంపిస్తే 15వ తేది వరకు అలవెన్సు కార్మికులకు అందుతా యని పేర్కొన్నారు. త్వరలో యూనియన్ ఎన్నికల పైనా తగు నిర్ణయం తీసుకునేలా మాట్లాడు తామన్నారు. ఉద్యోగులు కార్మికుల సమస్యలపై సిఎం దృష్టికి కూడా తీసుకెళ్లి పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎంప్లాయిస్ యూని యన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజు, అల్లి శ్రవాన్ కుమార్, ఎండీ జాంగిర్, బి.దేవేందర్, సైద్ అక్తర్ అలీ, బి.నర్సింగ్ రావు, బి.జయ్ రాజ్, బి.మహేష్ బి. సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి నాటికి అందుబాటులోకి విజయవాడ పశ్చిమ బైపాస్!

**విజయవాడ, ఆగస్టు 26, ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరానికి సునాయాసంగా చేరుకోవడానికి వీలుగా నిర్మిస్తున్న పశ్చిమ బైపాస్‌పై రోడ్డుపై వచ్చే ఏడాది జనవరి నాటిరి పూర్తిస్థాయిలో వాహనాలను అనుమతించ నున్నారు.ఇప్పటికే ఈ రహదారిపై కొంత మేరకు అవసర సమయాల్లో వాహనాలను అనుమతిస్తున్నారు.ఈ రహదారిని పూర్తిగా వినియోగంలోకి తీసుకుని వచ్చేందుకు వీలుగా మిగిలిన చిన్న పాటి పనులు ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. మొత్తంగా విజయవాడ పశ్చిమ బైపాస్‌లో ప్యాకేజీ1లో భాగంగా గుండుగొలనుకలపర్రు, ప్యాకేజీ2లో కలపర్రుచినఆవుటపల్లి వరకూ బైపాస్ నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ప్యాకేజీ3లో చినఆవుటపల్లి గొల్లపూడి, ప్యాకేజీ4లో గొల్లపూడికాజ వరకు జరగాల్సి న నిర్మాణ పనులకు సంబంధించిన అడ్డంకులు దాదాపు పూర్తి చేశారు. దీంతో జనవరి నాటికి విజయవాడ పశ్చిమ బైపాస్‌రోడ్డుపై ప్రయాణం మొదలవుతుందనే దీమాతో అధికార యంత్రాంగం ఉంది.ప్యాకేజీ3లో హైటెన్షన్ టవర్ల మార్పిడి అంశంపై వారం రోజుల్లో స్పష్టత వస్తుందం టున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్16పై కాజ దగ్గర వెస్ట్ బైపాస్ ల్యాండింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.కీలకంగా ప్యాకేజీ ల్యాండింగ్ పనులు సాగుతున్నాయి. విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే వారు అనుసంధాన ప్రాంతానికి రాకుండా నేరుగా సర్వీస్ రోడ్డు నుంచి మళ్లించి 100 మీటర్ల దూరం తర్వాత హైవే ఎక్కించారు. ఈ పనులు పూర్తి చేసిన తర్వాత గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను కూడా ఇదే విధంగా డైవర్ట్ చేయనున్నారు. అనుసంధానం చేస్తున్న ప్రాంతంలో సర్వీస్ రోడ్డులను వేరు చేస్తూ, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు 230 మీటర్ల రక్షణ గోడ నిర్మాణం చేపట్టనున్నారుబైపాస్ నుంచి వచ్చే వాహనాలు నేరుగా ఎన్‌హెచ్ 16 మీదకు వెళ్లిపోతాయి. బైపాస్ నుంచి విజయవాడ వెళ్లే వారు యూటర్న్ తిరిగేందుకు వీలుగా, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు మరో 2 లేన్ల రోడ్డు నిర్మిస్తారు.

# ఈ సినిమా చేసినందుకు గర్వపడుతున్నాను

హీరో నారా రోహిత్ మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఎస్‌పిపి) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు.వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.




టీజర్, పాటలు, ట్రైలర్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో నారా రోహిత్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**సుందరకాండ భైరవం కంటే ముందే స్టార్ట్ అయిందా?**

## చూస్తున్నంతసేపు ఆడియన్స్ నవ్వుతూ ఉంటారు

నిజానికి కం బ్యాక్ సుందరకాండతోనే చేయాలి. 2022 లోనే ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ స్టార్ట్ చేశాము. ఈ సినిమా చూస్తున్నంత సేపు ఆడియన్స్ ఫేస్ లో ఒక స్మైల్ ఉంటుంది. లైటర్ వెన్ లో చాలా లైవ్లీగా మంచి ఫన్ తో ఉంటుంది.

**సీరియస్ పాత్రలు చేశారు..మళ్లీ నవ్వించే క్యారెక్టర్ చేస్తున్నారు ఎలా అనిపిస్తోంది?**

ఈ క్యారెక్టర్‌ని చాలా ఎంజాయ్ చేశాను. సుందరకాండ చాలా క్లీన్ ఫిలిం. సీన్స్ ట్రీట్మెంట్ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యేసినిమా.

**ఇది ఏజ్ గ్యాప్ లవ్ స్టోరీ నా?**

ఈ ప్రేమ కథలో ఉన్న కాన్ఫ్లిక్ట్ ఇప్పుడే చెప్పలేను. **డైరెక్టర్ వెంకటేష్ గురించి ?** వెంకటేష్ ఏ కథ అనుకున్నాడో ఆ కథని అద్భుతంగా స్క్రీన్ మీద ట్రాన్స్లేట్ చేశాడు. తను చాలా సెన్సిబుల్ డైరెక్టర్.

**నరేష్ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది ?**

ఆయన చాలా అనుభవంఉన్ననటుడు. ఏ పాత్రనైనా చాలా అద్భుతంగాచేయగలరు.

**అనుపమ పరమేశ్వరన్** లేటెస్ట్ సూపర్ హిట్ 'పరదా'. సినిమా బండి ఫేమ్ డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించారు. ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ మేకర్స్ రాజ్, డికె మద్దతు ఇచ్చారు. దర్శన రాజేంద్రన్‌తో పాటు, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ దొంకడ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆగస్ట్ 22న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని థియేటర్స్‌లో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ థాంక్ యూ మీట్ నిర్వహించారు. ఇందులో



హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. తెలుగు సినిమాలో పరదా ఒక డేరింగ్ స్టెప్. ఇలాంటి కథని బిలీవ్ చేసి ప్రొడ్యూస్ చేసిన మా నిర్మాత విజయ్‌కి ముందుగా ధన్యవాదాలు. ఇలాంటి సినిమాని చేసినందుకు గర్వపడుతున్నాను.పరదా నా కెరీర్‌లో మోస్ట్‌ఫేవరెట్ ఫిలిం. కెరీర్‌లో బెస్ట్ పెర్ఫార్మన్స్ ఇచ్చానని రివ్యూస్ రావడం చాలా ఆనందంగా ఉంది. నేషనల్ మీడియా సినిమా గురించి చాలా అద్భుతంగా రాస్తున్నారు. ఈ సినిమా విషయంలో నేను ఎప్పటికీ గర్వపడుతూనే ఉంటాను. మంచి సినిమాని ప్రోత్సహించాలి అనుకునే వారు తప్పకుండా పరదా సినిమా చూడండి. డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ,ఈ సినిమాకి నేషనల్ వైడ్‌గా చాలా మంచి రివ్యూస్ వచ్చాయి. సినిమాకి సపోర్ట్ చేసిన రివ్యూ రైటర్స్ అందరికీ థాంక్యూ. ఇందులో కొన్ని తప్పులు గురించి కూడా రాశారు. వాటిని కూడా నేను యాక్సెప్ట్ చేస్తున్నాను. అయితే ఇందులో చాలా అద్భుతమైన కంటెంట్ ఉంది. సినిమా చూసిన వాళ్ళు చాలామంది అప్రిషియేట్ చేశారు. తప్పకుండా ఈ సినిమాకి తనకి నేషనల్ అవార్డు వస్తుందని నమ్మకంగా ఉన్నాను. తన కెరీర్ లోనే వన్ ఆఫ్ ది బెస్ట్ పెర్ఫార్మన్స్ ఇచ్చింది. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. నిర్మాత విజయ్ మాట్లాడుతూ,ఈ సినిమా మొదలైనప్పుడు ఎలాగున్నామో, ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత కూడా అంతే హ్యాపీగా ఉన్నాం. అది నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆడియన్స్ ఈ సినిమా చూసి వాళ్ళు ఇచ్చిన రివ్యూస్ చాలా జెన్యూన్‌గా అనిపించాయి. ఈ సందర్భంగా ఆడియన్స్‌కి అందరికి థాంక్యూ. ఈ సినిమా చాలా మంది అమ్మాయిల్ని అమ్మాయిల జీవితాన్ని గుర్తు చేసిందని ఒక పెద్దావిడ చెప్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. ఈ సినిమాకి చాలా మంచి అప్రిషియేషన్స్ వచ్చాయి. ఈ సినిమా గురించి అందరూ హానెస్ట్ గా రాయడం చాలా ఆనందంగా ఉంది. అందరూ ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను. అందరు కూడా ఈ సినిమాతో కనెక్ట్ అవుతారని నమ్మకం ఉంది.ఎడిటర్ ధర్మేంద్ర మాట్లాడుతూ, ఇలాంటి సినిమా చేయాలంటే నిర్మాతకి చాలా ధైర్యం కావాలి. అందుకు ముందుగా నిర్మాత విజయ్‌ని అభినందిస్తున్నాను. అనుపమ, సంగీత, దర్శన ఈ ప్రాజెక్టులో చేరడం వల్ల ఈ సినిమాకి చాలా ప్లస్ అయింది. రాయ్ మయూర్ సపోర్ట్‌కి కృతజ్ఞతలు. ప్రవీణ్ ఏ సినిమా చేసిన ఒక మంచి విజన్ తో చేస్తాడు. ఈ సినిమాకి ఆడియన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చాలా అద్భుతంగా ఉంది. ఈ సినిమాకి ఇంత మంచి రెస్పాన్స్ ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు. థాంక్‌యూ మీట్ లో పరదా యూనిట్ అందరూ పాల్గొన్నారు.

# 'బ్రహ్మాండ' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్...

మొట్ట మొదటిసారిగా ఒగ్గు కళాకారుల నేపథ్యం లో తెరకెక్కిన సినిమా ప్రస్తుతం తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో ఆధ్యాత్మిక కథలకు కూడా మంచి ఆదరణ లభిస్తుంది. ఒకవైపు పెద్ద సినిమాలు ఎలా అయితే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తున్నాయో, మరోవైపు చిన్న సినిమాలు చాలామంది హృదయాలను తాకుతున్నాయి. ఇక ప్రస్తుతం రాబోతున్న సినిమాలలో బ్రహ్మాండ సినిమా ఒకటి. ఈ సినిమా శుక్రవారం రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సినిమాలో నటి ఆమని ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.




నటి ఆమని మాట్లాడుతూ,బ్రహ్మాండ మూవీ తెలుగు ప్రేక్షకులకి ఓ కొత్త అనుభూతి అనుభూతిని ఇస్తుంది అని తెలిపారు. అలానే ఈ సినిమా గురించి మరిన్ని విషయాలను చెప్పారు నటి ఆమని. ఇంత మంచి సినిమా సినిమా డైరెక్ట్ చేసిన రాంబాబు మన మధ్య లేకపోవడం బాధకారం.

హీరో బన్నీ రాజు మాట్లాడుతూ,ఈ సినిమాలో నాది అద్భుతమైన పాత్ర. సినిమా నా కెరీర్‌లో గుర్తుండిపోతుంది. ఈ సినిమాను శుక్రవారం రిలీజ్ చేయబోతున్నాం. అందరూ చూసి ఆదరించండి. ముఖ్యంగా క్లైమాక్స్ ని మిస్ చేయకండి. అందమైన అనుభూతిని పొందుతారు. నిర్మాత దాసరి సురేష్ మాట్లాడుతూ, స్క్రిప్ట్ దశలో మేము అనుకున్నది అనుకున్నట్టుగా .. అంతకుమించి చిత్రీకరించా చిత్రీకరించాం. మా డైరెక్టర్ ఇప్పుడు మా మధ్య లేకపోవడం బాధకరం. ముఖ్యంగా ఆమనిబలగం జయరాం గారు కొమురక్క గార్ల సహకారం మేము మరవలేము అని చెప్పారు. నటీనటులు : ఆమని బలగం జయరాం కొమరక్క బన్నీ రాజు, కనీకావాధ్వ చత్రపతి శేఖర్ అమిత్, దిల్ రమేష్ ప్రసన్నకుమార్ దేవిశ్రీ కర్తానందం తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు నిర్మాత : దాసరి సురేష్ సహా నిర్మాత: దాసరి మమత , కథ స్క్రీన్ ప్లే దర్శకత్వం :రాంబాబు, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ : కాసుల కార్తీక్ ఎడిటింగ్ : ఎమ్మార్ వర్మ ,సంగీతం : వరికుప్పల .

# 'మిరాయ్' ట్రైలర్ ఆగస్టు 28న విడుదల



సూపర్ హీరో తేజ సజ్జా, మనోజ్ మంచు, కార్తీక్ ఘట్టమనేని, టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పాన్ ఇండియా ఫిల్మ్ 'మిరాయ్' ట్రైలర్ ఆగస్టు 28న రిలీజ్ సినిమా సెప్టెంబర్ 12న రిలీజ్. సూపర్ హీరో తేజ సజ్జా మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా సూపర్ హీరో విజువల్ వండర్ 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు.

ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, బిటిఎస్ వీడియో వైబ్ ఉంది సాంగ్ మ్యాసీవ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ట్రైలర్ ఆగస్టు 28న లాంచ్ చేయనున్నారు. హీరో, విలన్ పవర్ ఫుల్ గా కనిపించిన ట్రైలర్ పోస్టర్ అదిరిపోయింది. తేజ సూపర్ యోధాగా ఎనర్జీతో మెరుస్తున్న మ్యాజికల్ స్టిక్ తో కనిపించగా, మనోజ్ ఫెరోషియస్ బ్లాక్ స్వోర్డ్‌గా, భారీ ఖడ్గాన్ని పట్టుకుని ఎదురు నిలబడ్డాడు. ఈ పోస్టర్‌తో సినిమా మీద అంచనాలు నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళాయి.ఈ చిత్రంలో తేజ సజ్జ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, శ్రీయా శరణ్, జయరామ్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మిరాయ్ దర్శకత్వం వహించడమే కాకుండా, సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అలాగే స్క్రీన్‌ప్లేను కార్తీక్ స్వయంగా రూపొందించారు. మణిబాబు కరణం రచన, సంభాషణలకు కీలకంగా పని చేశారు. గౌర హరి సంగీతం, ఆర్ట్ డైరెక్టర్‌గా శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సుజిత్ కుమార్ కొల్లి పని చేస్తున్నారు.

ట్రైలర్ పోస్టర్ ద్వారా మేకర్స్ సినిమాను సెప్టెంబర్ 12న ఎనిమిది భాషల్లో 2డి, 3డి ఫార్మాట్లలో విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు.

# బ్యూటీఫుల్ ఎంటర్‌టైనర్ 'కన్యా కుమారి'



ఇంత మంచి సినిమాకి ఖచ్చితంగా సపోర్ట్ చేయాలనిపించింది. ఆడియన్స్ తప్పకుండా కనెక్ట్ అవుతారు: నిర్మాత బన్నీవాసు ప్రముఖ నటి మధుశాలిని ప్రెజెంటర్‌గా రూరల్ లవ్ స్టోరీ 'కనా కుమారి' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. రాడికల్ పిక్చర్స్ బ్యానర్‌పై సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. డైరెక్టర్ సృజన్ ఈ సినిమా చూడమని చాలా రోజులుగా అడిగారు.

తర్వాత మధు శాలిని ఈ సినిమా గురించి చెప్పారు. మధు శాలిని సినిమాలో సంపాదించి మళ్లీ సినిమాల్లోనే ఇన్వెస్ట్ చేయడం అనేది చాలా గొప్ప విషయం. కచ్చితంగా ఇలాంటి ఒక మంచి టీం కి సపోర్ట్ చేయాలని అనిపించింది. ఈ సినిమా చూశాను. చాలా హానెస్ట్ సినిమా. మంచి స్క్రీన్ ప్లే తో లైటర్ వెయిన్ ట్రీట్మెంట్ తో డైరెక్టర్ చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. పంట పొలాలతో ఒక ప్రేమ కథని ముడి పెడుతూ చెప్పడం అనేది నాకు చాలా నచ్చింది. సినిమా స్క్రీన్ ప్లే చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. గీత్ సైని చాలా అద్భుతంగా నటించింది. తన క్యారెక్టర్ గుర్తుండిపోతుంది. గీత్ సైని, శ్రీచరణ్ చాలా క్యూట్ గా కనిపించారు.

ఈ మధ్యకాలంలో నేను చూసిన బెస్ట్ పెయిర్ ఇది. ఈ సినిమాని సపోర్ట్ చేయడానికి థియేటర్లో రిలీజ్ చేస్తానని చెప్పడానికి మెయిన్ రీజన్ ఈ సినిమా నాకు చాలా నచ్చింది. చాలా హార్డ్ వర్క్ తో చేసిన సినిమా. సృజన్ ఈ సినిమా కోసం చాలా ఇన్వెస్ట్ చేశారు. ఇలాంటి సినిమాని సపోర్ట్ చేస్తున్న మధుకి ధన్యవాదములు. చాలా ఈ సినిమా నాకు నచ్చింది. ఇంత మంచి సినిమాకి హెల్ప్ చేయాలని సపోర్ట్ చేయాలని ముందుకు వచ్చాను. గత నాలుగు రోజులుగా ఈ సినిమాకి ఈ సినిమాని చూసి నాకు చాలా మంది ఫిలిం మేకర్స్ చాలా బాగుందని చెప్తున్నారు. డైరెక్టర్ సృజన్ మాట్లాడుతూ,ఈ సినిమా మొదలైనప్పుడే బన్నీ వాసు కి చూపిస్తే బాగుంటుందని అనుకున్నాను. కచ్చితంగా కథలోని కొత్తదనానికి ఆయన ప్రోత్సహిస్తారు అని నమ్మకం ఉండింది చాలాసార్లు ప్రయత్నించాను కానీ కుదరలేదు. లక్కీగా ఆ ప్రాసెస్ లో మధు వచ్చారు. మధు ద్వారా ఈ సినిమాని బన్నీ వాసుకి చూపించగలిగాము. ఆగస్టు 27న రిలీజ్ అవుతుంది అంటే కారణం బన్నీ వాస్ . ఆయన సపోర్ట్ వల్లే మేము రిలీజ్ చేయగలుగుతున్నాము. కంటెంట్ నమ్మి సినిమా తీశాము. బన్నీ వాసుకి ఈ సినిమా నచ్చడం ఆయన రిలీజ్ చేయడం మా మొదటి సక్సెస్ గా భావిస్తున్నాం. ఫ్రెష్ కంటెంట్ ఉంటుంది.ఆడియన్స్ అందరికి కచ్చితంగా నచ్చుతుందని భావిస్తున్నాం. మూవీ ప్రజెంటర్ మధుశాలిని మాట్లాడుతూ, ఈ సినిమా మీద నాకు చాలా నమ్మకం ఉంది. ఈ సినిమా చూసినప్పుడే నాకు కచ్చితంగా ఈ సినిమాని ప్రమోట్ చేయాలనిపించింది. డైరెక్టర్ ప్యాషన్ డెడికేషన్ ఆ జర్నీ అంత విన్న తర్వాత నేను ఈ మాత్రమైనా చేయకపోతే ఇండస్ట్రీలో ఉండి వృధా అనిపించింది. ఇంత మంచి సినిమాతో అసోసియేట్ కావడం, బన్నీ వాసు మాకు సపోర్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ అలరిస్తుంది.

# ఘనంగా 'మిస్టర్ రాము' మూవీ ఆడియో విడుదల



**బొంత రాము** హీరోగా నటిస్తున్న సినిమా "మిస్టర్ రాము". ఈ చిత్రంలో అజయ్ ఘోష్ విలన్ గా నటిస్తున్నారు. జబర్దస్త్ అప్పారావు మరో కీ రోల్ పోషించారు. ఈ చిత్రాన్ని రేణుక దేవి ఫిలింస్ బ్యానర్ పై బొంత రాము నిర్మించారు. అజయ్ కౌండిన్య దర్శకత్వం వహించారు. త్వరలో 'మిస్టర్ రాము' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ఆడియో రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనటుడు జబర్దస్త్ అప్పారావు మాట్లాడుతూ, మిస్టర్ రాము సినిమా ఆడియో ఫంక్షన్ కు వచ్చిన మీ అందరికీ థాంక్స్. ఆడియో రిలీజ్ ఈవెంట్ కి ఇంతమంది వచ్చారంటే మీరంతా సినిమాను తప్పకుండా సక్సెస్ చేస్తారని తెలుస్తోంది. డైరెక్టర్ అజయ్ కౌండిన్య నాకు బాగా పరిచయం. ఈ చిత్రంలో మంచి రోల్ చేసే అవకాశం ఇచ్చారు. మిస్టర్ రాము చిత్రంలో అజయ్ ఘోష్ ఇంపార్టెంట్ క్యారెక్టర్ లో నటించారు. ఈ సినిమాకు హృదయ్ ముగ్దల్ సూపర్ హిట్ మ్యూజిక్ అందించారు. చరణ్ కెమెరా పనితనం కూడా హైలైట్ అవుతుంది. మిస్టర్ రాము చిత్రాన్ని మీరంతా ఆదరించాలని కోరుకుంటున్నానని అన్నారు. ప్రొడ్యూసర్, హీరో బొంత రాము మాట్లాడుతూ, నాకు హీరోగా నటించాలని కల ఉండేది. దర్శకుడు అజయ్ కౌండిన్య నాకు ఈ సబ్జెక్ట్ చెప్పినప్పుడు కథ నచ్చి తప్పకుండా చేద్దామని ముందుకు వచ్చాను. ఈ చిత్రంలో ఆటో డ్రైవర్ రోల్ లో నటించాను. మిస్టర్ రాము తో పాటు నేను, డైరెక్టర్ అజయ్ కౌండిన్య కాంబినేషన్ లో మరో 9 చిత్రాలు చేయబోతున్నాం. మొత్తం మా కాంబినేషన్ లో 10 సినిమాలు రాబోతున్నాయి. మిస్టర్ రాము సినిమా రిలీజైన వెంటనే మా కొత్త సినిమాను ప్రకటిస్తాం..దర్శకుడు అజయ్ కౌండిన్య మాట్లాడుతూ, మిస్టర్ రాము సినిమాను మెసేజ్, ఎంటర్ టైన్ మెంట్ అంశాలు కలిపి రూపొందించాం. మా ప్రొడ్యూసర్ రాము ఈ చిత్రంలో హీరోగానూ నటించారు. ఆటో డ్రైవర్ క్యారెక్టర్ లో ఆయన నటన ఆకట్టుకుంటుంది. పుష్ప సినిమా విలన్ అజయ్ ఘోష్ మా మీద అభిమానంతో ఈ చిత్రంలో విలన్‌గా నటించారు. అలాగే జబర్దస్త్ అప్పారావు అడిగిన వెంటనే నటించేందుకు ఒప్పుకున్నారు. ఆస్పత్రిలో చిన్నపిల్లల కిడ్నాప్స్ నేపథ్యంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఈ సినిమా రూపకల్పన సమయంలో హీరో, ప్రొడ్యూసర్ రాము దగ్గర నుంచి ఎంతో సపోర్ట్ లభించింది.

# ప్రెసిడెంట్ వీరశంకర్ మీదుగా ఘనంగా 1990'ఎస్ మూవీ ట్రైలర్



..డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ చేతుల మీదుగా ఘనంగా 1990'ఎస్ మూవీ ట్రైలర్, సాంగ్స్ లాంఛ్, సెప్టెంబర్‌లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్న సినిమా..

అరుణ్ రాయదుర్గం, రాణివరదా హీరో హీరోయిన్లు గా నటిస్తున్న సినిమా "1990'ఎస్". ఈ చిత్రాన్ని మనసు మల్లిగే బ్యానర్ పై చంద్రశేఖర్.బి.ఎస్. నిర్మిస్తున్నారు. నందకుమార్. సి.ఎం. దర్శకత్వం వహిస్తున్నారు. 11990'ఎస్ సినిమా త్వరలో కన్నడ, తెలుగు, తమిళ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్, సాంగ్స్ లాంఛ్ ఈవెంట్ ను డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ చేతుల మీదుగా హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సినీ జర్నలిస్ట్ వినాయకరావు మాట్లాడుతూ 1990'ఎస్ సినిమా ట్రైలర్, సాంగ్స్ చాలా బాగున్నాయి. నూతన దర్శకుడైనా మూవీని బాగా రూపొందించాడు. కన్నడ నుంచి తెలుగులోకి వస్తున్న ఈ చిత్రానికి మన తెలుగు ఆడియెన్స్ ఆదరణ తప్పకుండా దక్కాలని కోరుకుంటున్నా. 1990'ఎస్ చిత్ర యూనిట్ కు నా బెస్ట్ విశెస్ చెబుతున్నా. అన్నారు.

ఈ మూవీ టీమ్ అందరికీ ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నాని అన్నారు. డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ మాట్లాడుతూ, ఈ రోజు నా బర్త్ డే అని తెలుసుకుని కేక్ కట్ చేయించి బర్త్ డే సెలబ్రేషన్స్ చేయడం హ్యాపీగా ఉంది. సినిమా మాత్రం మాస్ గా చేస్తూ చివరలో పొయెటిక్ టచ్ ఇవ్వడం ట్రైలర్‌లో ఆకట్టుకుంది.1990'ఎస్ టీమ్ డైరెక్టర్ నందు, హీరో వరుణ్, హీరోయిన్ రాణి వరదా, ప్రొడ్యూసర్ చంద్రశేఖర్,అందరికీ నా ఆల్ ది బెస్ట్ చెబుతున్నానని అన్నారు.పొడ్యూసర్ చంద్రశేఖర్ బి.ఎస్. మాట్లాడుతూ, సినిమా అంటే లెక్కలు వేసుకుని చేస్తారు. కానీ మేము 1990'ఎస్ చిత్రాన్ని లెక్కలు వేసుకుని చేయలేదు. ఒక ప్యాషన్ తో చేశాం. ప్యాషనేట్ టీమ్ ఈ సినిమాకు పనిచేసింది. నేను తెలుగువాడినే. కంటెంట్ ఉన్న మూవీస్ కు ఆదరణ దక్కుతున్న ట్రెండ్ చూస్తున్నాం. మేమూ 1990'ఎస్ చిత్రంలో అలాంటి మంచి కంటెంట్ తో వస్తున్నాం. మీ అందరి ఆదరణ దక్కుతుందని ఆశిస్తున్నామని అన్నారు. డైరెక్టర్ నందకుమార్ సి.ఎం. మాట్లాడుతూ మా మూవీ ట్రైలర్, సాంగ్స్ లాంఛ్ ఈవెంట్ కు వచ్చిన పెద్దలు అందరికీ ధన్యవాదములు.

సినిమా బాగుంటే తప్పకుండా తెలుగు ఆడియెన్స్ ఆదరిస్తారనే నమ్మకంతోనే 1990'ఎస్ చిత్రాన్ని మీ ముందుకు తీసుకొస్తున్నాం. మీరు సపోర్ట్ చేస్తేనే కొత్త వాళ్లమైన మేము ఇండస్ట్రీలో నిలబడగలం. మా మూవీ ట్రైలర్, సాంగ్స్ మిమ్మల్ని ఆకట్టుకున్నాయని ఆశిస్తున్నామని అన్నారు. హీరో అరుణ్ రాయదుర్గం మాట్లాడుతూ, మా మూవీని సపోర్ట్ చేస్తూ ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ ధన్యవాదాలు. 1990'ఎస్ సినిమా మిగతా వెర్షన్స్ కంటే తెలుగు బాగా వస్తుందని మా నమ్మకం. తెలుగులో మా మూవీ మిగతా అన్ని భాషల కంటే బాగా రీచ్ అవుతుందని ఆశిస్తున్నామని అన్నారు.హీరోయిన్ రాణి వరదా మాట్లాడుతూ , 1990'ఎస్ సినిమాతో మీ ముందుకు వస్తున్నాం. తెలుగు ఆడియెన్స్ మా టీమ్ ను సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాం.


# యాక్షన్ సీక్వెన్స్ తీయబోతున్న హాలీవుడ్ కొరియోగ్రాఫర్ జె.జె. పెర్రీ..



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టాక్సిక్' : ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ, యశ్ సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 'టాక్సిక్' మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాని హాలీవుడ్ స్థాయికి ధీటుగా తెరకెక్కిస్తున్నారు. అందుకే 'టాక్సిక్' టీం ఈ చిత్రంలోని యాక్షన్ సీక్వెన్స్ కోసం జాన్ విక్,ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్, షిఫ్ట్ వంటి హాలీవుడ్ చిత్రాలకు వర్క్ చేసిన టాప్ హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌నుజె.జె. పెర్రీని రంగంలోకి దించారు. హాలీవుడ్ టీంతో ఇప్పటి వరకు 'టాక్సిక్' లో అబ్బుర పరిచే యాక్షన్ సీక్వెన్స్‌లను జె.జె. పెర్రీ చిత్రీకరించారు. ఇప్పుడు జె.జె. పెర్రీ ఇండియన్ స్టంట్ టీంని తీసుకుని ముంబైలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ షెడ్యూల్‌ని ప్లాన్ చేశారు. 45 రోజుల పాటు సాగే ఈ సుదీర్ఘమైన షెడ్యూల్‌లో కేవలం ఇండియన్ స్టంట్ టీం మాత్రమే పని చేయనుంది. ఇండియన్ స్టంట్ టీం టాలెంట్ చూసి అబ్బురపడిన జె.జె. పెర్రీ తన టీంను పక్కన పెట్టారట. ఇంత వరకు హాలీవుడ్ టీంతోనే జె.జె. పెర్రీ పని చేయగా.. ఇప్పుడు 'టాక్సిక్' కోసం ఇండియన్ స్టంట్ టీంను తీసుకున్నారు. ఈ మేరకు జె.జె. పెర్రీ మాట్లాడుతూ,ఈ ఇండియన్ స్టంట్ టీం వరల్డ్ క్లాస్‌గా ఉంది. అందుకే నేను వారితో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాను. మేము ప్రస్తుతం ఒక కీలక సన్నివేశాన్ని చిత్రీకరించబోతోన్నాం. ఈ షెడ్యూల్ కోసం నేను చాలా ఉత్సాహంగా ఎదురుచూశాను. ఇది ఒక సవాల్‌లాంటిది. నాకు ఇలాంటి ఛాలెంజ్‌లు అంటే చాలా ఇష్టం. ఈ టీంతో కలిసి షెడ్యూల్‌ను పూర్తి చేయనున్నాను.

# 'మాస్ జాతర' చిత్రం వాయిదా

**కాస్త ఆలస్యమైనా** అసలుసిసలైన మాస్ పండుగను థియేటర్లలో తీసుకొస్తామని నిర్మాతలు హామీ



మాస్ మహారాజా రవితేజ అభిమానులతో పాటు, సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మాస్ జాతర' చిత్రం ఆగస్టు 27వ తేదీన థియేటర్లలో విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది.ఇటీవల పరిశ్రమ వ్యాప్తంగా జరిగిన సమ్మెలు, కీలకమైన కంటెంట్ పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా.. సినిమాను అనుకున్న తేదీకి సకాలంలో సిద్ధం చేయలేకపోయామని నిర్మాతలు అధికారికంగా తెలిపారు. కంగారుగా సినిమాని విడుదల చేయడం కంటే.. కాస్త సమయం తీసుకొని అత్యుత్తమ చిత్రంగా మలిచి, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు.మాస్ జాతార చిత్రాన్ని అసలైన పండుగ సినిమాగా తీర్చిదిద్దడానికి ప్రతి విభాగం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని నిర్మాతలు తెలిపారు. కొత్త విడుదల తేదీ ఇంకా ఖరారు కానప్పటికీ, త్వరలోనే ప్రకటన వస్తుందని పేర్కొన్నారు. అభిమానులు నిరీక్షణకు బహుమానంగా త్వరలో ఆశ్చర్యకర కంటెంట్ రాబోతుందని నిర్మాతలు హామీ ఇచ్చారు.




శ్రావణ భాద్రపద మాసాలు కురిపించిన వర్షంతో పుడమి తల్లి పలకరించి పురుడు పోసుకుంటుంది. అనేక వృక్ష జాతులు, పచ్చని ఆకులు పచ్చని చీర కట్టి ప్రకృతికి ప్రత్యేక సౌందర్యాన్ని సమకూర్చి అనేక లక్షల జీవరాశికి ఆహారం చేకూర్చే ఆహ్లాద కాలం భాద్రపధం. ఔషధాలు అందించే చక్కని సమయం. వెధకాలం మొదలుకొని, ఆధునిక సమకాలీన సాహితీవేత్త వరకు భూగోళం మొదలు, ఖగోళం వరకు విస్తరించిన నిత్య స్పూర్తి మూర్తి వినాయకుడు. చంద్రమాన భాద్రపధం నిజానికి సృష్టికి భాద్రపధం.

**తొండమునేక దంతమును**
**తోరపు బొజ్జయు, వామహస్థమూన్**
**మెండుగ మ్రోయు గజ్జలను మెల్లని**
**చూపులు మంద**
**హాసమున్**
**కొండొక గుజ్జు**
**రూపమున**
**కోరిన విద్యల**
**కెల్లా ఒజ్జయై**
**యుండెడి పార్వతీ తనయ !**
**ఓయి గణాదిపా!నీకు మ్రొక్కెదన్!**

ఇదంత తెలుగులో వినాయకుని సుగుణో పాసన. వినాయకుని కథ తెలియని వారు చాలా వరకు లేరనే చెప్పవచ్చు. కానీ కావలసింది కథ మాత్రమే కాకుండా అందులోని అంతరార్థం కూడా తెలిసి ఉండాలి. బ్రతుకంటే మంచి, చెడులు, కష్ట సుఖాలు,ఆనంద విచారాలు అన్నింటిని స్థిత ప్రజ్ఞతతో జీర్ణించుకొని విధంగా మనం వినాయకుని స్వరూపాన్ని అనేక రకాలుగా చెప్పుకోవచ్చు. గణపతి ఆవిర్భావం, రూపురేఖ విలాసాల గురించి అనేక పురాణేతిహాసాలు అనేక విధాలుగా వర్ణించినప్పటికి సకల శాస్త్రాలు ఆయనని పరబ్రహ్మ స్వరూపుడిగా భవిష్యత్తు బ్రహ్మగాను పేర్కొన్నాయి. సామాన్యులకు మాత్రం గణపతి విఘ్నసంహా రకుడు. ఆయనను స్తుతిస్తే సర్వ విఘ్నాలు ఉపశమి స్తాయి. అంతేకాదు ఆయన భక్త సులభుడు కూడా బంక మట్టిని తెచ్చి దానికి గణపతి రూపకల్పించి ప్రాణప్రతిష్ట చేసిన అనంతరం గరికతోటి రకరకాల ఆకులతో పూజించి, ఉండ్రాళ్ళను పండ్లను పానకం, వడపప్పు, కుడుములు నివేదించి అపరాధ క్షమాపణగా ఐదు గుంజిల్లు తీస్తే చాలు మన కోర్కెల న్నింటిని తీర్చే మహామూర్తి ఆ గణపతి. ఎవరు ఏ దేవతను ఆరాధించిన

# “శరణు శరణు గణాధిపతి”

ప్రతీకాత్మకంగా జీవించడమే సరైన జీవితం. వినాయకుని పుట్టుక చాలా చిత్రమైనది అనుకుంటే ఆకృతి అంతకన్నా విచిత్రమైంది. అయితేనేం ఎవరిని పూజించాలన్న ,ఈ కార్యం చేయాలన్న అగ్ర పూజ ఆయనదే. తల్లిదండ్రులను మించిన దైవం లేదని నిరూపించి విఘ్నాదిపత్యాన్ని చేజిక్కించుకున్న సూక్ష్మగ్రాహి గణేశ్వరుడు. తండ్రి లాగే ఈయన కూడా ఆయన ఆకారాన్ని కల్పించడం, పూజించడం ప్రసన్న చేసుకోవడం ఎంతో సులువు .దోసెడు మట్టి లేదా చిటికెడు పసుపు ఉంటే చాలు ప్రశాంతంగా పూజించుకొని నిండుగా నైవేద్యం పెట్టేయవచ్చు. సర్వ విఘ్నాలను ఉపశమింపజేసి వరాల వర్షం కురిపించే మహా ఉదార స్వభావం ఆ గణనాధుడిది. విగ్నేశ్వరుని ఓంకార స్వరూపుడని పిలుస్తారు.ఓంకారుడు ప్రణవ స్వరూపి,మానస పుత్రుడు, లంబోధరుడు.ప్రణ్నవ అనగా ఓంకారం,ఇది పుట్టిన పిదపే ప్రపంచం జీవరాశులు ఉధ్భవించాయి. అందుకే సృష్టికి శ్రీకారం ఓంకారం.అతని గజముఖము వక్రతుండము ప్రణవాన్ని స్మరింపజేస్తుంది. విగ్నేశ్వరుడు ,విఘ్నానానికి ప్రతినిధి.వివేకానికి ప్రతీక. విగ్నేశ్వరునికి పెద్ద చెవులు,గొడ్డలి,చిన్ననోరు, అభయ హస్తం,నాలుగు చేతులు ,పెద్ద ఉదరం,పెద్ద తల,చిన్న కళ్ళు,సర్పంతో కూడి న యజ్ఞోపవీతం కలవు.మనిషి ఏ ఏ స్వభావాలు కలిగి ఎలా ఉండాలి,అన్న విషయమును విగ్నేశ్వరుని లో ఒక్కొక్క అంగము స్పష్టంగా తెలియ జేస్తుంది.
విగ్నేశ్వరుడు,విఘ్నానానికి ప్రతినిధి. వివేకానికి ప్రతీక.విగ్నేశ్వరునికి పెద్ద చెవులు,గొడ్డలి,చిన్ననోరు,



అభయ హస్తం,నాలుగు చేతులు ,పెద్ద ఉదరం,పెద్ద తల,చిన్న కళ్ళు,సర్పంతో కూడిన యజ్ఞో పవీతం కలవు.మనిషి ఏ ఏ స్వభావాలు కలిగి ఎలా ఉండాలి, అన్న విషయమును విగ్నేశ్వరుని లో ఒక్కొక్క అంగము స్పష్టంగా తెలియజేస్తుంది. నాలుగు చేతులు,పై రెండు చేతులతో పాశం, అంకుశం కింద ఎడమ చేతిలో ఉండ్రాళ్ల పాత్ర,కుడి చేతిలో అభయ ముద్ర ఉంటాయి. చెవులు అంత పెద్దగా ఉండడానికి కారణం వ్యాస భారతాన్ని చెవులతో ఆలకించి తనదంతము పీకి చకచకా వ్రాసిన ఘనత వినాయకుడికి దక్కినది.అందుకే ఏ విషయమైనా చెవులతో పెద్దగా వినాలని పెద్దలు పిల్లలకు చెబుతారు.వినాయకుడి పెద్ద బొజ్జ ప్రపంచంలో మనిషి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని వానిని స్వీకరించి, జీర్ణించుకోవాలని అన్నదానికి తార్కాణం. వినాయ కుని తొండం నేలమీద చిన్న సుధీని సైతం అందుకోగలదు. అలాగే మహా వృక్షాన్ని కూడా పెకిలించగలదు.అందుచేత మనిషిలోని సామర్థ్యాన్ని పెంపొం దించుకోవాలని సూచిస్తుంది వినాయకుని తొండం. మనిషి తనలోని ఇష్టాఇష్టాలను సర్దుకొని పోయి సంతోషంగా ఉండాలని తెలియజేస్తుంది వినాయకుని దంతం. ఎలుక పై విహారం అనేది అజ్ఞానం పై విజయ విహారం చేయడం అని అర్థం.ఈ ముందుగా కొలిచెది మాత్రం గణపతినే. అందుకే ఆయనను తొలి దైవం అన్నారు. గణపతిని విఘ్నాలు తొలగి పోయేందుకు ఆరాధించడం వేధకాలం నుండి వస్తున్న సంప్రదాయం. సమస్త కార్యాలకు ప్రారంభంలో వినాయక పూజ చేసినట్లయితే ఫలం చేకూరుతుందని మన విశ్వాసం.“విగతోనాయకః వినాయక”, అంటే నాయకుడు లేని సర్వ స్వతంత్రుడు, ప్రథమ ఘనాలకే కాదు మానవ శరీరంలో ములాధార స్థానానికి అధిపతి గణపతే. 21 సంఖ్య గణపతికి ఇష్టమైన సంఖ్య. “ఏకవింశతి” పాత్రములతో అనగా 21 పత్రములన్ని ఆయుర్వేద ఔషద గుణాలు కలిగి ఉండటం విశేషం. ఆ 21 పత్రాలు తులసీ పత్రం,విష్ణుక్రాంత పత్రం, దేవదారు పత్రం,బిల్వ పత్రం, దుర్వారాయుగ్మమ్,శమి పత్రం ,అశ్వత్త పత్రం, అర్జున(మద్ది) పత్రం,అర్కా పత్రం, సింధువార పత్రం,మరువక పత్రం,బృహతి పత్రం, అపామార్గ పత్రం,కర వీర పత్రం,చుర పత్రం,బదరి పత్రం, దాడిమి పత్రం,జాజి పత్రం,గండంకి పత్రం,మాచి పత్రం,దుత్తురా (ఉమ్మెత్త) పత్రం. ఈ విధంగా పృద్వి నుండి వచ్చిన అనేక ఔషధాలతో ఆరాధించి సకల రోగాలను నయం చెలుకోవ దానికే. ఈ విధంగా సంపూర్ణమైన జాగ్రతకు సంకేతం పాత్రులు. మేధాసంపత్తి కి చిహ్నం గజాననుడు.నిశిత పరిశీలకుడు గణపతి. ఇలా అనేక రకాలుగా చెప్పుకోవచ్చు.వినాయక చతుర్థి రోజున చేరువునుండి తెచ్చిన మట్టితో వినాయకుని ప్రతిమను చేసి తిరిగి అక్కడే నిమజ్జనం చేయడం విశేషం. వీలైనంత వరకు మట్టితో చేసిన చిన్న విగ్రహాన్ని పూజించాలి. దేవుడిని మనసారా కొలవాలి, అంతేగాని ఆడంబరంగా కాదు.మట్టి విగ్రహాన్ని ఇంట్లోనే ఓ బకెట్ నీళ్లలో నిమజ్జనం చేసి కరిగాక చెట్టుకి పోయాలి కళా హృదయం ఉన్న వాళ్ళైతే చేతులతోనే చేసేస్తుంటారు. మనస్సుంటూ ఉండాలేగాని ,ఇలా ఎన్నో మార్గాలు ఉంటాయి. పద్దతి ఏదైనా పండగను పర్యవరణానికి హాని లేకుండా జరువుకోవడమే ముఖ్యం.ఎన్నో ఆధునిక సంప్రదాయ విశేషాలు కల్గిన ఈ భాద్రపద శుద్ధ చతుర్థి రోజున ఆ మహాగణపతిని ప్రతీ వారు తమకు నచ్చిన విధంగా బుద్ధి కుశలతతో, శ్రద్ధ,భక్తులను, విద్యా, వివేకాలను ప్రసాదిం చాల్సిందిగా వి నాయకుని వేడుకుంటే అన్ని శుభాలే ప్రసాదిస్తాడు ఆ భక్త సులభుడు.ఈ వినాయక చవితి రోజున ఆ భక్త సులబుని స్మరించు కుంటు...ఆ లంబోధరుని ఆశీస్సులు పొందుదాం.



**- టి.సంయుక్తాకృష్ణమూర్తి**

# పెంకులూ ప్రయోజనమే!

ఆరోగ్యమని కోడిగుడ్లను తింటాం... వాటి పెంకుల్ని మాత్రం వ్యర్థాలుగా భావించి పారేస్తాం.. కానీ, వీటితో బోలెడు ఉపయోగాలున్నాయి. అవేంటంటారా? కోడిగుడ్డు పెంకుల్ని మట్టిలో కలిపితే.. దానికి తగిన కాల్షియం చేకూరి సారవంతమవుతుంది. అలానే ఈ గుల్లల్ని నారు పోయడానికి ఉప యోగించొచ్చు. మొలక దాన్ని నేరుగా మట్టిలో పెట్టేస్తే అందులో అక్కడ కలిసి పోతుంది. మొక్క ఆరోగ్యం గానూ ఎదుగుతుంది.
అంతేకాదు, ఈ పెంకుల్ని మెత్తగా నూరి మట్టిలో వేస్తే నత్తలు, ఆకుతొలుచు పురుగులను నివారించ వచ్చు. గుడ్డు పెంకులను... పొడి చేసి సబ్బు లేదా బేకింగ్ సోడాతో కలిపి లోహపు పాత్రలు, మట్టి కుండల్ని రుద్దితే గీతలు పడకుండా త్వరగా శుభ్రపడతాయి. ఈ మిశ్రమం తో బాత్రూమ్ టైల్స్‌ని కూడా సులువుగా క్లీన్ చేయొచ్చు. అంతేకాదు. అప్పుడప్పుడూ సింక్ గొట్టాలు మూసుకుపోతుంటాయి. ఇలాంటప్పుడు వీటిని పొడిచేసి వేస్తే నీళ్లు సాఫీగా వెళ్తాయి. చేతులకు దుస్తులు మరకలు అంటినప్పుడు ఓ పట్టాన వదలవు. ఇలాంటప్పుడు సబ్బులో కాస్త గుడ్డు పెంకుల పొడిని కలిపి రుద్దితే సరి... వదిలిపోతాయి.



# ఆధునిక బోధనలో అభ్యాస దీపికలు

జీవశాస్త్రంలో ఏ పాఠ్యాంశాన్నైనా విద్యార్థుల కళ్లకు కట్టినట్టుగా వివరించడంలో ఆమె దిట్ట. అలాగే విద్యార్థుల్లో ఆసక్తి కలుగచేయడంలో ఆమెకు ఆమెయే సాటి. వారితో ప్రయోగాలు చేయిస్తారు. ఇందుకోసం సాంకేతికతను వినియోగిస్తారు. విద్యారుల్లో ఆసక్తి కలిగి పాఠ్యాంశాలలో లీనమయ్యేలా చేస్తారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయినిగా మారం పవిత్ర అనుసరిస్తున్న బోధనా పద్ధతులు విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చాయి. జాతీయ స్థాయిలో ఏటా ప్రతిష్ఠాత్మకంగా అందించే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి మారం పవిత్రను ఎంపిక చేసింది. దేశవ్యాప్తంగా 44 మంది ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను ఈ అవార్డు కోసం ఎంపిక చేశారు. శ్రీదేవి విశాఖ జిల్లా భీమిలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. సెప్టెంబరు5న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుండి ఈ అవార్డు స్వీకరిస్తారు.





నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన మారంగ పవిత్ర పదో తరగతి వరకు వేములపల్లి తడకమళ్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివారు. ఇంటర్, డిగ్రీ మిర్యాలగూడలోని ప్రైవేట్ కళాశాలలో చదివారు. కాగా చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరికి చెందిన టీచర్ నాతాల మన్మథరెడ్డతో ఆమెకు వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో బిఇడి, డిఇడి పూర్తిచేసి 2008 డిఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. 2009లో మొదటగా ఆత్మకూర్(ఎస్) మండలం రామన్నగూడెం యూపిఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు చేపట్టారు. 2012 నుంచి 2015 వరకు గోరెంట్ల జెడ్పిహెచ్‌లో, ఆ తర్వాత గడ్డిపల్లి జెడ్పిహెచ్ఎస్‌లో ప్రస్తుతం పెన్‌పహాడ్‌లో పనిచేస్తున్నారు. విద్యార్థులను శాస్త్రజులుగా చేయాలన్న ఆకాంక్షలే ఆమెలో సజీవ పాఠ్యబోధనా శక్తిని పెంపొందించాయి .తన ఉద్యోగ జీవితంలో కనీసం ఒకరిద్దరు విద్యార్థుల నైనా శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యార్థులు సిద్ధాంత పరంగా నేర్చుకున్న విషయాలు ప్రయోగపూర్వకంగా నిర్ధారణ చేసుకునే అవకాశం, పరిస్థితులను ఉపాధ్యా యులు కల్పించాలి. సైన్స్ అభ్యసనంలో ప్రయోగాత్మక ఆంశాలకు అధిక ప్రాధాన్యమిస్తే విద్యార్థులకు నేర్చుకోవడం సులువు అవుతుంది. జాతీయ స్థాయిలో సిఐఈటి, ఎన్ఐసిఆర్‌టి, యూట్యూబ్ చానల్ ద్వారా 2020-21లో ఉపాధ్యాయు లకు ఉపయోగపడే ఐసిటి టూల్స్‌పై పవిత్ర అవగాహన తరగతులు అందించారు. 2019లో విద్యా విధానంపై జాతీయ స్థాయి సెమినార్‌లో ‘సైన్స్ టీచింగ్ త్రూ హ్యాండ్స్’ అనే అంశంపై ప్రసంగించారు. 2017 నుంచి ఇప్పటివరకు స్టేట్ ఇని డిగ్రీ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ (ఎస్ఐఈటీ) ద్వారా జీవశాస్త్రంలో 14 డిజిటల్ పాఠాలను బోధించారు. తెలంగాణ పాఠ్యపుస్తకాల్లో 6, 7 తరగతులు, సామాన్య శాస్త్రం 8, 9, 10 తరగతుల జీవశాస్త్రం పాఠ్య పుస్తకాలలోని క్యూ ఆర్ కోడ్‌లలో కంటెంట్ తయారీకి ఎస్‌సిఇఆర్‌టి దీక్ష ఆధ్వర్యంలో 60 వీడియోలు, 16 క్వశ్చన్ సెట్‌లను తయారు చేశారు. వాటిని ఎస్‌సిఇఆర్‌టి క్యూ ఆర్ కోడ్ పబ్లిష్ చేశారు. ఎస్‌సిఇఆర్‌టి ఆధ్వర్యంలో తొమ్మిదో తరగతి విద్యార్థుల వర్క్ షీట్ల తయారీ, పదోతరగతి విద్యార్థుల పరీక్షలపై ఒత్తిడి తగ్గించడానికి ఎస్‌సిఇఆర్‌టి రూపొందించిన జీవశాస్త్ర అభ్యసన దీపికల్లో పాల్గొన్నారు. జీవశాస్త్ర శిక్షణ, అభ్యసన, ఫలితాలకు సంబంధించి 2016-19, 2020-21 సంవత్సరాల్లో రాష్ట్రస్థాయి సెమినార్లలో పాల్గొన్నారు. కోవిడ్ సమయంలో యూట్యూబ్ ఛానల్ ద్వారా 50 వీడియో లను రూపొందించి వాట్సాప్ ద్వారా విద్యార్థులకు అందించారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ యూట్యూబ్ ఛానల్ ద్వారా పదో తరగతి విద్యార్థుల కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ, హోమ్ సైన్స్ పాఠాలు బోధించారు. 2019లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ టీచర్ అవార్డు, 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు, టెక్ మహీం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నిర్వహించిన సైన్స్ ఉపాధ్యాయ పోటీల్లో ట్రాన్స్ ఫార్మింగ్ అవార్డు, 2023లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా సారాబాయి టీచర్ సైంటిస్ట్ నేషనల్ అవార్డును జమ్మూ కాశ్మీర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రవిశంకర్ నుండి అందుకున్నారు. 2023’24లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు పొందారు. 2025 జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు.

**తెలుసుకోండి : జాతి సేవలో తరించండి‘ !**
**-జాతీయ ఉపాధ్యాయినిగా**

శ్రీదేవి విశాఖ జిల్లా భీమిలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. 24 సంవత్సరాలుగా బోధనా వృత్తిలో ఉన్న ఆమె నాలుగేళ్లుగా ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ‘కం టు లెర్న్ అండ్ గో టు సర్విస్ నేషన్’ అనే విధానంతో ఆమె విద్యార్థుల పాఠ్యాంశా లను బోధిస్తున్నారు. ఆధునిక బోధన విధానంలో డిజిటల్ బోర్డు విని యోగంతోపాటు ఆయా పాఠ్యాంశా లను ప్రాక్టికల్‌గా వివరిస్తూ, వాటిపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులతో పలు అంశాలకు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల పాఠ్యాంశాలు బాగా అర్థమై విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. 2015లో 8వ తరగతి విద్యార్థుల వర్షం నీటితో భూగర్భ జలాలను ఎలా పెంచాలనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో ఐదో స్థానం లభించింది. అలాగే గూగుల్ ఫర్ విద్యాకేషన్‌లో ప్రత్యేక గుర్తింపు లభించింది. వినూత్న బోధన: ఫలితాల విశ్లేషణపై గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆమెను గత ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక చేసింది. ఆమె బోధనా నేపథ్యమే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికకు దారితీసింది . ఈ అవార్డును సెప్టెంబరు 5వ తేదీ ఢిల్లీలో రాష్ట్రపతి ప్రదానం చేయనున్నారు. మారుతున్న విద్యావిధానాలు, సాంకేతిక పద్ధతులకు అనుగుణంగా విద్యార్థులకు బోధించడం, తద్వారా వారిలో మంచి ఆలోచనను రేకెత్తించడం వలన వారిలో ద్విగుణీకృతమైన సశాస్త్రీయ ప్రతిబను బయటకు తీయవచ్చు. ఇదే ప్రతి విద్యార్థిమంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా భవిష్యత్తులో మంచి ఫలితాలు పొందుతారని ఆమె నమ్మకం, ఆ నమ్మకంతోనే విద్యాబోధన చేస్తుండడంతో ఆమె ఉత్తమ ఉపాధ్యాయిని కాగలిగింది.







# నిమిషంలో మండపం అలంకరణ..



చిన్నా, పెద్దా మెచ్చే వినాయకచవితి పండగలో గణేశుడి ఆసనం.. అలంకరణది ప్రత్యేక స్థానం. ఇతరుల కంటే వైవిధ్యంగా మండపాన్ని తీర్చిదిద్దడానికి పోటీలు పడుతుంటారు. అయితే ఈ సారి మీకంత శ్రమ అక్కర్లేకుండా రెడీమేడ్‌గా దొరుకుతున్నాయివి. కోరుకున్నట్లు కస్టమైజ్ చేసే ఈ డెకార్ స్టాండులనీ, అలంకరణ సామగ్రిని అందిస్తున్నారు వెండార్లు. వీటితో క్షణాల్లో విఘ్నేశ్వరుడి కోసం వేదికను తీర్చిదిద్దొచ్చు. అంతేకాదు, తర్వాత వాటిని జాగ్రత్తగా వాడుకోవచ్చు. వాటినోసారి మీరూ చూసేయండి.









# వినాయక ప్రసాదాలు



## తీపిఉండ్రాళ్లు...

**కావలిసినవి :** బియ్యప్పిండి: 1 కప్పు, నెయ్యి: కొద్దిగా ఉప్పు, చిటికెడు నీళ్లు : 1 కప్పు.
ఉండ్రాళ్లలో నింపడానికి... పచ్చికొబ్బరి కోరు: 1 కప్పు కొబ్బరి పొడి: 1/2 కప్పు, వేయించిన గసాలు, కొద్దిగా యాలకుల పొడి: 1/2 స్పూను.
**తయారు చేసే విధానం :** కొబ్బరి, బెల్లం, యాలకుల పొడి, గసాలు కలిపి ఒక పాన్‌లో వేడి చేయ్యాలి. ఈ మిశ్రమం కాస్త ఉండకట్టే మాదిరి అయ్యేవరకు ఉంచి దించాలి. ఒక గిన్నెల్లో నీళ్లు తీసుకుని వేడి చెయ్యాలి. కప్పు నెయ్యివేసి మరిగిన తరవాత బియ్యప్పిండి కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు కట్టకుండా కలుపుతుండాలి. తక్కువ మంట పైన పిండిని ఉడికించి గట్టిపడిన తరువాత దీన్ని ఒక వెడల్పాటి పళ్లెంలోకి తీసుకుని చల్లార్చాలి. పిండిని నెయ్యి రాసుకున్న చేత్తో కలిపి చిన్న ఉండను తీసుకుని బాల్‌లాగా తయారుచేసి అందులో కొబ్బరి పాకాన్నికొద్దిగా ఉంచి మూసివేసి గుండ్రంగా ఉండ్రాళ్లలా చుట్టాలి. వీటిని వేడిగా/చల్లారాక నేతితో కలిపి తింటే ఎంతో రుచిగా ఉంటాయి.

## కుడుములు

**కావలసిన పదార్థాలు :** నానబెట్టిన మినప్పప్పు:1 కప్పు ఇడ్లీరవ్వ: 2 కప్పులు, తగినంత పనస అకులు : కొన్ని
**తయారు చేసే విధానం :** మినపప్పును ఇడ్లీ పిండిలా తయారు చేసుకోవాలి. పనస ఆకులనుపై పిండిని కొద్ది వేసి ఆకులతో సహా ఆవిరి మీద ఉడికించాలి. ఈ కుడుములను కొబ్బరిచట్నీ లేదా నువ్వుల చట్నీతో తినవచ్చు. పనస ఆకులతో ఉడికించిన ఈ కుడుములు ఆరోగ్యానికి చాలా మంచిది.



## తాలికలు :



**కావలసినవి :** గోధుమపిండి : 1/4 కప్పు, నీళ్లు: సరిపడినన్ని, యాలకులపొడి: చిటికెడు, బియ్యపిండి : ఒక కప్పు.
**తయారు చేసే విధానం :** గోధుమ పిండి, చపాతీ పిండిలా కలుపుకొని సేమియాలా సన్నగా పాలికలు తయారు చేసుకొని వెడల్పాటి పళ్లెంలో వేసుకొని ఆరనివ్వాలి. ఒక గిన్నెలో రెండు కప్పుల నీళ్లు పోసి తాలికలు ఉడికించాలి. తరువాత పొడిగా చేసిన బెల్లం వేసి మరికొంతసేపు ఉడికించి, తర్వాత బియ్యప్పిండి నీళ్లల్లో కలిపి మరిగే నీళ్లల్లో ఉండలు కట్టకుండా వేసుకోవాలి. కొద్దిగా ఉడికిన తరువాత యాలకుల పొడి వేయాలి. ఇష్టమైనవారు ఇందులో పాలు కూడా పోసుకోవచ్చు.

# ఆరోగ్యకరమైన హద్దులు పెట్టుకోండి

నాయకత్వ స్థానాల్లో ఉన్న చాలామంది మహిళలు ఈ లైకబిలిటీ అనే ఉచ్చులో పడుతుంటారు. అందరిలో మంచివాళ్లుగా పేరొందాలనుకునే తాపత్రయమే ఇది. అయితే, నాయకత్వం అంటే అదొక్కటే కాదు కదా! అవసరమైనప్పుడు కచ్చితత్వంతోనూ, డిమాండింగ్‌గానూ ఉండాలి. కచ్చితత్వంతో ఉండడానికీ, అందరూ ఇష్టపడేలా ఉండడానికీ మధ్య సన్నని వ్యత్యాసం ఉంటుంది. కచ్చితత్వంతో ఉండడానికీ, అందరూ ఇష్టపడేలా ఉండడానికీ మధ్య సన్నని వ్యత్యాసం ఉంటుంది. మహిళా నాయకురాలిగా ఈ రెండింటినీ సమన్వయం చేసుకోవడం సవాలే. ఎందుకంటే ఎక్కడ మన గురించి చెడుగా అనుకుంటారో అనే భయం. దాంతో బృంద సభ్యులే ఇలా ఇబ్బందికర కామెంట్లు చేస్తున్నా ఏమీ అనలేక పోతారు. ముందు మీరు ఎలాంటి సంశయాలు లేకుండా వాళ్లతో నేరుగా మాట్లాడండి. టీమ్ సభ్యులు ఎలా ప్రవర్తించాలనే విషయాన్ని వాళ్లకు అం మయ్యేలా చెప్పండి. మీ మధ్య ఆరోగ్యకరమైన హద్దులూ పెట్టుకోండి. వాటిని వాళ్లు దాటకుండా చూడండి. అప్పుడే మీరు పనిచేయగలుగుతారు. వాళ్లతోనూ పనిచేయించ గలుగుతారు. ఎన్ని చెప్పినా వాటిని పాటించని వాళ్లూ ఉంటారు. అటువంటి వాళ్లను ఎలా డీల్ చేయాలన్నదీ ముందే ఆలోచించు కోవాలి. దానివల్ల ఇలాంటివి మరెప్పుడైనా ఎదురైతే తేలిగ్గా ఎదుర్కో గలుగు తారు. దాన్ని చూసైనా మిగతా వారు జాగ్రత్తగా, హుందాగా మసలుకుంటారు.





# సింక్‌ఫీల్డ్ కప్‌లో గుకేష్ ఓటమి

## ఫిరోజ్జాను ఓడించి ఆధిక్యంలో ప్రజ్ఞా

**న్యూఢిల్లీ:** సింక్‌ఫీల్డ్ కప్-2025లో ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ వెస్లీ సో చేతిలో ఓడిపోయాడు. మరో టోర్నీలో ఫిరోజ్జాను ఓడించి ప్రజ్ఞానంద ఆధిక్యంలో ఉన్నాడు. సింక్‌ఫీల్డ్ కప్‌లో భాగంగా మంగళవారం జరిగిన టోర్నీలో గుకేష్ రూయ్ లోపెజ్‌లో అమెరికన్ చేతిలో పరాభవం చెందాడు. గుకేష్ బ్లాక్ పావులతో ఆడి వెస్లీ సో చేతిలో సంచలన ఓటమితో టోర్నమెంట్‌లో అతని కష్టాలు మరింత పెరిగాయి. మ్యాచ్‌లో 39 ఎత్తుగడల తర్వాత చివరికి రాజీనామా చేశాడు. గుకేష్ ఇప్పుడు ఏడు రౌండ్లలో కేవలం 3 పాయింట్లతో స్టాండింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. అతను టోర్నమెంట్‌లో 4 డ్రాలు, ఒక విజయం, 2 ఓటములతో ఉన్నాడు. ఇక మరో మ్యాచ్‌లో భారత ఆటగాడు ప్రజ్ఞానంద రమేష్‌బాబు అలిరేజా ఫిరోజ్జాను ఓడించాడు. ఏడో రౌండ్‌లో ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్‌పై, నల్లటి పావులతో ఆడుతున్న ప్రజ్ఞానంద సిసిలియన్ రక్షణను ఉపయోగించాడు. ప్రజ్ఞానంద ఓపెనింగ్ నుంచే కొంచెం మెరుగైన స్థానాన్ని పొందాడు. తదుపరి 19వ ఎత్తుగడతో డిఫైల్‌పై ఫిరోజ్జా నుండి అకాల పాన్ పుష్ అవకాశాన్ని 20 ఏళ్ల ప్రజ్ఞానంద అందిపుచ్చుకున్నాడు. చివరకు 12 ఎత్తుగడల తర్వాత ఫిరోజ్జా రాజీనామా చేయవలసి వచ్చింది. ఈ విజయంతో 2025 సింక్‌ఫీల్డ్ కప్‌లో అజేయంగా నిలిచిన ప్రజ్ఞా 7 పాయింట్లలో 4.5 పాయింట్లు సాధించాడు. రెండు రౌండ్ల ఆట మిగిలి ఉండగా, అతను ఇప్పుడు ఫాబియానో కరువానాతో కలిసి సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నాడు.



## కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లు..

# కోయెల్ వరల్డ్ రికార్డ్

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కోయెల్ బార్ యూత్ వరల్డ్ రికార్డ్ సృష్టించింది. అహ్మదాబాద్‌లో మంగళవారం జరిగిన యూత్ ఈవెంట్‌లో పోటీ పడుతున్న కోయెల్ మొత్తం 192 కిలోల బరువును ఎత్తి ప్రపంచ రికార్డు సృష్టించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. మహిళల 53 కిలోల యువతకు ప్రపంచ ప్రమాణం 188 కిలోలు కాగా,ఈ మార్కును కోయెల్ సులభంగా అధిగమించింది. కోయెల్ క్లీన్ అండ్ జెర్క్‌లో 107 కిలోలు విజయవంతంగా ఎత్తి ప్రపంచ రికార్డును కూడా సృష్టించాడు. దీనికి ప్రపంచ ప్రమాణం 105 కిలోలుగా నిర్ణయించబడింది. స్నాచ్‌లో, 17 ఏళ్ల భారతీయుడు ప్రపంచ ప్రమాణం 85 కిలోలకు సరితూగాడు. అంతకుముందు రోజు, ప్రీతిస్మిత భోయ్ మహిళల 44 కిలోల విభాగంలో స్వర్ణం గెలుచుకుని భారత ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. భోయ్ మొత్తం 150 కిలోలు (స్నాచ్‌లో 63 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 87 కిలోలు) ఎత్తి పోడియంపై అగ్రస్థానంలో నిలిచింది.

# టి20 క్రికెట్ కెరీర్‌లో నో సెంచరీ

## పరుగుల్లో మాత్రం హీరోస్.. టాప్ 5లో ధోనీ, గంభీర్




**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్ 2003 లో ప్రారంభమై తక్కువ సమయంలోనే ప్రజాదరణ పొందింది. ప్రస్తుతం, ఈ లీగ్‌లు ప్రపంచవ్యాప్తంగా ఆడుతున్నారు. ఒక ఆటగాడు అనేక లీగ్‌లలో ఆడవచ్చు. అందుకే వారికి పరుగులు సాధించడానికి మరియు వికెట్లు తీయడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ, టీ20 లో చాలా మంది గొప్ప ఆటగాళ్ళు తమ మొత్తం కెరీర్‌లో సెంచరీ మాత్రం సాధించలేకపోయారు. అలాంటి టాప్ 5 మంది గొప్ప ఆటగాళ్లలో భారత్ నుండి ఎంఎస్ ధోనీ, గౌతమ్ గంభీర్ ఉన్నారు. పాకిస్తాన్ స్టార్ ఆల్ రౌండర్ షోయబ్ మాలిక్ టీ20 క్రికెట్‌లో గొప్ప ఆటగాళ్లలో ఒకరిగా పరిగణించబడ్డాడు. అతను 557 మ్యాచ్‌ల్లో దాదాపు 36 సగటుతో 13571 పరుగులు చేశాడు. ఇందులో 83 అర్ధ సెంచరీలు ఉన్నాయి కానీ అతను ఒక్క సెంచరీ కూడా చేయలేకపోయాడు. అతని అతిపెద్ద ఇన్నింగ్స్ 95 పరుగులు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ విధ్వంసక బ్యాటింగ్‌కు పేరుగాంచాడు. వన్డే మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డును అతను కలిగి ఉన్నాడు. అయినప్పటికీ, మోర్గాన్ టీ20లో సెంచరీ చేయలేకపోయాడు. అతను 371 మ్యాచ్‌ల్లో 7780 పరుగులు చేశాడు. ఇక భారత జట్టు మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ మహేంద్ర సింగ్ ధోని కూడా టీ20లో సెంచరీ చేయలేకపోయాడు. 405 మ్యాచ్‌లు ఆడిన ధోని దాదాపు 38 సగటుతో 7628 పరుగులు చేశాడు. ధోని అతిపెద్ద ఇన్నింగ్స్ 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. శ్రీలంక దిగ్గజ బ్యాట్స్‌మన్ కుమార్ సంగక్కర కూడా టీ20 క్రికెట్‌లో సెంచరీ చేయలేకపోయాడు. 2004 మరియు 2020 మధ్య ఈ ఫార్మాట్‌లో అతను 267 మ్యాచ్‌లు ఆడాడు. 43 అర్ధ సెంచరీలతో 6937 పరుగులు చేశాడు. అతని అత్యధిక స్కోరు 94 పరుగులు. చివరిగా ప్రస్తుత టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన కెరీర్‌లో ఎప్పుడూ టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. అతను తన టీ20 కెరీర్‌లో 251 మ్యాచ్‌లు ఆడి 6402 పరుగులు చేశాడు.



# యూఎస్ ఓపెన్‌లో.. అల్కరాజ్ శుభారంభం..

## విలియమ్స్ ఔట్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ 2025లో రెండో సీడ్, స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో అల్కరాజ్ 6-4, 7-5, 6-4 తేడాతో అమెరికా ప్లేయర్ రీల్లీ ఓపెల్కాను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. రెండు గంటల ఐదు నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. 14 ఏస్‌లు కొట్టడంతో పాటు 6 డబుల్ ఫాల్ట్స్ చేశాడు. 32 అనవసర తప్పిదాలు చేసినప్పటికీ తను అనుభవాన్ని ఉపయోగించి అల్కరాజ్ విజయం సాధించాడు. బుధవారం జరిగే రెండో రౌండ్‌లో అల్కరాజ్.. ఇటాలియన్ టెన్నిస్ ప్లేయర్ మట్టియా బెల్లుసితో తలపడనున్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో బ్రిటన్‌కు చెందిన ఐదో సీడ్ జాక్ డ్రేపర్ 6-4, 7-5, 6-7(7), 6-2తో అర్జెంటీనా క్వాలిఫైయర్ ఫెడెరికో అగస్టిన్ గోమెజ్‌పై విజయం సాధించాడు. నార్వేకు చెందిన 12వ సీడ్ కాస్పర్ రూడ్ 6-1, 6-2, 7-6(5) తేడాతో ఆస్ట్రియాకు చెందిన సెబాస్టియన్ ఆఫ్నర్‌ను ఓడించాడు. ఇక మహిళ సింగిల్స్‌లో సంచలన ఫలితం నమోదైంది. స్టార్ ప్లేయర్ వీనస్ విలియమ్స్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన కరోలినా ముచోవా చేతిలో 6-3, 2-6, 6-1 తేడాతో ఓటమిపాలైంది. కజకిస్తాన్‌కు చెందిన తొమ్మిదో సీడ్ ఎలెనా రిబాకినా 6-3, 6-0 తేడాతో అమెరికా ప్లేయర్ జులియెటా పరేజాను ఓడించి రెండో రౌండ్‌లోకి సులువుగా ప్రవేశించింది. రెండుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ బార్బోరా క్రెజిసికోవా 6-3, 6-2 తేడాతో కెనడియన్ ఓపెన్ విజేత విక్టోరియా ఎంబోకోను ఓడించింది.



# గ్లోబల్ ఇవి గేమ్‌లోకి భారత్ ఎంట్రీ

## మోడీ చేతుల మీదుగా మారుతీ సుజుకీ ఇవి ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం గుజరాత్‌లోని హన్సల్‌పూర్‌లో రెండు కీలక ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారు. మారుతీ సుజుకీ మోటార్ ప్లాంట్‌లో మొట్టమొదటి గ్లోబల్ స్ట్రాటజిక్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం (బిఈవి) ఇ-విటారాతో పాటు కొత్త హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్ ఉత్పత్తి చేసే ప్లాంటును ప్రధాని జెండా ఊపి ఆరంభించారు. ఇవిటారా భారతదేశంలో పూర్తి స్థాయిలో తయారుచేసిన తొలి ఎలక్ట్రిక్ కారు.100 కంటే ఎక్కువ దేశాలకు రవాణా చేయాలనే లక్ష్యంతో ఈ ప్లాంట్ మొదలైంది. క్లీన్ ఎనర్జీ తయారీ, గ్రీన్ మొబిలిటీకి ప్రపంచ కేంద్రంగా మారాలనే భారతదేశం ఆశయంలో ఇదొక కీలక ముందడుగు. ఈ కార్యక్రమానికి గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జపాన్ రాయబారి కీచీ ఒనో కూడా హాజరయ్యారు. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో సుజుకీ మోటార్ ప్లాంట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుజుకీ తయారుచేసిన మొట్టమొదటి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం అయిన(బిఈవి) అయిన ఇ-విటారాజును ప్రారంభించారు. భారతదేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ జనవరి 2025లో జరిగిన ఇండియా మొబిలిటీ గ్లోబల్ ఎక్స్ పోలో ఇవిటారాను ప్రదర్శించింది. పూర్తి స్థాయిలో ఇండియాలో తయారైన ఈ ఈవీ కారును జపాన్, యూరోపియన్ మార్కెట్లతో సహా 100 కంటే ఎక్కువ దేశాలకు ఎగుమతి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతి ప్రారంభంతో పాటు డెన్సో, తోషిబా, సుజుకీల జాయింట్ వెంచర్ అయిన టిడిఎస్ లిథియం-అయాన్ బ్యాటరీ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని ప్రధాని మోదీ ఆరంభించారు. ఇందువల్ల 80 శాతం హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ భాగాలు స్వదేశంలోనే ఉత్పత్తి అవుతాయి. ఇది దేశంలో నిజు బ్యాటరీ ఉత్పత్తిని పెంచేందుకు దోహదపడుతుంది. తద్వారా భారత్ దిగుమతి కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. మారుతీ సుజుకీ తన తొలి ఎలక్ట్రిక్ కారును 2025 జనవరిలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ కారు రెండు బ్యాటరీ వేరియంట్లలో లభ్యం అవుతుంది. 49 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీ 144 హెచ్‌పి శక్తిని,189 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. అలాగే 61 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీ 174బిహెచ్‌పి శక్తిని, 189 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది.









Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.